# కథామంజరి


## పది కథల సమాహారం



ఆగష్టు 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

**ఆగష్టు 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 8



అందరికీ

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

కథామంజరి



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i
విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii
కథా మార్గదర్శి ... ... ... ... ... ... iii
కథా పరిచయం ... ... ... ... ... ... v
కథాపుస్తక విశ్లేషణ ... ... ... ... ... ... viii
వినదగునెవ్వరు చెప్పిన .. ... ... ... ... ... ... ix
అక్షరాక్షతలు ... ... ... ... ... ... xii


## కథలు


| | | |
|---|---|---|
| ఒక ప్రేమకథ ... | కందలగడ్డ పావని ... ... | 1 |
| నడిచే శవాలు ... | పద్మావతి రాంభక్త ... ... | 7 |
| రెండు ఉత్తరాలు ... | కోయిలాడ రామమోహనరావు ... | 13 |
| జాలిగుండె ... | బొందల నాగేశ్వరరావు ... ... | 18 |
| చట్టంలో లేని తీర్పు ... | అనంతపట్నాయకుని కిశోర్ ... | 24 |
| మండుటెండ ముసురు ... | వడలి రాధాకృష్ణ ... ... | 32 |
| ఏనుగు సమయస్ఫూర్తి ... | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య ... | 37 |
| చిలుక సాయం ... | కూచిమంచి నాగేంద్ర ... ... | 39 |
| తప్తశిల ... | శ్రీమతి చిల్లర భవానీ దేవి ... | 42 |
| క్లబ్బులో చెట్టు కథ ... | కీ. శే. వేలూరి వేంకటేశ్వర రావు ... | 46 |


Cover Page Credit : Mr Vinishruth M, Virginia US



# కథాకీయం

కొంతమంది వ్రాసే వ్యాసాలు, ఉపన్యాసాలు, వార్తలు, వింతలు, గతులు, గతాలు.. ఇవన్నీ కూడా కథల్లా అలరిస్తాయి. వారు వాడే భాష, శైలి పాఠకుల్ని కట్టి పడేస్తుంది. ఆసక్తికరంగా చదివిస్తుంది. చివరికి విజ్ఞానం లేదా ఇతర శాస్త్రపరమైన విషయాలు, ఆధ్యాత్మిక చింతనలు కూడా వారి శైలిలో చదువరులను అలరిస్తాయి! విషాదాన్ని కూడా రాయవలసిన రీతిలో వ్రాయగలిస్తే.. చదివినప్పుడు మనసు చలిస్తుంది. గుండె బరువెక్కుంది. ఏదైనా చదువుతున్నప్పుడు, అందులోని విషయం దృశ్యంలో కనబడేటట్టు అనుభూతి కలిగిందంటే.. ఆ శైలి, భాష అమోఘమని కితాబు ఇవ్వాలి!

ఈ మధ్య డా. చిల్లర భవానీదేవిగారి "మా ఊరు ములుకుదురు" పుస్తకం చదువుతుంటే.. గాంధీజీ గారి 'ఆత్మకథ' గుర్తుకొచ్చింది. డా. భవానీదేవిగారు తను పుట్టి పెరిగిన ఊరు, వారి తాత, తండ్రుల జీవితం.. ఇవన్నీ కథలుగా రాశారు. అలాగే ఎప్పుడో 70 ఏళ్ల కిందట గాంధీజీ గారి 'మై ఎక్స్‌పెరిమెంట్ విత్ ట్రూత్' అనే ఆంగ్ల పుస్తకాన్ని 'సత్యశోధన' పేరిట తెలుగులో అనువాదం చేసారు. నేను ముప్పై నలభై సంవత్సరాల క్రిందట చదివాను. ఆ పుస్తకం చాల మంది పాఠకుల్ని చాలా ప్రభావితం చేసిందనే చెప్పాలి. అలా ప్రభావితం చేయడానికి గాంధీజీ జీవితం ఒకెత్తు అయితే, ఆ కథ వ్రాయడంలో ఉపయోగించిన భాష, శైలి, శిల్పం, సంభాషణలు వగైరాలు మరో ఎత్తు అని చెప్పాలి! ముఖ్యంగా ఓ మార్గదర్శక పుస్తకంగా గుర్తింపు పొందేటట్టు తెలుగులో అనువదించిన కీ.శే. తుమ్మల సీతారామమూర్తి గారికి తెలుగువారు ఎంతో ఋణపడి ఉన్నారని చెప్పాలి.

సరే.. ఇప్పుడు ఈ విషయాలు ప్రస్తావించడానికి కారణం ఒకటే.. ప్రతీవారి జీవితంలో మంచి, చెడులతో పాటు.. మంచి జ్ఞాపకాలు ఉంటాయి, అనుభూతి, అపురూపమైన బాల్యం, జీవితం, జీవిత పాఠాలతో పాటు.. కుటుంబ చరిత్ర ఉంటుంది. ఒకప్పుడు చాలామంది డైరీలు రాసేవారు. ఇప్పుడు అవీ కనబడటం లేదు! అంచేత.. మన జీవితాన్ని మనమే అక్షరరూపంలో నిక్షిప్తం చేస్తే, రాబోయే తరం వారికి అవి తెలియచేయడానికి వీలు కలుగుతుంది. వెనుక ఏడు తరాల గురించి తెలియకపోవచ్చు.. కనీసం వెనుక రెండు తరాలవారిని సాధారణంగా గుర్తు పెట్టుకుంటాం! వాటినైనా రాసుకుని ఉంచితే.. వచ్చే తరాలవాళ్ళకి ఉపయుక్తంగా ఉంటుంది. అయితే.. ఇవి రాయడానికి రచయితై ఉండనక్కర్లేదు. కనీస భాషాజ్ఞానం ఉంటే.. ఎవరికి వారు రాసుకోవచ్చును. లేదా తెలిసిన రచయితలుంటే.. వారిచేత వ్రాయించొచ్చును.

ఓ మంచి శైలితో కథనంగా వ్రాసిన, ఈ 'ఆత్మకథ' లను, ఈరోజు చదువుకుంటే, ఎలాంటి అనుభూతి కలగకపోవచ్చును. కాని కొంతకాలం తర్వాత చదివితే, ఆ 'కథ' అపురూపంగా అనిపిస్తుంది. భవిష్యత్తులో ఆ తరం చదివితే.. ఎంత ఆనందం కలుగుతుందో వర్ణించడం కష్టం!

కథ ఏదైనా సరే.. అది ఇచ్చే కిక్కే వేరబ్బా!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి


**డా. సి. భవానీదేవి**

ఓ కాలక్షేపానికో, పేరు సంపాదించడానికో రచనలు చేయడం కాకుండా.. సమాజానికి ఉపయోగపడాలనే తపన, చిత్తశుద్ధితో రచనలు చేసే రచయితలు కొద్దిమందైనా అన్ని తరాలలో మనకు సాక్షాత్కరిస్తారు. అలాంటి వారి రచనలే.. వారి ఆలోచనల్ని, దృక్పథాన్ని తెలియచేస్తాయి. వారి రచనలు చదివితే చాలు.. వారి వ్యక్తిత్వం కూడా ఇట్టే పసిగట్టవచ్చును. ఆ లక్షణాలు పుష్కలంగా అలవడడానికి.. సాహిత్య పరిమళాలు విరజిమ్మే కుటుంబ నేపథ్యంలో జన్మించినా సరే.. ఆ బాటలో నడిచి, కలం పట్టినవారు బహు తక్కువే అని చెప్పాలి. అలాంటి నేపథ్యంలో పుట్టి, కలం చేతబట్టి, అతి సరళమైన శైలి, భాష, కథనాలతో, గత ఐదు దశాబ్దాలుగా మంచి రచనలు అందచేస్తున్న రచయిత్రి, నిన్నటి తరంవారిలో చెప్పుకోదగ్గ కవయిత్రి డా. చిల్లర భవానీ దేవిగారు. పుట్టినిల్లు, మెట్టినిల్లు.. రెండూ సాహిత్య వనాలే! తండ్రి గారు కీ.శే. కోటంరాజు సత్యనారాయణశర్మ గారు, మెట్టింట్లోని కీ.శే. చిల్లర భావనారాయణరావు గారు.. ఇద్దరూ సాహితీవేత్తలు, బహుముఖ ప్రజ్ఞాశాలులు! బాల్యంలో ఇంట్లో ఉండే వాతావరణం, పాఠశాలలో ఉపాధ్యాయులు .. పాఠాలతో పాటు చెప్పిన కథలు, కావ్యాలు ఓ రకంగా డా. భవానీదేవి గారిని సాహిత్యరంగంలోకి ఆ రోజుల్లోనే అడుగులు వేయించాయనే చెప్పాలి!

సమకాలీన పరిస్థితుల్లో కంటికి కనబడే సమస్యలను కథావస్తువుగా తీసుకుని, వాస్తవికత ఉట్టిపడే కథనంతో, పాఠకుల్ని ఆలోచనల్లోకి దింపగలిగే రచనా చతురత డా. భవానీ దేవి గారి కథల్లో కనబడతాయి. కథల్లో సందేశం ఉంటుంది. కథలోని పాత్రల కదలికలనూ, చాలా లోతైన ఆ పాత్రల మనస్తత్వాలనూ, కథలో బంధించి రాస్తారు. అందుకే డా. భవానీదేవి గారి ప్రతీ కథ పాఠకుడ్ని ఆకట్టుకుని, ఆలోచనల్లోకి దింపుతుంది. దానికి తోడు బాల్యం నుంచే రచనా వ్యాసంగంలో అడుగు పెట్టిన డా. భవానీ దేవిగారు.. బాల సాహిత్యం, కవిత్వం, సాహితీ విమర్శలు, జీవితచరిత్రలు, నాటకం, లలితగీతాలు.. ఇలా సాహితీ ప్రక్రియలు అన్నింటిలోనూ తన ప్రతిభ కనబరిచారు. కొంతవరకు వాటి ప్రభావం కథా రచన మీద కూడా పడి, కథను రంజింపచేస్తాయి. అలా డా. భవానీదేవి గారు గత ఏభై సంవత్సరాలకు పైగా కథలతో పాటు ఇతర ప్రక్రియలలో రచనలు చేస్తూ.. ఇప్పటి వరకు.. కవితా సంపుటాలు, కథా సంపుటాలు, నవలలు, బాలసాహిత్యం, అనువాదాలు, వ్యాసాలు, నాటికలు.. అలా అన్నీ ప్రక్రియలలో కలిపి ఇప్పటి వరకు వీరివి 56 పుస్తకాలు వెలువరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారంతో పాటు 46 అవార్డులు, రివార్డులు అందుకున్న డా. భవానీ దేవిగారు తెలుగు, హిందీ భాషల్లో ఎం.ఎ. పట్టా పొంది, "స్వాతంత్ర్య అనంతరం తెలుగు హిందీ కవిత" ల అధ్యయనం చేసి, పి.హెచ్.డి. పొందారు.

1954 సం. లో హైదరాబాదులో జన్మించి, బాపట్లలో బాల్యం విద్యాభ్యాసం చేసి, రాష్ట్ర సెక్రటేరియట్ లో డిప్యూటీ సెక్రటరీగా పదవీవిరమణ చేసి హైదరాబాదులోనే స్థిరనివాసం. అడిగిన వెంటనే అంగీకరించి, ఎన్నో సాహితీ విషయాలను విశేషాలను తెలియచేసిన డా. చిల్లర భవానీ దేవి గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. వేలూరి వెంకటేశ్వరరావు

ఓ డెబ్బయ్ ఏళ్ల వెనక్కి వెళితే.. మన తెలుగువారు విదేశాలకు వెళ్ళి చదువుకోవడం.. ఆ తర్వాత అక్కడే స్థిరపడటం.. వంటివి బహు తక్కువగా ఉండేవి. ఆ రోజుల్లో.. 'మా అబ్బాయి అమెరికాలో ఉన్నాడని' చెప్పుకునే వారు.. వూరికి ఒకరో ఇద్దరో ఉండేవారు. ఆ తర్వాత కాలంలో చదువుల కోసం వెళ్ళి, అక్కడ జీవనశైలికి అలవాటుపడి, లేదా ఇష్టపడి అక్కడే ఉండిపోయినవారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. మిగతా దేశాలతో పోల్చుకుంటే.. అమెరికాలోనే ఎక్కువ మంది భారతీయులు ఉన్నారు. వారిలో తెలుగువారి సంఖ్య కూడా ఎక్కువే! రెండు మూడు తరాల వాళ్ళు ఇప్పుడు కనబడతారు. అలా పై చదువుల కోసం అమెరికా వెళ్ళి, ఉద్యోగాలు చేస్తూ బాగా స్థిరపడినవారిలో చాలామందికి మాతృభాష మీద మమకారం పెరిగి, తెలుగు సంఘాలని ఏర్పరచి, తెలుగు భాషా సంస్కృతులకు అక్కడ కూడా పునాదులు ఆ రోజుల్లోనే వేసారు. అలాంటి తెలుగువారిలో ప్రముఖంగా చెప్పుకోవలసిన వ్యక్తి కీ.శే. వేలూరి వెంకటేశ్వరరావుగారు!

హైస్కూలు చదువులప్పుడే సాహిత్య రంగప్రవేశం చేసిన వెంకటేశ్వరరావు గారు, అప్పట్లో ఒకటో రెండో కథలు వ్రాయడం, కాలేజీకొచ్చేసరికి.. అచ్చులో తన కథలు చూసుకోవడం జరిగాయి. 1957-58 ప్రాంతంలో, ఓ మిత్రుడు నడిపిన, 'ఏలూరు వీక్లీ' అనే రాజకీయ పత్రికకు రాజకీయ, సాహిత్య వ్యాసాలు వ్రాసేవారు. దరిమిలా పీ.జీ. చదువుల కోసం ఆంధ్రా యూనివర్సిటీలో చేరి, అక్కడే 'కావ్య దహనోత్సవం' అనే ప్రక్రియకు.. నాటకీయత ఇచ్చి ప్రదర్శించారు. యూనివర్శిటీలో ఉన్నప్పుడే ఎంతో మంది పెద్ద వారితో పరిచయం ఏర్పడి, సాహిత్యం వైపు ఎక్కువ దృష్టి పెట్టడం, ఆ తర్వాత 1968 సంవత్సరంలో పై చదువుల కోసం అమెరికా వెళ్ళిన తర్వాత మరో మలుపు తిరిగిందనే చెప్పాలి. డెబ్బయవ దశకంలో అట్లాంటా నుంచి వెలువడే తెలుగు భాష పత్రికకు సహకరిస్తూ, వ్యాసాలూ, కథలూ వ్రాసేవారు. ఆ తర్వాత కాలంలో చికాగో నుంచి వెలువడే "తెలుగు వెలుగు" కు సంపాదకుడుగా ఉండేవారు. ఆ రోజుల్లోనే "తెలుగు డయాస్పోరా" గురించి సభల్లో చెప్తూ, ఆ కథలు వ్రాసేవారు. 'ఈమాట' అంతర్జాలపత్రిక ఆరంభం తరవాత, ఆ పత్రికకు ఎక్కువ కథలు వ్రాయడమే కాకుండా, ఆ తర్వాత కాలంలో ఆ పత్రిక సంపాదకులుగా పనిచేయడం.. ఎంతోమంది ప్రవాసాంధ్రులను కథకులుగా తీర్చిదిద్దారు. 'ఓ రకంగా అమెరికా రాకపోయి ఉంటే, సాహిత్యపరంగా ఏమి చేసి ఉండేవాడిని కాను' అని ఆయనే అనేవారు.

1938 లో చింతలపూడిలో జన్మించి, ఏలూరులో డిగ్రీ చదివి, ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చేసి, 1968 లో అమెరికా వెళ్ళి పి.హెచ్.డి. చేసి, అక్కడే శాస్త్రవేత్తగా స్థిరపడ్డారు. గాంధీజీ అంటే బాగా ఇష్టపడే వెంకటేశ్వరరావు గారు.. గాంధీ సమగ్రసాహిత్యాన్ని అమెరికా తెప్పించుకుని చదివారు. విశ్వనాథ, శ్రీశ్రీ, తిలక్, చాసో, శ్రీపాద, రావిశాస్త్రి.. కథలంటే చాలా ఇష్టపడేవారు. అమెరికాలో తెలుగుభాషకు, సాహిత్యానికి, ముఖ్యంగా తెలుగు కథకు పెద్దపీట వేసి, గుర్తింపు తీసుకొచ్చిన వేలూరి వెంకటేశ్వరరావుగారు.. ఫిబ్రవరి 7, 2026 తేదిన అమెరికా, ఫీనిక్స్ నగరంలో కనుమూసారు.

## కథా మార్గదర్శి

అమెరికాలో తెలుగుభాషకి, తెలుగువారికి ఆత్మీయుడుగా ఆరు దశాబ్దాల పాటు సేవలందించిన కీ.శే. వేలూరి వెంకటేశ్వరరావు గారికి నివాళులు అర్పించుకుంటున్నాం!

కీ.శే. వెంకటేశ్వరరావుగారి గురించి ఎన్నో వివరాలు అందించి, వారి జ్ఞాపకాలను పంచుకున్న అమెరికా వాస్తవ్యులు, రచయిత శ్రీ గొర్తి బ్రహ్మానందం గారికి ధన్యవాదాలు!

**కథామంజరి బృందం**

.



# కథాపరిచయం

## శ్రీ భువనచంద్రగారి రచన : శతకోటి సుబ్బారావు

భువనచంద్రగారు సాహితీలోకానికి చిరపరిచితులే. ముఖ్యంగా ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చేవి.. ఆయన రాసిన సినిమా పాటలు! ఆయన రాసిన రెండువేల పైచిలుకు పాటలలో, చాలా పాటలు హిట్ అయి ప్రజాదరణ పొందాయి. ఆయన సినిమా పాటలే కాదు, వందకు పైగా కథలు, ఒక నవల రాశారు. ఈ మధ్యనే వచ్చిన ఆయన కథాసంపుటి ‘పాండీబజార్ కథలు’.

‘పాండీబజార్ కథల’కు నేపథ్యం రాస్తూ.. భువనచంద్రగారు అంటారు “అసలీ పాండీబజారుకీ, సినిమాకీ ఉన్నదో అవినాభావ సంబంధం! ఆ రోడ్ల మీదే... కోటానుకోట్ల కలలూ, కన్నీళ్ళూ కూడా దర్శనమిస్తాయి.” అని! ఆ రోడ్లలో తిరిగిన తన జ్ఞాపకాలు చెప్తూ అంటారు.. “ఆ బజారుని తలుచుకుంటే గుండె ఉప్పొంగిపోతుంది. గుండె నీరై కళ్ళలోంచి కరిగిపోతుంది. నాడు నేను చూసిన మహానుభావులు ఇప్పుడక్కడ లేరు. కేవలం వారి జ్ఞాపకాలనే సమాధులు మాత్రం మిగిలి ఉన్నాయి. ఓ రాణీ బుక్‌స్టాల్, చౌదరాణీ గారు (త్రిపురనేని రామస్వామి చౌదరి గారమ్మాయి), చందమామ రామారావుగారు, ఎప్పుడు నేను వెళ్లినా “వణక్కం సారూ” అని నోరారా పిలిచి చక్కని టీ అపుటికప్పుడు చేసి అందించే నటరాజన్, ఇలా ఎందరో పాండీబజార్ చెట్లనీడల్లో నీడగా కలిసిపోయారు.”

సినిమాలనే ఎండమావులు.. ఎందరు ఎన్ని కలలు కనడానికి అవకాశం కల్పించాయో, అంతకు ఎన్నో రెట్లు ఎక్కువగానే ఎందరో జీవితాల్లో కన్నీళ్ళు మిగిల్చాయి. కలలు కన్నీళ్ళు తెప్పిస్తే, ఆ కన్నీళ్ళు మళ్ళీ కొత్తకలలు కంటాయి.. బతకడానికి ఒక ఆశ కావాలిగా మరి! జీవితాల్లో గెలుస్తూ, ఓడిపోతూ, మళ్ళీ గెలుస్తూ, మళ్ళీ ఓడిపోతూ, చివరికి ఏదో ఆసరా దొరికి చస్తూ బతుకుతున్నవారెందరో! ఈ చక్రంలో పడిన ఎంతోమంది స్త్రీల బతుకులు చిరిగిన విస్తరాకులవడం.. రచయిత తన అనుభవంలో చూసి, రాసిన జీవిత కథలున్నాయి ఈ సంపుటిలో! కథల్లోంచి రచయిత అప్పుడప్పుడూ బయటకు వచ్చి, నేనున్నానిక్కడే అని పాఠకులకు కథలో తన చివరి మాటలు చెప్తూ కథను పూర్తిచేస్తారు.

ఇక్కడ పరిచయం చేస్తున్న కథ ‘శతకోటి సుబ్బారావు’. అతన్ని శ.కో.సు అందాం సులభంగా ఉండడానికి. ఇంతకీ ఎవరీ శ.కో.సు?

* శ.కో.సు సినిమా వేషాలకోసం ప్రయత్నించే శతకోటి సుబ్బారావుల్లో ఒకడు
* ఎప్పుడూ ఎక్కడో ఏరుకొచ్చుకున్న కొత్త 555 సిగరెట్టు పేకెట్లో ఉండేవి మాత్రం బీడీలే
* ఆకలి మర్చిపోడానికి పాడే అతని పాట భరించలేక, టీ ఇస్తే అయినా ఆపుతాడని జాలికొద్దీ టీ ఇచ్చే నరసింహ నాయుడికి

## కథా పరిచయం

తెలుసు శ.కో.సు సంగతేంటో! అయినా అతనంటే జాలి! శ.కో.సు దీవెనలే ఎప్పటికైనా పనికొస్తాయన్నది నరసింహనాయుడి నమ్మకం.

* పొద్దున్నే పక్కవాణ్ణి నిద్రలేపైనా టూత్ పేస్ట్ అడిగి మరీ పళ్ళు తోముకుంటాడు

* కొత్తవాళ్ళతో అతి పరిచయం పెంచుకుని ఏరోజు కారోజు కడుపు నింపుకుంటాడు అవతలి వాళ్ళ డబ్బుతో! దాన్నే ఫుడ్డుకి లాటరీ కొట్టడమంటారు.

అదీ అతని సంగతి. ఆరున్న కల్లా తయారై వెళ్ళేది ఆంధ్రా టీ స్టాల్, భగవతీ విలాస్. అక్కడ గుమిగూడే ఆడాళ్ళు, మగాళ్లు ప్రొడక్షన్ వాళ్ళు. కాఫీలు, టిఫిన్లు వేనుల్లో పంపిస్తారు. ప్రొడక్షన్ అసిస్టెంట్లని, గిన్నెలు తోమేవాళ్ళని, అక్కడికొచ్చి నవాళ్ళలోంచి తీసుకుంటారు. ఎవర్నైనా తీసుకుంటే, కనీసం వచ్చేవి వంద రూపాయలు.. అదీ రెండొందలకి సంతకం పెట్టించుకుని! అక్కడికొచ్చే ఆడవాళ్ళలో చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించేది పంకజం. ఆ పంకజాన్ని చూస్తూ, ఆమె వెళ్ళేంత వరకూ గడిపేసేవాడు మన శ.కో.సు. ఆ అందం ఆమెకు కొంచెం ఉపయోగం.. బతకడానికి!

నరసింహనాయుడు కూడా ఒకప్పుడు శ.కో.సే. సినిమాల్లో చాన్సు కోసం, ఓ ఆరేళ్లు తపస్సు చేసి, ఇక రాదని నిర్ణయించుకుని అక్కడే టీ కొట్టు పెట్టి, కొద్దో గొప్పో నాలుగు రాళ్లు వెనకేసుకున్నాడు అదృష్టం కొద్దీ. అందుకే శ.కో.సు. అంటే జాలి.

ఏళ్ళు గడిచినై. శ.కో.సు అయిపు లేదు. శ.కో.సు వెళ్ళిపోయిన రెండేళ్ల వరకు పంకజం అక్కడే ఉంది. తరవాత ఆమె కూడా కనబడకుండా పోయింది. ఇంకో సంవత్సరం గడిచిపోయింది. ఒకరోజు పొద్దున్నే తెలిసిన గొంతుతో పాట వినపడింది 'శంకరా నాదశరీరాపరా!' అంటూ. అందరూ ఉలిక్కి పడ్డారు. ఖరీదైన గోల్డు ఫ్రేమ్ కళ్ళజోడు. మూడు కుడి చేతికీ, మూడు ఎడం చేతికీ, వెరసి ఆరు దిబ్బల్లాంటి రత్నాలు పొదిగిన బంగారు ఉంగరాలు, మెళ్ళో బ్రహ్మాండమైన జెర్రిపోతులాంటి బంగారు గొలుసు. చేతిలో 555 పేకెట్టు. నోట్లో కూడా 555 సిగరెట్టే. "నేనే, మీ సుబ్బారావు"నంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

మద్రాసులో ఇక ఛాన్సులు రావని కేరళ వెళ్ళాడు. అక్కడ కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసి, ఒక సినిమాకి డైరెక్టరు మధ్యలో చనిపోతే, తను పూర్తి చెయ్యడం, ఆ సినిమా సూపర్ హిట్ అవడం, ఆ తరవాత సినిమా కూడా ఇంకో హిట్ అవడం జరిగింది. రెండో సినిమాకి ఒక ఆర్టిస్టు కావలసి వచ్చింది. పంకజాన్ని సెలెక్ట్ చేశాడు. కొద్ది సినిమాల తరువాత ఆమెను పెళ్ళి చేసుకోవడం, ఒక పిల్లాడిని కనడం, ఆ ఇద్దరినీ తీసుకుని ఒకప్పుడు తనను ఆదుకున్న నాయుడు టీ కొట్టుకి ఇలా రావడం జరిగిపోయాయి. "ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళూ నీ టీలు తాగి పొట్ట నింపుకున్నానూ.. నీకు నేనిచ్చే గౌరవం ఇదే... నా గుండెలోని గౌరవం... !" అంటూ నాయుడిని కౌగలించుకున్నాడు. పెద్ద పడవ కారులో దిగిన పంకజాన్ని, పిల్లాడిని చూస్తే అందరికీ షాకే మరి.

ఒక శ.కో.సు. కథ చెప్పడంలో మనల్ని ఆరోజుల్లో పాండిబజార్‌కి తీసుకెళ్ళి కళ్ళకు కట్టినట్లు, మనం అక్కడే ఉండి ఒక అబ్జర్వర్‌గా చూస్తూ, మనకు తను చూసిన ఆ అనుభవాల్ని భావింపచేయడం.. రచయిత గొప్పదనం. ఒక మనిషి సినిమా కలలు కంటూ, ఆర్థికంగా ఎంత క్రిందకు వెళ్ళవలసి వస్తుందో, అదే సుడి తిరిగి మళ్ళీ ఎంత పైకి వెళ్ళే అవకాశం ఉందో (అందరి సుబ్బారావులకూ ఆ అవకాశాలు వస్తాయని కాదు) ఈ కథ మనకు చెప్తుంది. ఆ పరిస్థితుల్ని చెప్తూ రచయిత కథలో చెప్పిన కొన్ని మాటలు చూద్దాం.

## కథా పరిచయం

"ఆకాశంలో మేఘాలకీ, పుద్దుకి లాఠ్రీ కొట్టే సినిమావోళ్ళకీ స్థిరమైన చోటుంటదేటి సాంబడూ! పగలు పార్కు బెంచీలూ, రాత్రుళ్ళు ఫుట్ పాత్‌లూ. ఖర్మంటే దీన్నే అంటారు. ఏం.ఏ చదివాడంట. ఏం లాభం"

పొద్దున్నే నాలుగున్నరకు శ.కో.సు. పాటలు వింటూ ఆరుద్ర, రామలక్ష్మిల మధ్య సంభాషణ చెప్పడం అక్కడ రాయి విసిరేంత దూరంలో ఎంత పెద్దవాళ్లు వుండేవారో చెప్పడమే.

"తెల్లవారుఝామున నాలుగున్నరకే లేచి, రాత్రి సగం మిగిల్చిన ఒక బీడీ ముక్క కాలుస్తూ, ఘంటసాల గారి 'వాతాపి గణపతిం భజే', లేక 'శుక్లాంబరధరం విష్ణుం' అంటూనో పాడుతూంటే, పసివాళ్లు భయపడతారు, నడివయసు వాళ్ళు నవ్వుకుంటారు, వృద్ధులు ప్రాణాలు విడిచినా విడుస్తార"ట.

ఇదీ ఒక పాండీబజారు కథ, శతకోటి సుబ్బారావుల్లో ఒక సుబ్బారావు కథ.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*



# కథాపుస్తక విశ్లేషణ

## కిష్టప్ప కథలు - రచన : శ్రీ భాగవతుల కృష్ణారావు

భాగవతుల సాహితీ వ్యవసాయ ఫలం 'కిష్టప్ప కథలు'




18 కథలు 33 మినీ కథలు, కబుర్లు లాంటి 25 ముచ్చట్లు, మచ్చుకు ఓ ఆరు కవితలు వెరసి 200 పేజీల పుస్తకం కిష్టప్ప కథలు. భారతీయ రైల్వేలో పనిచేసిన భాగవతుల కృష్ణారావు గారి సాహితీ వ్యవసాయ ఫలాలు.

ఎక్కువమంది తనను పిలుచుకునే ముద్దుపేరు (కిష్టప్ప) తోనే ఈ పుస్తకానికి కిష్టప్ప కథలు అని పేరు పెట్టి వెలువరించారు. ఇందులో మొదటి కథ సత్యజిత్ రే కథ 'కార్వస్' నకు భాగవతుల కృష్ణారావుగారి స్వేచ్ఛానువాదం. ఈ కథ చదివాక ఆయన బెంగాల్లో ఉండగానే గొప్ప గొప్ప బెంగాలీ కథలన్నీ అనువాదం చేసి ఉంటే ఎంత బాగుండేదో అనిపిస్తుంది. కథామంజరిలో ప్రచురితమైన మరో కథ – అభిమాన రచయితను చూద్దామని ఓ పాఠకుడి కోరిక. ఫోటోలు గట్రా ఇష్టపడని రచయిత – 'తను పార్కుకు వస్తాను కానీ నువ్వే నన్ను గుర్తుపట్టాలి. నేను మాత్రం నిన్ను గుర్తుపట్టగలను' అంటాడు. అన్నట్టుగా ఒక వ్యక్తి పార్కు వస్తాడు. పాఠకుడు అతనిని గుర్తించి రచయిత పేరుతో పిలవగానే పార్కులో ఉన్న అందరూ ఆశ్చర్యంతో వారి చుట్టూ గుమికూడతారు. ఈ సందడిలోనే వచ్చిన అతను జారుకుంటాడు. తరువాత పాఠకునికి అంధుడైన ఆ రచయిత ఉత్తరం రాస్తూ 'ఇటువంటిది జరుగుతుందని నేను రాకుండా నా మిత్రుని పంపాను' అంటాడు. ఈ కథ పేరు అభిమాని.

కృష్ణారావు గారి కథలు సరళమైన శైలితో, సులువైన కథాంశాలతో సాఫీగా సాగుతాయి. ఎక్కడ క్లిష్టత లేకుండా చాలా సాఫీగా పట్టాల మీద సాగుతున్న రైలు మాదిరిగా ఈయన కథలు సాగుతాయి. రైల్వేశాఖ ఉద్యోగి కదా! రైలు ఆగే ముందు కీచుమన్నట్టు చివరలో ఒక ట్విస్టుతో.

కుటుంబ బాగుకోసం తండ్రిని చంపాలన్న కొడుకు తల్లిని చూసి ఆగిపోతాడు. కానీ ఆ తల్లి నీళ్లు అడిగిన రోగియైన భర్త నోట్లో చెంబుడు నీళ్ళు పోసి, అతనికి ముగింపు రాస్తుంది. ఈ కథ పేరు పరిష్కారం. అందరి జీవితాల్లో పలు వ్యథలను యదార్థాలుగా మార్చి, కథల మాదిరిగా రాసేటటువంటి ఆ భగవంతుడు ఎంత కఠినమైన రచయిత కదా!

కనపడిన అపురూప సుందరి, సుందరి కాదు అచ్చమైన మగనారి అని తెలిసి బిల్హణుడి గుండె బీటలు వారుతుంది. ఇలా కొన్ని సరదా కథలు, కొన్ని కఠినమైన వాస్తవాలను చిత్రించిన కథలు, పలు ముచ్చట్లు, కొన్ని కవితలు అన్నీ కలిపితేనే కిష్టప్ప కథలు. ఫరవాలేదు సమయం వ్యర్థం కాదు. చదివి చూడొచ్చు!

**రాంబో**



# వినదగునెవ్వరు చెప్పిన..

జన్మదిన సంచిక కథల పోటీలో గెలుపొందిన కథలతో, క్రమంగా పెరుగుతున్న బాలల ముఖచిత్రాల సోయగంతో జూలై, 2026 కథామంజరి సంచిక అందంగా ముస్తాబైంది. కథల పోటీలను నిరంతరంగా నిర్వహిస్తూ కొత్త రచయితలను ప్రోత్సహిస్తున్న కథామంజరి బృందానికీ, గెలుపొందిన రచయితలందరికీ హృదయపూర్వక అభినందనలు.

కథాకీయంలో చెప్పినట్లు కథావస్తువు కొత్తదైనా, పాతదైనా.. శైలి, కథనం, శిల్పం వంటి విషయాల మీద సీరియస్ గా దృష్టిపెడితే, పాఠకుల్ని రంజింపచేసే కథ రాయవచ్చును. కానీ చాలా కథల్లో ఉండవలసిన గంభీరత కనబడటలేదనే అనిపిస్తుంది. చాలా వరకు "చివరికి సుఖాంతం" కథలే. ఈ సంచిక కథలపై నా విశ్లేషణలు చదివిన తర్వాత, విశ్లేషణ మరీ ఇలానా...? అని నొచ్చుకునేవారు.. ఇవి వందలో ఒకరి అభిప్రాయాలుగా పరిగణించి మన్నించవలసిందిగా కోరుతున్నాను.

ఇక కథల విషయానికొస్తే, శాయి రాచకొండగారు పరిచయం చేసిన "ఉరి" కథ విశ్వనాథవారి మాయాజాలానికి మచ్చుతునక. "ఉరి"కీ, నేటి కథలకూ హస్తిమశకాంతరం అనిపించకమానదు. అది చదివాక నేటి తెలుగుకథ ఖాయంగా ఉరికంబంపైనే ఉందనిపిస్తే, అది మన తప్పు కాదు. తెలుగు కథకు అటువంటి ప్రమాణాలను నెలకొల్పిన వారిదే దోషమంతా!

మొదటి బహుమతి పొందిన కథ "డి.ఎన్.ఏ." వసుంధర గారు రచించినది. డి.ఎన్.ఏ. అనేది కేవలం రక్తసంబంధం కాదు, అది స్నేహం, సంస్కారాల కలయిక అని ఈ కథ ఇచ్చిన సామాజిక సందేశం చాలా గొప్పది. సమాజంలో మత సామరస్యానికి, విశ్వశాంతికి రచయిత ఎంచుకున్న కథా వస్తువు అభినందనీయం. అయితే, ప్రధాన పాత్ర అయిన రవి చిత్రణలో సహజత్వం లోపించింది. బాంబు పేలుడు, సెక్రటరీ మాటల ఆధారంగా అతను రహీమ్‌పై అభిప్రాయాలను మార్చుకోవడం.. అతని అతి చపలత్వాన్ని చూపిస్తుంది. ఇన్ని కుతంత్రాలు ఉన్న రవి పాతికేళ్ల పాటు నటిస్తూ, అందరినీ నమ్మించడం అసహజంగానూ, కథ మొదట్లో ప్రస్తావించబడిన అతని తీవ్ర మానసిక సంఘర్షణకు సరైన కొనసాగింపు లేకుండా, కేవలం టీవీ ఇంటర్వ్యూతోనే పాతికేళ్ల ద్వేషం ఒక్కసారిగా ముగిసిపోవడం నాటకీయంగానూ ఉంది. నిర్మాణంలో లోపాలు ఉన్నప్పటికీ, కథ చివర్లో ఇచ్చిన చక్కటి సందేశం వల్ల ఇది ఒకసారి చదవదగ్గ కథగా నిలిచింది.

ఆకెళ్ళగారు రాసిన "స్పర్శ" కథ ద్వారా అతి సమర్ధవంతమైన "రోబో" పరిచయంతో మనల్ని టైం మెషిన్ ఎక్కిస్తూనే, సాంకేతికత మానవ అవసరాలను పూర్తిగా తీర్చలేదనే విషయాన్ని గట్టిగానే చెప్పగలిగారు. అయితే కథలో రామచంద్రం అసలు సమస్య స్పర్శలేమి కాదు.. ఒంటరితనం! పక్కింటి వ్యక్తి వల్ల పొందిన సహాయం, కొడుకు తిరిగి వచ్చిన తర్వాత అతనిలో కనిపించిన ఆనందం, మిత్రులతో కలిసిమెలిసి జీవించడం... ఇవన్నీ శారీరక స్పర్శ కంటే మనుషులతో సాన్నిహిత్యం, సంభాషణలు, భావోద్వేగాలు, ఆప్యాయత, అనుబంధాలే జీవనానికి మూలాధారమని సూచిస్తాయి. రక్త మాంసాలు కలిగిన మనుషుల మధ్య సాన్నిహిత్యం కేవలం స్పర్శ ద్వారా సాధ్యమౌతుందా? స్పర్శకోసమే పరితపిస్తామా? సందేహమే. అందువల్ల కథలో 'స్పర్శ'ను కేంద్ర భావంగా నిలబెట్టడం కంటే, మానవ సంబంధాల అనివార్యతను ప్రధానాంశంగా విస్తరించి ఉంటే కథ మరింత సంపూర్ణతను సంతరించుకునేదని అనిపిస్తుంది.

"న్యాయదేవత కళ్ళు తెరిచింది" కథ ద్వారా ఒక కోర్ట్ రూమ్ మెలోడ్రామాను అందించారు డా. ఎం. కోటేశ్వరరావు గారు. కథను ఆసక్తికరంగా నడిపించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, రచయిత ఇంకొంత సమయాన్ని తీసుకొని కత్తెరకు పని చెప్పి ఉంటే, కొన్ని అసంగతాలు నివారించే అవకాశం ఉండేదనిపించింది. ఆక్సిడెంట్ అయిన తర్వాత మినీబస్‌లోని వ్యక్తులు, కారులోని పెద్దమనిషి కళ్లతో మౌనంగా మాట్లాడుకోవడం (ఎందుకు?), విచారణ మొదలైనప్పుడు జడ్జిగారు ఓరకంటితో చూడగానే ఒక వ్యక్తి చూపు తిప్పుకోవడం (అతనికి, కథకు సంబంధం ఏమిటి?), జడ్జిగారు నివేదికలు చూడగానే కేసును వదిలేయాలని అనుకోవడం, మళ్లీ చూసి మనసు మార్చుకోవడం, "పోలీసుల నివేదిక జడ్జి ముందు ఉంది" అని చెప్పడం, మరోసారి నివేదికను చదవడం, చివరకు కొంత విచారణ తర్వాత మళ్లీ వదిలేయడం వంటి సందర్భాలు పాఠకుడిలో కొన్ని సందేహాలను కలిగిస్తాయి. అలాగే, ప్రత్యేక సాక్షిని చూడగానే కోర్టులో అందరూ బొమ్మల్లా బిగుసుకుపోవడం, తర్వాత ఆ సాక్షి జడ్జి మాధవ్ గారేనని చెప్పగానే అందరూ మళ్లీ షాక్‌కు గురికావడం, అసంబద్ధంగా అనిపించింది. మినీ బస్సులోని వ్యక్తి చిత్రీకరించిన వీడియోలో వేగంగా వెళ్తున్న బైక్, దాని ముందు మళ్ళీ మినీ బస్సు కనిపించడం కూడా సాధ్యం కాదు కదా! ఇలాంటి చిన్నచిన్న విషయాలపై ఇంకొంచెం దృష్టి పెట్టి ఉంటే, కథ మరింత బిగువుగా, విశ్వసనీయంగా నిలిచేదనిపించింది. కథ పరంగా సరిచేయడం కష్టమైన మరో అంశం డ్రైవర్ నేరం ఒప్పుకోవడానికి చెప్పిన కారణం. అది సహజత్వానికి చాలా దూరంగా నిలిచిపోయినట్లు అనిపించింది. ఆ పాత్రకు మరింత బలమైన, నమ్మదగిన ప్రేరణను ఇచ్చి ఉంటే కథ ముగింపు ఇంకా ప్రభావవంతంగా ఉండేదేమో అనిపించింది.

పెనుమాక రత్నాకర్ గారు రచించిన "ఇక్కడికి ఆలస్యమే అమృతం" ఆద్యంతం పట్టు సడలకుండా సాగి ఏకబిగిన చదివించగలిగిన కథ. క్లుప్తత, అనుభూతి ఐక్యత, సౌష్టవం వంటి కథా లక్షణాలను చక్కగా ప్రదర్శించింది. అయితే, కథ అంతటా నిర్మించిన సంఘర్షణకు ముగింపు మాత్రం అంతే స్థాయిలో సంతృప్తిని ఇవ్వలేదు. అంజిగాడి పోరాటం కూలీ డబ్బుల కోసం, ఆత్మగౌరవం కోసం.. ఎవరు ముందుగా స్మశానానికి చేరతారన్న తాత్విక నిర్ధారణ కోసం కాదు. చివర్లో కథ సామాజిక సంఘర్షణ నుంచి తాత్విక ప్రతీక వైపు మళ్లడంతో మొదట నిర్మించిన ఉద్వేగం కొంత సడలిపోయింది. అలాగే, "ఇక్కడికి ఆలస్యమే అమృతం" అనే శీర్షిక కూడా కథ యొక్క ప్రధాన సంఘర్షణను పూర్తిగా ప్రతిబింబించలేదేమో!

పొత్తూరి సీతారామరాజు గారు రచించిన "గోడమీద పులి తల" కథ ద్వారా ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశారు. అయితే ఇది ఒక స్వతంత్ర కథలా కాకుండా, ఒక నవలలోని కొంత భాగంలా అనిపించింది. ఒక సంఘటనలో వెలగవలసిన కథ, కొన్ని తరాల రాజులు, వారి జీవిత ఘట్టాలు, వారసత్వంగా వచ్చిన తుపాకీ చుట్టూ విస్తరించడంతో కథా ఏకాగ్రత కొంత సడలింది. నాగేంద్రవర్మలో వచ్చిన పరివర్తనను, పులి ప్రసవవేదనను చూసి వేటను శాశ్వతంగా విడిచిపెట్టిన ఘట్టాన్ని రచయిత హృద్యంగా చిత్రించారు. అయితే, ఆ తర్వాత రామాలయ వివాదం, ప్రజలతో ఘర్షణ వంటి మరో సంఘర్షణను ప్రవేశపెట్టడం కథను ఇంకో వైపుకు తీసుకెళ్ళింది. అలాగే, ప్రజల మనస్తత్వం ఒక్క సంభాషణతో పూర్తిగా మారిపోవడం సహజంగా అనిపించలేదు. చివర్లో కుమారుడి మరణాన్ని పూర్వీకుల వేట పాపానికి ప్రతిఫలంగా అనుసంధానించిన తాత్విక ముగింపు ఆలోచింపజేసినా, అది కథ అంతటా సహజంగా అల్లుకున్న భావంగా కాకుండా చివర్లో అతికించిన వ్యాఖ్యలా అనిపించింది.

కే.వి. సుమలత గారు రాసిన "అవ్యక్తం" అనవసరపు వ్యక్తీకరణలు లేకుండా ఇతివృత్తపు పరిధిలోనే సాగింది. అందం కంటే మనసే ముఖ్యమనే సందేశాన్ని హృద్యంగా చెప్పే ప్రయత్నం చేసింది. అయితే కథ ప్రారంభం నుంచే ముగింపు ఊహించదగినదిగా

అనిపించింది. అశ్విన్ పరివర్తన కూడా ఒక్క సంఘటనతోనే సంభవించడం వల్ల కొంత నాటకీయంగా అనిపించింది. ఇంతటి ఆదర్శవంతమైన వివాహాలు వాస్తవ జీవితంలో సాధ్యమేనా అనిపిస్తుంది. ఇవి మతాంతర, కులాంతర వివాహాల కంటే కూడా క్లిష్టమైనవే కదా!

శశాంక్ గారు రాసిన "పులి గాం(డ్రింపు", నీలం రాము గారు రాసిన "విందు భోజనం" తమ పరిధిమేరకు పిల్లలకు వినోదాన్ని అందించిన కథలు. రచయితలకు అభినందనలు. పిల్లల కోసం రాయడం అంటే చిన్నగా రాయడం కాదు.. ఆనందాన్ని, విలువలను అందించడంతో పాటు మరింత ఖచ్చితంగా, మరింత స్పష్టంగా, మరింత జీవంగా రాయడం! ఈ లక్షణాలకు మరింత పదును పెట్టి, భవిష్యత్తులోనూ ఈ ఇద్దరు రచయితలు మంచి బాలల కథలను అందించాలని ఆశిద్దాం.

ఇక మిగిలినవి లబ్ధప్రతిష్ఠులైన శ్రీమతి గంటి భానుమతి గారు, కీ.శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు తమ తమ కాలాల్లో రచించిన రెండు కథలే. వాటిని సమీక్షించాలనే ప్రయత్నం కంటే, వాటిలోని శిల్పాన్నీ, శైలినీ మరోసారి ఆస్వాదించే అవకాశంగా భావించాను. ఆ సంతోషంతోనే ఈ సమీక్షను ఇక్కడితో ముగిస్తున్నాను.

**రాంబో**

కథామంజరి జూలై నెలలో ప్రచురించిన "గోడ మీద పులి తల" కథ చాలా బాగుంది. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని, దేశ రాచరికపు అలవాట్లని, ఆనందాలని బాగా వర్ణించారు. విలాసాల పేరిట జరిగే సంఘటనలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. మార్పు అనేది ఎవ్వరో ఒక్కరి దగ్గర మొదలవుతుంది. అది ప్రజాసేవకి, సమాజ హితానికి పనికొస్తుంది. కథ మొత్తము ఒకే వెర్షన్ లో సాగింది. పోలికలు, ఆలోచనలు కథలో డైలాగ్స్ పాత్రలు అన్నీ బాగా కుదిరాయి. కథ చదివింపజేసింది. జీవహింస చేసిన పాపం ఎవరినీ వదిలిపెట్టదు. అది తరాల నాశనాన్ని కోరుతుంది అన్న మీ ముగింపు ఒక పాఠకురాలిగా నేను ఏకీభవిస్తాను. ఇలాంటి కథలు రాసిన గొప్ప రచయిత కే.ఎన్.వై. పతంజలిగారు. పంది కథతో నేను పోల్చుకోలేను గాని, కేవలం రాజుల సామాజిక వర్గం, వారి వేట నైపుణ్యం రాయాలంటే.. వారితోనైనా తిరగాలి, లేదా అదే సామాజిక వర్గంలోనైనా పుట్టాలి. అందుకే ఈ కథ ఇంత ప్రాణం పోసుకుంది. రచయిత పొత్తూరి సీతారామరాజుగారికి నా అభినందనలు. ఇంత మంచి కథను పాఠకులకు అందించిన కథామంజరి సంపాదకవర్గానికి నా ధన్యవాదములు.

**డా. మహ్మద్ మున్నీ , ఎం. ఏ. ఎం. ఫిల్.**

"గోడ మీద పులి తల" కథ బాగుందండి. నిజంగానే రాజవంశాల పతనానికి ఈ మూగజీవాలా వేట కూడా కారణమే అయ్యుంటుంది. ఇక రామాలయం సంగతి రఘురామరాజుగారిని గుర్తుచేసింది. చక్కగా అమరింది కథలో! కాకర్లపూడి, శ్రీ రాజాకాకర్లపూడి, శ్రీకాకర్లపూడి అని మూడు ఇంటిపేర్లు ఉన్నాయి రాజుల్లో! బహుశా ఇవి అప్పటి బిరుదులు ఆధారంగా వేరుపడినవే అయ్యుంటాయి. మూలం కాకర్లపూడి అనే అనిపిస్తుంది. సాగి, వత్సవాయి, బుద్ధరాజు ఇవి మూడూ ఇలానే ఒకే ఇంటిపేరు నుండే వచ్చాయని విన్నాను. అదీ ఇలాంటి చరిత్ర ఆధారంగానే

**ఉప్పలపాటి ప్రశాంతవర్మ, కాకినాడ**



# అక్షరాక్షతలు

## కథామంజరి ఆరేళ్లు నింపుకుని ఏడో ఏట అడుగుపెడుతున్న సందర్భాన..
## పెద్దల అక్షరాక్షతలు

సాహితీ పూదోటలో నిత్య నూతనంగా వెలుగొందుతూ కథాప్రియులను ఆకర్షించే 'కథామంజరి' ఆవిర్భవించి అప్పుడే ఏడేళ్లయిన సంగతి ఎంతో ఆనందాన్నిచ్చింది. నెల నెలా అనుకున్న రోజుకు కచ్చితంగా రిలీజ్ కావటం ఒక గొప్ప విషయమైతే.. శ్రావ్యసంచిక ఒక ప్రత్యేక ఆకర్షణ! వివిధ సాహితీవిలువలతో గతంలో వెలువడ్డ భారతి, ఆహ్వానం, యువ, రచన వంటి మాసపత్రికల కోవకు చెందిన మరొక మాసపత్రికగా మన కథామంజరిని చెప్పుకో వచ్చును. పత్రికలకు పోషకులు కావాలి. పోషకాహారం కూడా కావాలి. మంచి కథల కోసం ఒక వేదికను ఏర్పాటు చేసినది మీరు! ఆ వేదికను పరిపుష్టం ప్రయోజనకరం చేయవలసినది రచయితలు! ముఖ్యంగా కొత్త కథారచయితలు వారి కొంగ్రొత్త ఆలోచనలతో ముందుకు రావాలి కదా!

**ఆదూరి వెంకట సీతారామమూర్తి, విశాఖపట్నం**

---

ఆరేళ్ల విజయయాత్రకి ఫలశృతి 'ఏడో జన్మదినం!' 'అరేళ్ళు నడిపాం' అన్నది ఓ మాటగానే అనిపిస్తుంది. కాని ఆ కృషి, శ్రమ, అకుంఠిత అంకితభావం సామాన్యమా.. దాని లోతుపాతులు మీకు, మీలాంటి వారికే బాగా అవగతమవుతాయి! హృదయపూర్వక అభినందనలు! మన దగ్గర ఎక్కువ శ్రద్ధగా చదువుతున్న ఆన్‌లైన్ పత్రిక.. నా దృష్టిలో' 'కథామంజరి' నే. శుభం జరగాలని కోరుతూ..

**వి. రాజారామమోహనరావు, హైదరాబాదు**

---

సరిగ్గా ఆరేళ్ల క్రితం నిశ్శబ్దంగా మొదలైన 'కథామంజరి' ప్రయాణం, ఈ రోజు ఏడో సంవత్సరంలోకి సగర్వంగా అడుగు పెడుతుండటం చూడటం.. ఒక రచయితగా నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. రూపాయి లాభాపేక్ష లేకుండా, కేవలం తెలుగు కథపై ఉన్న మక్కువతో, మన అచ్చతెలుగు కథా సాహిత్యాన్ని మున్ముందుకు తీసుకెళ్లాలనే తపనతో, ఈ పత్రికను నడిపిస్తున్న నిర్వాహక బృందానికి నా అభినందనలు. ప్రతి నెలా ఒకటో తారీఖు రాగానే, ఎలాంటి ఆలస్యం లేకుండా, అంతర్జాలం ద్వారా నేరుగా పాఠకుల చేతుల్లోకి ఈ పత్రికను చేర్చడం వెనుక ఉన్న మీ క్రమశిక్షణ, శ్రమ నిజంగా ప్రశంసనీయం.

ఈ పత్రికలోని ప్రతి శీర్షికా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కేవలం కథలను ప్రచురించడమే కాకుండా, శ్రవణ రూపంలో (ఆడియో కథలుగా) గళాకారుల సహకారంతో కథలను వినిపించడం అద్భుతమైన ప్రయోగం. సంపాదకీయాల లోతు, విశిష్ట అతిథుల అనుభవాల పసందు, పుస్తక విశ్లేషణలు, పాఠకుల స్పందనలకు ఇస్తున్న ప్రాధాన్యత.. పత్రికను ఒక సంపూర్ణ సాహిత్య వేదికగా మార్చాయి. ముఖ్యంగా ప్రతి నెలా పది ఉత్తమ కథలను ఎంపిక చేయడం, నిరంతరం కథల పోటీలు నిర్వహించడం ద్వారా పాత, కొత్త తరం రచయితలను ప్రోత్సహించడం 'కథామంజరి' విశిష్టత.

ఈ శుభ తరుణంలో ఒక ముఖ్యమైన విషయాన్ని పంచుకోవాలని అనుకుంటున్నాను. నేడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఎవరైనా, ఏమైనా రాసే స్వేచ్ఛ దొరికింది. ఇది ఒక రకంగా మంచిదే అయినా, మరో పక్క సాహిత్య విలువలు క్షీణించే ప్రమాదం కూడా పొంచి ఉంది. పత్రికల ద్వారా వడపోత లేకుండా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే కొన్ని తాత్కాలిక మెచ్చుకోళ్లను చూసి కొత్త రచయితలు తృప్తి పడిపోకూడదు.

సమాజాన్ని, మానవ సంబంధాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి రాయడం నేటి అవసరం. మన సామాజిక జీవనంలో ఇంకా వెలుగుచూడని, కథకులు స్పృశించని ఎన్నో కోణాలు, నిగూఢ పార్శ్వాలు ఉన్నాయి. ఏ సమస్యలనైనా, సామాజిక రుగ్మతలకైనా ప్రజల్లోకి సులువుగా, సూటిగా తీసుకువెళ్లే అద్భుతమైన ఆయుధం 'కథ'. రచయితలకు కేవలం ప్రతిభ ఉంటే సరిపోదు, నిరంతర సాధనతో పాటు సాహిత్య సంస్కారం, సమాజం పట్ల బాధ్యత కూడా ఉండాలి. అప్పుడే నాణ్యమైన సాహిత్యం సమాజానికి అందుతుంది. ఇలాంటి విలువలతో కూడిన, సమాజానికి మేలు చేసే ఉత్తమమైన కథలను ఏరికోరి పాఠకులకు అందిస్తూ, సాహిత్య పరిరక్షణలో 'కథామంజరి' ఒక బలమైన వృక్షంలా నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. సంపాదకులు, ప్రచురణకర్త మరియు వారి సహకార బృందం చేస్తున్న ఈ అక్షర యజ్ఞం నిరంతరాయంగా సాగాలి.

రాబోయే జూలై 2026 జన్మదిన సంచిక విజయవంతం కావాలని మనసారా ఆకాంక్షిస్తూ..

**కర్లపాలెం హనుమంతరావు**

---

'కథామంజరి' సప్తమిలోకి ..

ఒకప్పుడు ఆంధ్ర ప్రభ, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర భూమి, ఆంధ్ర జ్యోతి వంటి వారపత్రికలు , యువ, జ్యోతి, పత్రిక, చినుకు, విపుల, చతుర వంటి మాసపత్రికలు అనేకం ఉండేవి. 1960 నుంచి 2010 వరకు కూడా స్వర్ణయుగమే. రకరకాల పూలవనంలా గుబాళించిన సాహిత్యవనం మోడువారి పోయింది. అభిరుచి, ప్రతిభ ఉన్న రచయితలు తెరవెనక్కి వెళ్ళిపోతూ, నాలుగు అక్షరాలు తెలిసి, ఏదో గీకేసి పారేసే రచయితలు రంగం మీదకి వచ్చారు. పఠితల్లో ఆసక్తి తగ్గిపోవడం మొదలైంది. దానికి తోడు మీడియా ఓ ప్రభంజనంలా వచ్చి, సాహిత్యాన్ని కలుషితం చేయడం

మొదలుపెట్టింది. ఈ పరిస్థితుల్లో, ఒక మహా సామ్రాజ్యాన్ని, నిర్మించి, పాలించిన, మహా మహా రచయితలు, తెరమరుగు అయిపోయారు.

ఈ మీడియా అనే భూతం ప్రవేశించి, మనసులను, మనుషులను, జీవితాలను కూడా చిందర వందర చేసింది. పత్రికలు అంతరించిపోయాయి. రచయితలకు వారి రచనలకు స్థానం కనిపించలేదు. ఆదరించేవారు లేకపోతే ఏ కళ అయినా అంతరించిపోవాల్సిందే. గుండెల్లో ఉప్పొంగే భావాలు ఎలా ప్రకటించాలో తెలియక రచయితలు నిస్సహాయులైనారు.

మీడియా అనేక రెక్కలు తొడుక్కుని వీరవిహారం చేయడం మొదలుపెట్టింది.ఈ పరిస్థితుల్లో ఫేస్‌బుక్ అనేది వచ్చి, కొందరికి కొంత తెరిపి ఇచ్చింది. వారు రాసుకున్న రచనలు, ఈ సాంఘిక మాధ్యమం ఆలంబనగా మారాయి. ఎవరికి తోచింది వారు రాసేసి, తమ గోడల మీద పెట్టేసుకోవడంతో సాహిత్యానికి రెక్కలు వచ్చాయి. నియంత్రణ లేకపోతే ఏదైనా హద్దులు మీరుతుంది. సాహిత్యం కూడా అలాగే అయింది.

ప్రింటి మీడియా అయితే, ఎడిటర్ అనే ఒక వ్యక్తి తనకు వచ్చిన రచనలు చదివి, అవి ప్రచురణకి అర్హమైనవా, కావా అని నిర్ణయించేవాడు. అతనికి జర్నలిజం అనే ఒక అర్హత ఉండేది. సాహిత్యం పట్ల అవగాహన ఉండేది. ఇప్పుడా అవసరం లేదు. ఎవరికి వారే న్యాయనిర్ణేతలు. అందరూ జర్నలిస్టులే.

అంతేకాదు, కాస్త టెక్నాలజీ తెలిసిన ప్రతివారూ ఒక అంతర్జాల పత్రిక తెరిచేయడంతో పుట్ట నుంచి బయటపడిన చీమల్లా రచయితలూ పుట్టుకు రావడం మొదలుపెట్టారు. కానీ నియంత్రణ లేని ఆ రచనలు ప్రమాణాలు కోల్పోయి, ఇదా తెలుగు సాహిత్యం? అని విస్తుబోయే పరిస్థితి కలిపించారు. దానికి తోడు, రకరకాల వాదాలు, హద్దు, అదుపు లేని సిద్ధాంతాలు, కాదేదీ కవితకనర్హం అన్నారు కదా అని, మానవీయ విలువలను మంట కలిపే రచనలు సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతున్న, ఈ సందర్భంలో ఓ మలయమారుతంలా వచ్చింది కథామంజరి.

ఇందులో సాహిత్యం విలువ తెలిసినవారు ఉన్నారు, సమాజానికి కరదీపికల్లా వెలిగే రచయితలు ఉన్నారు. ఎవరికి తోచిన content వారు ప్రచురించుకోడం కాక, ప్రచురణకి వచ్చిన రచనల మీద ఒక నియంత్రణ ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా మంచి రచయితలు ఎందఱో వెలుగులోకి వచ్చారు. మంచి రచనలు ఎన్నో పాఠకులకి చేరువ అయినాయి. ఇదీ సాహిత్యం అంటే అని గర్వంగా చెప్పుకునే స్థాయి కథలు రావడం మొదలైంది.

సాహిత్యం విశ్వజనీనం. వాదాలు, వర్గాలు, మతాలు, మౌఢ్యాలు సాహిత్యాన్ని చిందర వందర చేస్తున్న ఈ పరిస్థితుల్లో కథామంజరి ఆరు సంవత్సరాలు పూర్తిచేసుకుని, సప్తమి లోకి అడుగుపెట్టడం అభినందనీయం. తిధుల్లో సప్తమికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎంతో పవిత్రమైన దినంగా భావిస్తారు హిందువులు. అంతటి మహత్తర మైన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న 'కథామంజరి' కి, ఇందులోని కార్యనిర్వాహక బృందానికి, ముఖ్యంగా 'అయ్య కోనేరుగట్టు' లాంటి అత్యద్భుతమైన కథలు అందించిన జయంతి ప్రకాష్ గార్కి మనసారా అభినందనలు, శుభాకాంక్షలు.

**అత్తలూరి విజయలక్ష్మిహైదరాబాద్**

కథామంజరి అంతర్జాల మాసపత్రిక సప్తమవర్షంలోకి అడుగు పెట్టటం ఒక రచయితగా, అంతకన్న ఒక పాఠకుడిగా నాకు సంతోషంగా ఉంది. కథామంజరి ఆది నుంచీ నాణ్యమైన కథలను అందించటానికి చేస్తున్న కృషి, పెడుతున్న పోటీలు ప్రశంసనీయంగా ఉంటున్నాయి. పత్రికా ప్రపంచంలో మొదటిసారిగా శ్రవణ సంచికను కూడా ప్రవేశపెట్టిన ఘనత కథామంజరిదే. కథామంజరిని తెచ్చే ప్రయత్నంలో ఆది నుండీ లబ్ధప్రతిష్ఠులైన రచయితల అండ పొందగలగటం శర్మగారి నిస్వార్థ కృషికి తార్కాణమే.

కథామంజరి ఇంతకింత ఎదుగుదలతో అనేకానేక వార్షికోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

**పి. వి. ఆర్. శివకుమార్**

గత ఆరేళ్లుగా.. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన కథల వెలుగులు పంచుతున్న కథామంజరికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు.!

ధరలు ఆకాశాన్ని అంటుతున్న కాలంలోనూ లాభనష్టాల లెక్కలకు అతీతంగా, సాహిత్యానురాగమే మూలధనంగా, రచయితలే సంపాదకులై వెలిగిస్తున్న ఈ కథాదీపం నిజంగా అభినందనీయం. పది కథలకు చదివేందుకు అక్షరరూపం, వినడానికి స్వరరూపం ఇచ్చి, పెద్దలతో పాటు పిల్లల మనసులనూ పలకరిస్తూ

తెలుగు కథకు కొత్త పాఠకలోకాన్ని నిర్మిస్తున్న మీ కృషి చిరస్మరణీయం! కథామంజరి ఇలా కథల పరిమళాలు వెదజల్లుతూ, ఇంకా ఎన్నో వసంతాలు జరుపుకోవాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

**నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

*కేంద్ర సాహిత్య అకాడెమీ (బాల) అవార్డు గ్రహీత, పార్వతీపురం.*

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# ఒక ప్రేమకథ

కందలగడ్డ పావని

***జీవితంలో ఏ మనిషిని కల్మషం లేకుండా ప్రేమించే వారు ఉండరు. అలాంటిది నన్ను చంటిబిడ్డలా కాపాడుకుంటూ వస్తున్నావు. నీ చేతుల మీద పెరగాలని నా నుదుటున రాసి ఉన్నట్టుంది. నేను అనుకున్న దాని కన్నా ఎక్కువ రుణపడిపోయాను నీకు! అయినా, నా జీవితంలో నాకు దొరికిన స్వచ్ఛమైన ప్రేమవి నువ్వు మాత్రమే! నువ్వు ఉన్నన్ని రోజులు నీతో ఇలానే ఉండిపోతాను.***

“పరిమళా! ఎక్కడున్నావే?” కంఠం అరిగిపోయేలా అరిచింది వీర్రాజు.

“ఏంటే నానమ్మ! కొంగలాగా అరుస్తున్నావు, వస్తున్నాను కదా!” అంటూ పరిమళ అటు ఇటు తిరుగుతూ, స్కూలుకు ఆలస్యం అవుతుందని కంగారు పడుతూ, మళ్ళీ

“అయినా ఏంటే ముసలి! ఎప్పుడూ స్కూలుకి ఆలస్యం అవుతుందని నేను ఏడుస్తుంటే, సరిగ్గా అదే సమయానికి రోజు ఏదో ఒక గొడవ చేస్తున్నావు!” అంది పరిమళ విసుగ్గా.

“ఇలా రా తల్లీ ...” అని పిలిచింది వీర్రాజు ప్రేమగా.

‘ఇంక నేను వెళ్ళినట్టే! రోజు చెప్పే కథే... వింటే కానీ వదలదు ముసలి!’ అని మనసులో అనుకుంటూ... “త్వరగా కానీ, నేను వెళ్ళాలి” అంటూ నానమ్మ కాళ్ళ దగ్గర కూర్చొని, ఒడిలో తలవాల్చింది.

“తెల్లారిన దగ్గర నుండి నీ వయసు పిల్లలు పెళ్లిళ్లు చేసుకొని...”

“ఆగాగు! పెళ్లిళ్లు కాదు, పెళ్ళి!” అంది పరిమళ పైకి లేచి.

“సరేలే పెళ్లి,” మనవరాలు తలపై మొట్టికాయ వేస్తూ, మళ్ళీ తల ప్రేమగా దగ్గరికి తీసుకొని ఒళ్లో వాలమని సైగ చేసింది.

“తల్లీ! చెప్పేది విను. ఈ ముసలిది రోజు నన్ను ఇలా సతాయిస్తుంది అనుకోకు. నేను వెళ్ళిపోయే లోపు నిన్ను ఒక ఇంటిదాన్ని చేయాలి. తల్లి తండ్రి లేకపోయినా నిన్ను నా కడుపులో పెట్టుకుని పెంచుకున్నాను. నీ పెళ్లి చూడాలని ఆశగా ఉంది పరిమళమ్మ!” అంది వీర్రాజు, కంటనీరు తుడుచుకుంటూ.

అదే అలసిన మొహాన్ని నానమ్మకి చూపించే ధైర్యం లేక అలా ఒక నిమిషం ఆగి,

"సరే వెళ్తున్నా, ఆలస్యమైంది!" టక్కున పరిగెడుతూ వెళ్లిపోయింది.

★★★




"వచ్చావా? ఇంత ఆలస్యం అయింది ఏంటి? నీ కోసం కొరమీను ఇగురు చేశాను. రా, భోంచేద్దాం!" అంది వీర్రాజు.

"కొరమీనా!" కళ్ళు పెద్దవిగా చేసి, ఎంతో ఆత్రంగా కాళ్లు చేతులు కడుక్కొని పళ్ళెం ముందు వాలిపోయింది పరిమళ.

“ఆ కొరమీనే నీకు ఇష్టమని పక్కింటి పిల్లాడికి డబ్బులు ఇచ్చి తెమ్మన్నాను. దొంగ వెధవ, చిల్లర తిరిగి ఇవ్వలేదు. రేపు కనపడనివ్వు... వెధవ చెవి మెలిపెట్టేస్తాను!” అంది వీర్రాజు, కారాలు మిరియాలు నూరుతూ!

“అబ్బా చాల్లే! ఎంతసేపు కథలు చెబుతూనే ఉంటావు. కూర్చో, ఇద్దరం భోజనం చేద్దాం.”

“ఏంటోనే, రోజురోజుకీ ఇలా చిక్కిపోతున్నావు. బెంగగా ఉంటుంది నీ మీద నాకు, తెలుసా?”

“ఏహే ఆపు! ఇద్దరం సరదాగా ముచ్చట్లు చెప్పుకుంటూ తిందాం. అయినా ఏంటి నువ్వు, ఎప్పుడు చూడూ ఆ ఏడుపుగొట్టు సీరియల్స్ చూడ్డం, నేను వచ్చాక ఆ ఏడుపు అంతా నా దగ్గర ఏడవడం? డిష్ తీయించేస్తాను ఆగు!”

“అమ్మో వద్దొద్దు! నువ్వు పనికి వెళ్లాక నాకేం పొద్దు పోతుందే? అవేగా నాకున్న కాలక్షేపాలు!”

“సర్లే, ఇంకాస్త అన్నం పెడతా ఆగు.. “ అంటూ నాన్నమ్మకు ప్రేమగా అన్నం వడ్డించింది.

“చాలు, మనవరాలి తిండి తిని బలిసిపోతుంది వీర్రాజు” అంటారు అందరూ.

“బలిసిపోతే బలిసిపో! ఇప్పుడు ఈ ఊర్లో నీకు కన్ను కొట్టే తాతలు ఎవరైనా ఉన్నారా ఏంటి?”

“ఛీ పోవే!” అంది వీర్రాజు, మొహాన్ని చీరకొంగుతో కప్పుకుంటూ.

“అమ్మ ముసలిదానా! సిగ్గే... ఉన్నారేంటి కొంపతీసి?” ఆ కొంగు లాగుతూ అడిగింది పరిమళ.

“అయినా.. నాకు ఈ వయసులో ఎవరు కన్ను కొడతారులే!” చిలిపిగా నవ్వుతూ అంది వీర్రాజు.

“హహహ! పళ్ళెం సింకులో పడేసి వస్తాను” అంటూ పరిమళ లేచి అన్ని సర్దుతూ ఉంది.

“కిందంతా ఊడ్చేసాను. పరుపేస్తాను పడుకుందాం, నిద్ర వస్తుంది, ఆ టేబుల్ ఫ్యాన్ పెట్టు. ఇవాళ బాగా ఉక్కగా ఉంది” అంటూ, పనులన్నీ తెవుల్చుకుని, నానమ్మను పట్టుకొని పరిమళ చంటి పిల్లలా పడుకుండిపోయింది.

★★★

“పొద్దున్నే గుమ్మం దగ్గర కోళ్లు పట్టేదానిలా తిరుగుతున్నావు ఏంటే?” అంది పరిమళ, నానమ్మను వెతుక్కుంటూ.

“అదా, నిన్న ఆ భడవ లేడూ? నా చిల్లర ఇవ్వకుండా...”

“అబ్బా! పొద్దున్నే మొదలు పెట్టావా? నిన్ను భరించలేకపోతున్నానే ముసలిదానా!” అంది పరిమళ, జడ అల్లుకుంటూ.

తిరిగి తనే.. “అవును, ఇవాళ సాయంత్రం ఏం కూర చేస్తున్నావు నానమ్మ?” కళ్ళల్లోకి చూస్తూ మురిపెంగా అడిగింది.

“నువ్వు నా పీడ తప్పించుకోవడానికి రోజు ఇంటికి ఆలస్యంగా వస్తున్నావు! నేనేం కూర వండితే నీకెందుకు?” అందు వీర్రాజు, మూతి తిప్పుకుంటూ.

“ఆ... తిప్పావులే మూతి! ఆ మూతికే పడ్డాడా ఏంటి ముసలోడు?” స్కూలుకు వెళ్లే బ్యాగులో అన్ని సర్దుకుంటూ అంది పరిమళ.

"అవును మరి.. కొడుకుని నా చంకన వేసి చచ్చాడు. మీ నాన్నను నేనే పెంచాను, నిన్ను కూడా! నా జీవితం మొత్తం ఈ కుటుంబానికి చాకిరీ చేయమని రాశాడేమో ఆ దేవుడు కూడా!" అంది విసుగ్గా, పరిమళకి డబ్బా కడుతూ.

"సర్లే, నా డబ్బా ఇవ్వు!" మొహం మాడ్చుకుని, విసుగ్గా డబ్బా లాక్కుని వెళ్ళిపోయింది పరిమళ.

★★★

"తల్లీ, వచ్చావా? నీ కోసమే వేడిగా యాలకులు వేసి టీ కాస్తున్నాను. గడప దగ్గర కూర్చో, తెస్తాను" అంది వీర్రాజు, టీ గ్లాసులో పోస్తూ.

"ఆ... సరే" అంటూ బయట కుళాయి దగ్గర కాళ్లు చేతులు కడుక్కొని వచ్చి, గడప దగ్గర కూర్చుంది పరిమళ.

"ఇదిగో తీసుకో గ్లాసు. ఇవాళ త్వరగా వచ్చేవే? నా తల్లికి నేను బాగా గుర్తొచ్చానా?" అంది, టీ గ్లాస్ చీర్స్ కొడుతూ.

"ఇవాళ ఏం కూర అయినా సరే, నాతో చేయించు. నాకు వంట నేర్చుకోవాలని ఉంది. నిదానంగా ఒక్కొక్కటీ నేర్చుకుంటాను. రోజు నువ్వే వండుతున్నావు, ఈ వయసులో కష్టపడుతుంటే నాకు బాధగా ఉంటుంది!" అంది పరిమళ, ఆకాశం నుండి రాలిపడ్డ ఆ తొలకరి వాన చినుకు భూమిని ముద్దాడడం చూసి.

"అదేమీ లేదు, నీకు వండి పెట్టడం నాకు ఎంతో ఇష్టం. అయినా నీకు నేర్పిస్తాను, నేను లేకపోయినా నువ్వు అన్ని చేసుకోవాలి కదా!" అంది వీర్రాజు, అదే ఆకాశాన్ని చూస్తూ.

"అదిగో! నాకు కోపం వస్తుంది నువ్వు ఇలా మాట్లాడితే!"

"పద వెళ్దాం, వర్షం వచ్చేలాగా ఉంది. ఈరోజు అసలే నెత్తళ్ల కూర, తెలుసా?" అంది వీర్రాజు చలాకీగా.

"హహహ! రోజు సముద్రంలో చేపలన్నీ మన ఇద్దరమే తింటున్నట్టు ఉంది" అంది పరిమళ నవ్వుకుంటూ.

"నూనె బాగా కాగినట్టుంది, ఉల్లిపాయ ముక్కలు వేయి. ఇప్పుడు అది వేగుతూ బాగా రంగు రావాలి, కానీ మాడనివ్వకు" అంది వీర్రాజు.

"సరే" గరిటతో కలుపుతూ, ఉల్లిపాయలను తదేకంగా చూస్తుంది పరిమళ.

"పరిమళమ్మా..." అంది వీర్రాజు ముభావంగా.

"ఏంటే అలా ఉన్నావు?" ఉల్లిపాయ ముక్కలు ఎక్కడ మాడిపోతాయో అని కంగారులో అంది పరిమళ.

"ఉదయం నేను బాగా నోరు జారాను. నువ్వు బాధ పడ్డావు కదూ?" పరిమళ కళ్ళలోకి చూస్తూ అడిగింది వీర్రాజు.

"నేనెందుకు బాధపడతాను? ఒక విధంగా అది నిజమే కదా నానమ్మా!" ఒక్కడే కొడుకు అని ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకున్నావు నాన్నని. కానీ, నాన్న ప్రేమ వివాహాలే ఒప్పుకోని రోజుల్లో, వయసు వచ్చాక అమ్మని ప్రేమించాడు. ఊర్లో జనం ఏమంటారో అని నీ గురించి ఆలోచించకుండా, అమ్మని తీసుకొని వేరే ఊరు వెళ్లిపోయాడు. నువ్వు ఎంత ఒంటరితనం అనుభవించి ఉంటావో కూడా నేను ఊహించలేను! నేను పుట్టాక అమ్మ చనిపోయింది, ఆ బాధతో నాన్న

మంచం పట్టి చనిపోయాడు. నాకంటూ ఈ భూమి మీద ఎవరూ లేరు అనుకుంటున్న సమయంలో, నన్ను గుండెలకి హత్తుకుని పెంచావు. నీ మీద నాకు కోపం ఎందుకు ఉంటుందే!" వీర్రాజు కళ్ళల్లోకి చూస్తూ అంది పరిమళ.

"నా బంగారు తల్లి! నువ్వు ఎంత ఎదిగిపోయావు! నీలా నన్ను ఎవరూ అర్థం చేసుకోలేదు!" అంది పరిమళ తల నిమురుతూ.

"ఆ... ఉల్లిపాయ వేగినట్టుంది! ఇప్పుడు నెత్తళ్లు వెయ్యాలి" అంది వీర్రాజు కంగారుగా.

"ఆ... వేస్తాను నానమ్మ!" అంది పరిమళ, నెత్తళ్లను కడుగుతూ.

"హా... అవి వేసి కలిపాక ఉప్పు, కారం, పసుపు, చింతపండు గుజ్జు వేసి కలిపి మూత పెట్టి ఉంచు. కాసేపటి తర్వాత సరిపడా నీరు వేసి, మరి కాసేపు నూనె పైకి తేలేదాకా ఉంచి కూర దించేయాలి... సరేనా?" అంటూ టకటక చెప్పేసి, పోపు డబ్బాలన్నీ చక్కబెట్టి వెళ్లిపోయింది వీర్రాజు.

'ఈ ముసలిది! నేర్పిస్తా అని, ఈ చేపలన్నీ నా మొహాన్న వేసి ఏదేదో చెప్పి వెళ్ళిపోయింది' అని మనసులో అనుకుంటూ.. "సర్లే, నువ్వు వెళ్ళు!" అంది పరిమళ వెటకారంగా.

★★★

"హమ్మయ్య! కూర అయితే అయిపోయింది. నీకే మొదట వడ్డిస్తాను కూర్చో. తిని ఎలా ఉందో చెప్పు," అంటూ పరిమళ కూర వడ్డించింది.

"అబ్బా తల్లి! ఎంత బాగా చేశావు!" మురిసిపోతూ తింటూ అంది వీర్రాజు.

"అవునా? ఆగు, నేను తిని చూస్తాను... అంత బాగా కుదిరిందా?" అన్నంలో కూర కలుపుకుంటూ అంది పరిమళ.

"అబ్బ దేవుడా! ఎంత కారం వేసాను? ఎలా తింటున్నావే నువ్వు?" అంది.

"నీసు కూరకి ఆ మాత్రం కారం పట్టదా ఏంటి? అయినా ఈ వయసుకే నువ్వు ఇలా ఉన్నావు, నన్ను చూసావా ఉక్కు శరీరం! ఏం పిల్లవో ఏంటో!" నెత్తిన మొట్టికాయ వేస్తూ అంది వీర్రాజు.

"అవును మరి! పదహారేళ్ల పడుచు పిల్లవి నువ్వు! అయినా అదేంటే, నీ పేరు వీర్రాజు? అదేం దిక్కుమాలిన పేరు? అటూ ఇటూ కాకుండా ఎవరైనా వింటే మగాడి పేరో, ఆడదాని పేరో కూడా అర్థం కాదు!" పకపక నవ్వుతూ అంది పరిమళ.

"చాల్లే నవ్వింది! ఏదో మా నాన్న అప్పట్లో తోచింది పెట్టాడు. మరి నీ పేరు ఏంటో... పరిమళ అంటా! ఏం పరిమళిస్తున్నావ్ ఏంటి?" వెక్కిరిస్తూ నవ్వింది వీర్రాజు.

"అబ్బో! ఇప్పటికి కూడా మీ నాన్నని ఏమి అనకూడదా?"

"అనకూడదు! కావాలంటే మీ నాన్నని అనుకో" మళ్లీ పెద్దగా నవ్వుతూ అంది వీర్రాజు.

"సరే, గది తుడిచి పక్క వేస్తాను. టేబుల్ ఫ్యాన్ పెట్టు" అంది పరిమళ.

"అబ్బా! ఎంత కడుపునిండా తిన్నాం! కాకపోతే ఈసారి కాస్త ఉప్పులు, కారాలు చూసి వేస్తాను" పడుకొని, నానమ్మ గుండెలపై తలవాల్చి అంది పరిమళ.

“ఏమైంది? మౌనంగా ఉన్నావు, ఏదో ఒకటి మాట్లాడు!” పరిమళ అనుమానంగా అడిగింది.

“నాకు నీ పెళ్లి చూడాలని ఉంది. నాకు చాలా బాధగా ఉంటుంది పరిమళ, చాలా కోపం వస్తుంది నీ మీద! మీ నానమ్మ మాటలు పడవు నీకు. నేను పోతే తెలుస్తుంది!” కంటతడి పెట్టుకుంటూ అంది వీర్రాజు.

“అలా మాట్లాడకు నానమ్మ! నన్ను బాగా చదివించావు. మన ఊర్లోనే పాఠాలు చెప్పుకుంటూ టీచరుగా నీతో ఇలా సంతోషంగా జీవిస్తున్నాను. తల్లి తండ్రి లేరన్న లోటు నాకు ఏ రోజు తెలియనివ్వలేదు. నన్నెంతో ఆప్యాయంగా చూసుకున్నావు. ఇలా నిన్ను ఈ వయసులో వదిలి వెళ్లి, నేను సంతోషంగా ఉన్నట్టు నటించలేను. జీవితంలో ఏ మనిషిని కల్మషం లేకుండా ప్రేమించే వారు ఉండరు. అలాంటిది నన్ను చంటిబిడ్డలా కాపాడుకుంటూ వస్తున్నావు. నీ చేతుల మీద పెరగాలని నా నుదుటున రాసి ఉన్నట్టుంది. నేను అనుకున్న దాని కన్నా ఎక్కువ రుణపడిపోయాను నీకు! అయినా, నా జీవితంలో నాకు దొరికిన స్వచ్ఛమైన ప్రేమవి నువ్వు మాత్రమే! నువ్వు ఉన్నన్ని రోజులు నీతో ఇలానే ఉండిపోతాను. తర్వాత నా జీవితంలో ఏ రోజైనా మళ్ళీ ప్రేమించాలనిపిస్తే, ఒకవేళ అలాంటి మనిషి దొరికితే... నేను మళ్ళీ ప్రేమిస్తాను. ఆ రోజు వరకు నీతో ఇలా ఉండనివ్వు!” అంటూ, ఒక్కసారి కళ్లను తుడుచుకుని.. “మనది ఒక అందమైన ప్రేమకథ కాదంటావా వీర్రాజు?” అన్నది పరిమళ.

“అనను...” అంటూ వీర్రాజు పరిమళను గట్టిగా హత్తుకుంది.

★★★

“తల్లి, డబ్బా కట్టాను తీసుకో” అంది వీర్రాజు హడావిడిగా.

“సరే.. స్కూలుకి వెళ్తాను. సాయంత్రం ఏం కూర నానమ్మ?” బుగ్గలు ముద్దాడుతూ అడిగింది పరిమళ.

“ఈరోజు వంజరం పులుసు. సాయంత్రం త్వరగా వచ్చేయ్, టీ కాచి తయారుగా ఉంటాను. వెళ్లిరా తల్లి, జాగ్రత్త!” నవ్వుతూ అంది వీర్రాజు.

‘ఆ మొహం సంతోషంగా నవ్వి ఎన్ని సంవత్సరాలు అయిందో!’ అనుకుంటూ.. “వెళ్ళొస్తాను నానమ్మ!” పరిమళ చాలా రోజుల తర్వాత నానమ్మకు టాటా చెప్తూ నవ్వుతూ వెళ్ళింది.

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ

ప్రత్యేక బహుమతి పొందిన కథ

జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# నడిచే శవాలు

పద్మావతి రాంభక్త

***"మనలాంటి మధ్యతరగతి వాళ్ళంత చవట సన్నాసులు భూమ్మీద ఇంకెవరూ ఉండరు. దేన్నీ ఎదిరించరు. బలమున్న వాళ్ళ అడుగులకు మడుగులొత్తుతూ బ్రతికేయడమే మనం చెయ్యగలిగింది. అన్నిటికీ 'అయ్యో పాపం' అనుకుంటూ కన్నీరు కారుస్తూ జీవనపోరాటం చెయ్యడమే మనకు వచ్చు. అన్నీ మర్చిపోయి ఏమీ జరగనట్టు ఉండడం మనకు అలవాటేగా. నువ్వు కూడా మర్చిపో".***

మొదటిసారి లక్ష్మిని రావుగారింట్లో చూసాను. లక్ష్మిని చూడగానే నన్నెందుకో ఆ పిల్ల ఆకర్షించింది. పన్నెండు పదమూడేళ్ళు ఉంటాయేమో మహా అయితే! చామనచాయ రంగులో, కళ గల ముఖం, వయసుకు మించి ఎదిగిన శరీరంతో చురుకుగా ఉంది. రావుగారింటి గృహప్రవేశానికి ఊళ్ళో లేకపోవడం వల్ల వెళ్ళలేకపోయాం. అందుకే ఒకసారి కనబడి వద్దాం అని మావారు అంటే నేను కూడా బయలుదేరాను. వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళని, బోలెడు వ్యాపారాలు ఉన్నాయని ఈయన చెప్తూ ఉంటారు. వాళ్ళకు ఈయన అకౌంటెంటే కాక చాలా లావాదేవీలలో సలహాలు ఇస్తుంటారు. అందుకే ఒక ఉద్యోగిగా మాత్రమే చూడకుండా ఒక పిసరు గౌరవం కూడా ఇస్తుంటారు.

పెద్ద డూప్లెక్స్ ఇల్లు, ఖరీదైన ఫర్నిచర్ వాళ్ళ దర్పాన్ని మరింత పెంచుతోంది. కానీ నన్ను ఆశ్చర్యానికి గురి చేసిన విషయం ఏమిటంటే ఇల్లంతా శుభ్రం చెయ్యడం, వంట చెయ్యడం.. అంతెందుకు మొత్తం పని అంతా లక్ష్మి భుజంపైనే ఉన్నట్టుంది. మేము వెళ్ళి హాల్లో కూర్చోగానే, ఇల్లు తడిగుడ్డతో తుడుస్తున్న పిల్ల శుభ్రంగా చేతులు కడుక్కుని, ట్రేలో గాజుగ్లాసుల్లో చల్లటి మంచినీళ్ళు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది. నన్ను చూసి పలకరింపుగా చిన్నగా నవ్వింది. మిగిలిన హాల్ తుడవడం పూర్తి చేసి వంటింట్లోకి వెళ్ళిందో లేదో రావుగారు "లక్ష్మీ కాఫీలు తీసుకురా" అంటూ కేక వేసారు.

"వస్తున్నా అయ్యగారూ" అంటూ కప్పుల్లో కాఫీతో రెండు నిముషాలలో ప్రత్యక్షమైంది ఆ పిల్ల.

ఇద్దరం కాఫీ తీసుకుని తాగి కప్పులు టీపాయ్ పై పెట్టాం. ఏ ఏమాటకామాటే చెప్పుకోవాలి. చిన్నపిల్ల అంత బాగా కాఫీ ఎలా కలపగలిగిందో అని నాకు ఆశ్చర్యమేసింది. అదే మన పిల్లలైతే కనీసం కాఫీకప్పు తీసి సింకులో కూడా పెట్టరు. అవసరం పని నేర్పుతుందేమో మరి!

కాసేపు రావుగారితో అవీ ఇవీ మాట్లాడాక మావారు 'ఇక వెడదామా' అని నన్నడిగారు. అక్కడున్న పత్రికలోని కథలో మునిగిన నేను ఉలికిపడి తలెత్తాను. వంటింటి గుమ్మం దగ్గర కింద కూర్చుని, లక్ష్మి కూరగాయలు తరుగుతోంది.

ఇంటికి వచ్చాక నేను లక్ష్మి గురించిన ఆలోచనలతో సతమయ్యాను.


ఈయన నన్ను గమనించి ”విద్యా.. ఏమిటలా డల్‌గా ఉన్నావు?” అనడిగారు.

“ఎందుకో ఆ పాపని చూసిన దగ్గర నుండీ మనసులో తనే మెదులుతోంది” అన్నాను.

“ఏ పాప గురించి మాట్లాడుతున్నావు?”

“అదేనండీ రావుగారింట్లో పాపం ఆ పిల్ల ఎంత పని చేస్తోంది. తన వయసు ఎంతని.. అన్ని పనులు తన నెత్తిన వేసారు. చక్కగా చదువుకుంటూ ఆడుకుంటూ ఉండే వయసు!” అన్నాను బాధగా.

“మొదలుపెట్టావా మళ్ళీ! ప్రపంచంలోని బాధలన్నీ నీకే కావాలి. ఆ అమ్మాయి తల్లిదండ్రులకు లేని బాధ నీకెందుకు చెప్పు!” అన్నారీయన.



నేనేమీ మాట్లాడకుండా మళ్ళీ ఆలోచనలో పడ్డాను.

అనుకోకుండా ఒక నెల రోజులకే వాళ్ళింట్లో పార్టీకి మాకు పిలుపొచ్చింది. అక్కడ అంతా ఖరీదైన జనాలే, అవును మరి.. రిచ్ సర్కిల్ వాళ్ళకి అలాంటి స్నేహితులే కదా ఉంటారు. వాళ్ళ మధ్య శాపవశాత్తు వెలిసిపోయిన దేవతలా లక్ష్మి తిరుగుతూ పనులు చక్కబెడుతోంది. 'తన ఊరేమిటో, అమ్మానాన్నలు ఏం చేస్తారో, ఎందుకు బడికి వెళ్ళకుండా పనికి కుదిరిందో'

అన్నీ అడగాలని ఉంది, కానీ నాకు అవకాశమే చిక్కలేదు.

ఇంతలో ఏదో కోలాహలం మొదలవడంతో అటువైపు చూసాను.

"మినిస్టర్లు వచ్చినట్టున్నారు పార్టీకి!" అన్నారు మావారు నెమ్మదిగా.

"అబ్బో వీళ్ళకి బాగా పలుకుబడి ఉన్నట్టుంది కదండీ!" అన్నాను ఆయన చెవిలో ఎవరికీ వినబడకుండా.

"అవును పెద్ద బిజినెస్ కదా! మనల్ని ఇక్కడికి పిలవడమే గొప్ప విషయం!" అన్నారు.

'డబ్బుంటే ఏదైనా చెల్లుతుంది. అలాంటి వారినే సమాజం గౌరవిస్తుంది' అనుకున్నాను.

రావుగారు హడావిడిగా వాళ్ళని రిసీవ్ చేసుకుని గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడ మందుపార్టీ పెట్టారేమో అనిపించింది. లక్ష్మి సోడాబాటిల్స్ పట్టుకుని ఆ గదిలోకి వెడుతోంది.

రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయాక కూడా అవే కలలు. ఆ కలలలో లక్ష్మి మోయలేని బరువులు మోస్తూ కనబడింది.

ఒకరోజు మేము బజారులో కూరగాయలు కొంటుంటే ఈయనకు రావుగారి నుండి ఫోన్ వచ్చింది.

నన్ను ఇంటి దగ్గర దింపి వెళ్ళమన్నా, ఈయన వినిపించుకోకుండా 'అర్జంట్' అంటూ నన్నూ లాక్కెళ్ళారు. రావుగారూ, ఈయనా మాట్లాడుకుంటుంటే, నా కళ్ళు లక్ష్మి కోసం వెతుకుతున్నాయి. తను కాఫీ కప్పులు పట్టుకుని వంటింట్లోంచి వచ్చి మాకందించింది. ఎంతలా ట్రెయిన్ చేసారో పిల్లని అనిపించింది. మేము కాఫీలు తాగుతుంటే.. 'ఇప్పుడే వస్తానని' రావుగారు వంటింటి వైపు వెళ్ళారు. మాకు తినడానికి తెమ్మని ఏమైనా చెప్పడానికి వెళ్ళుంటారని అనుకున్నాను. ఐదు నిముషాలు అయ్యాక, నేను చొరవగా కప్పులు ట్రేలో సర్ది సింక్‌లో వేద్దామని అటు నడిచాను. ఎవరింట్లో అయినా సరే నేను తాగిన కప్పులు, తిన్న పళ్ళాలు వంటింటి సింక్‌లో పెట్టేసి రావడం అలవాటు.

నేను వంటింటి గుమ్మం దగ్గరకు వెళ్ళానో లేదో అక్కడి దృశ్యం చూసి స్థాణువయ్యాను. రావుగారి చేతులు ఆ పిల్ల దేహంపై రకరకాలుగా కదులుతున్నాయి. ఆ అమ్మాయి ఇబ్బందిగా మెలికలు తిరుగుతోంది. నేను గిరుక్కున వెనుదిరిగి, చప్పుడు చెయ్యకుండా వంటింటి బైట ఉన్న బల్ల మీద ట్రే పెట్టి వచ్చేసాను. వాళ్ళు నన్ను చూసే అవకాశం లేదు. నాకు వళ్ళంతా అంత ఏసీలోనూ ఒకటే చెమట్లు!

"ఏమైంది విద్యా? ఉన్నట్టుండి అంత చెమట పట్టిందేమిటి?" అని మావారు అడిగారు.

"ఏమీ లేదు" అని చిన్నగా నవ్వాను.

ఆయన తను చదువుతున్న న్యూస్‌పేపర్‌లో మునిగిపోయారు.

రావుగారు తన స్థానంలో వచ్చి కూర్చుని "నా వైఫ్ ఏదో కిట్టీపార్టీ ఉందని వెళ్ళింది. పనిపిల్లకి ఉప్మా చెయ్యమని చెప్పి వచ్చాను. తినేసి వెళ్ళండి" అన్నారు నా వైపు చూసి నవ్వుతూ.

నేను ఏమీ మాట్లాడకుండా అవునూ కాదు అని నాకే అర్థం కానట్టు తలాడించాను

"అయ్యో వద్దండీ. విద్య ఇంట్లో వంట చేసేసింది" అన్నారీయన మొహమాటంగా.

"అది రేపు తినండి కావాలంటే. ఏదో ఒకటి మా ఇంట్లో తిని వెళ్ళండి శ్రీధర్" అన్నారు రావుగారు.

నాకెందుకో అక్కడ ఒక్క క్షణం కూడా ఉండాలనిపించలేదు. అలాగని వెడదామని నోట్లోంచి మాటా రాలేదు. శిలలా కూర్చుని ఉన్నాను.

ఎవరింటికీ వెళ్ళని నేను.. ఇన్నిసార్లు వీళ్ళ ఇంటికి రావడం ఏమిటి. లక్ష్మి నన్నాకర్షించడం ఏమిటి, నేను చూసిన దృశ్యమేమిటి? నా తలలో ఒకటే హోరు. ఇంటికి వచ్చి పడ్డాను కానీ, నా మనసు మనసులో లేదు. మా వారికీ విషయం నా నోటితో నేను చెప్పలేకపోయాను.

మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి. నేను ఆ విషయం ఈయనకి చెప్దామని చాలాసార్లు ప్రయత్నించాను కానీ నోరు పెగలలేదు.

ఒక రోజు మేము మ్యాట్నీ సినిమా చూసి వస్తుంటే మా బండి ఆగిపోయింది. ఒక వైపు మండుటెండ కాల్చేస్తోంది. నోరెండిపోయి విపరీతమైన దాహం. కూల్‌డ్రింకో, వాటర్‌బాటిలో కొనుక్కుని తాగుదామన్నాను నేను.

"ఇక్కడ ఏమీ దొరకవు. కనుచూపు మేరలో ఒక షాప్ కూడా లేదు చూడు. ఒక పని చేద్దాం. ఈ పక్కనే రావుగారిల్లు. బండి వాళ్ళింట్లో పెట్టేసి కాసిని చల్లటి నీళ్ళు తాగేసి, అక్కడ నుండి ఆటోలో వెళ్ళిపోదాం" అన్నారీయన.

నేను నీరసంగా సరే అన్నట్టు తలాడించాను.

బండి గేటు లోపలకి తీసుకెడుతుంటే రావుగారు సరిగ్గా బయటకు వచ్చారు.

"సర్ బండి ఆగిపోయింది...." అంటూ ఈయనేదో చెప్పబోతుంటే,

"సరేలే ముందు లోపలకి వచ్చి కాస్త సేదదీరండి. మంచి ఎండలో వచ్చారు!" అన్నారు.

మేము వెళ్ళి కూర్చున్నామో లేదో లక్ష్మి జూస్ గ్లాసులు తెచ్చి అందించింది. అలసటలో గబగబా ఒక్క గుక్కలో తాగేసి.. అప్పుడు చూసాను ఆ అమ్మాయి వైపు పరీక్షగా.

"మరి కొంచెం తాగుతారా అమ్మగారూ, తెమ్మంటారా? "అనడిగింది.

వద్దంటూ తలాడించాను. తను వంటింట్లోకి వెళ్ళిపోయింది. రావుగారు తన వెనకే వెళ్ళారు. నేను కూర్చున్న చోటు నుండి కదలలేదు. పది నిముషాలకు ట్రేలో పళ్ళముక్కలతో వచ్చింది. అక్కడ టీపాయ్ మీద పెట్టేసి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. ఆ అరనిముషంలో తన చేతులు, బట్టలు గమనించాను. చేతులకు గోళ్ళరంగు వేసుకుంది. ఒక మాదిరి పల్చని బట్టల లోపల ఇన్నర్స్ బ్రాండ్ తో సహా కనబడ్డాయి. నాకు జరుగుతున్నది కాస్తకాస్తగా అర్థమైంది. రావుగారు ఆ పసిపిల్లని ఎలా లొంగదీసుకున్నారో గమనింపుకు వచ్చింది. అభం శుభం తెలియని అమ్మాయి. ఇంకా వయసుకు కూడా రాలేదు.

వాళ్ళ అమ్మానాన్నలకు తెలుసో తెలీదో. డబ్బు అవసరంతో కూతురిని బాగా ఉన్నవాళ్ళ ఇల్లు కదా అని పనికి పెట్టుంటారు.

తప్పొప్పులు ఈ పిల్లకి ఎవరు చెప్తారు. నా బుర్ర బద్దలైపోతుందేమో అనిపించింది.

ఇంటికి రాగానే స్నానం చేసి తలనెప్పి మాత్ర వేసుకుని పడుకున్నాను. సాయంత్రం లేచి నాకు ఆయనకు టీ పెట్టాను. టీ తాగుతుండగా..

"ఏమండీ రావు ఆ పసిపిల్లని..." అని ఆగాను. నాకు మాట పెగలట్లేదు.

"ఏమిటి విద్యా? ఏమైంది? నీ గొంతేమిటి అలా బొంగురుపోయింది?"

అప్పుడు నెమ్మది నెమ్మదిగా నేను చూసింది, గమనించింది వివరించాను.

ఈయన మాట్లాడకుండా నిశ్శబ్దంగా టీ కప్పు పక్కన పెట్టి కళ్ళు మూసుకున్నారు.

"ఏమండీ" అన్నాను.

ఊహూ సమాధానం లేదు.

పావుగంట గడిచాక.. "విద్యా అంతా మర్చిపో" అన్నారు నెమ్మదిగా. నూతిలోంచి వచ్చినట్టు వచ్చింది మాట.

"అది కాదండీ" అన్నాను.

"చూడూ. వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు"

"ఐతే"

"చెప్పింది విను ముందు" అన్నారు కానీ, ఏమీ మాట్లాడలేదు.

ఆయన చెప్పబోయేది నాకు అర్థమవుతోంది.

"ఏమండీ మనం కంప్లైంట్ ఇద్దామా?" అన్నాను.

"ఎవరి మీద, ఎవరికి?" అన్నారు.

"పోలీస్ స్టేషన్..." అంటూ ఏదో అనబోయాను.

"పిచ్చా నీకు. ఆ రోజు చూసావు కదా? వాళ్ళ పరిచయాలు ఎలాంటివో. మినిస్టర్ల దగ్గర నుండి పెద్ద పెద్ద వాళ్ళు తెలుసు వాళ్ళకి. ఈ వ్యవస్థ గురించి తెలిసే మాట్లాడుతున్నావా?'

"అది కాదండీ. పాపం లక్ష్మి.."

"పాపమే కానీ మనం ఏమీ చెయ్యలేం. మనం వాళ్ళతో తలపడి గెలవలేం విద్యా. నీకెందుకు అర్థమవట్లేదు ఈ విషయం!"

"పోనీ లక్ష్మి వాళ్ళ అమ్మానాన్నలు ఎక్కడున్నారో కనుక్కుని అంతా చెబుదామా?"

"ఏమంటున్నావు. అది జరిగే పనేనా? నీకు ప్రపంచం గురించి, రావు గురించి తెలీక మాట్లాడుతున్నావు. మనతో మంచిగా ఉంటున్నాడనా? వాడి లొసుగులన్నీ నాకు తెలుసు. నన్ను జాగ్రత్తగా వాడుకుంటున్నాడు అంతే. తేడా వస్తే ఏం చేస్తాడో నా నోటితో నేను చెప్పను, చెప్పలేను. ఈ విషయం ఇంతటితో వదిలెయ్యి!" అన్నారు.

అలా అంటుంటే ఆయన కళ్ళలోంచి నీటిబొట్లు చెంపల మీదకు జారాయి.

షర్టుతో కళ్ళు తుడుచుకుని.. "మనలాంటి మధ్యతరగతి వాళ్ళంత చవట సన్నాసులు భూమ్మీద ఇంకెవరూ ఉండరు. దేన్నీ ఎదిరించరు. బలమున్న వాళ్ళ అడుగులకు మడుగులొత్తుతూ బ్రతికేయడమే మనం చెయ్యగలిగింది. అన్నిటికీ 'అయ్యో

పాపం' అనుకుంటూ కన్నీరు కారుస్తూ జీవనపోరాటం చెయ్యడమే మనకు వచ్చు. అన్నీ మర్చిపోయి ఏమీ జరగనట్టు ఉండడం మనకు అలవాటేగా. నువ్వు కూడా మర్చిపో అంతే. నన్ను క్షమించు ఏమీ చెయ్యలేకపోతున్నందుకు! ఇక మీదట రావు ఇంటికి నిన్ను తీసుకెళ్ళను. అదే నేను చెయ్యగలిగిన పెద్ద ఉపకారం నీకు!" అంటూ చేతులు జోడించారు.

నేనేమీ మాట్లాడలేక గుడ్లప్పగించాను.

ఒక ఆరు నెలలకు అనుకుంటాను. న్యూస్‌పేపర్లో చిన్న వార్త వచ్చింది. అది చదివి షాక్‌కు గురయ్యాను.

"ప్రముఖ వ్యాపారవేత్త రావుగారింట్లో పని చేసిన పద్నాలుగేళ్ళ పనిపిల్ల ప్రేమలో పడి, మోసపోయి విషం తాగి చనిపోయింది. చిన్న చిన్న పిల్లలు కూడా ఈ ప్రేమ ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అంతా సినిమాల ప్రభావం...." అంటూ ఏదేదో రాసారు.

అది చదివి ఆగలేక వెక్కివెక్కి ఏడ్చాను. నేనైనా ఏదో ఒక ప్రయత్నం చేసి ఉంటే కనీసం ఆ పసిపిల్ల ప్రాణాలతో మిగిలేది. రావు ఇంట్లో మరొక పనిపిల్ల కుదిరే ఉంటుంది. ఆ విషయం నేను మావారిని అడగలేదు, ఆయనా ఆ మాట ఎత్తలేదు. ఎందుకంటే జాలిపడడం తప్ప చెయ్యందించలేని నన్ను, నాలాంటి ఈ సమాజంలోని చాతకానివాళ్ళను "నడిచే శవాలు" అనాలేమో .

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# రెండు ఉత్తరాలు

కోయిలాడ రామమోహనరావు

***నా అనంతరం, నేను చేపట్టిన కార్యక్రమాలను నా వారసుడిగా నా కన్న కొడుకు, విశ్వనాథ్ కొనసాగిస్తాడని ఎంతో ఆశపడ్డాను. నేను సాధించాలనుకున్నవన్నీ సాధిస్తానని, వితంతు వివాహం చేసుకొని అందరికీ స్ఫూర్తిగా నిలుస్తాననీ వాగ్దానం చేసిన నా కొడుకు, ధనవంతురాలైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు, నా ఆశలన్నీ అడియాసలు చేశాడు.***

హైదరాబాద్

03–09–1953

గౌరవనీయులైన భరద్వాజ మాస్టారికి,

ఒకప్పటి మీ శిష్యురాలు సుగుణ పాదాభివందనాలతో వ్రాయునది,

మీకు ఇలా ఉత్తరం రాసి ఒక అడగరాని అరుదైన కోరిక కోరే పరిస్థితి, ఈ అభాగ్యురాలికి వస్తుందని, ఏనాడూ అనుకోలేదు.

మా మిత్రుడు, మల్లేష్‌తో మా బాబు, జైరాజ్‌ను మీ దగ్గరికి పంపుతున్నాను. నేను కోరే కోరిక చాలా అసమంజసమైనదని నాక్కూడా తెలుసు. కానీ తప్పడం లేదు. వాడిక మీ దగ్గరే పెరగాలని నా కోరిక! సద్బ్రాహ్మణులైన మీ ఇంట్లో ఒక శూద్రుడిని ఉంచుకోవడం మీకు ఎంతో ఇబ్బంది అని తెలిసినా, నాకు వేరే మార్గం తోచలేదు. నా కొడుకు మీలాగే ఆదర్శ పురుషుడిగా ఎదగాలనేదే నా కోరిక.

మేము మీ దగ్గర చదువుకున్న రోజులు, మీతో గడిపిన రోజులు, మీతో కలిసి చేసిన ఉద్యమాలు నాకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నాయి. మీరు మాకు ఒక ఉపాధ్యాయులే కాదు, మంచి స్నేహితులు, మార్గదర్శి. మీలో ఒక సంఘసంస్కర్తను, ఒక నవయుగ వైతాళికుడిని, స్థితప్రజ్ఞుణ్ణి, ఒక మంచి మనిషిని చూసాను. ఆ లక్షణాలే నా కొడుకులో కూడా చూడాలని ఆశపడుతున్నాను.

ఆ రోజుల్లో మీ ఉపన్యాసాలు మమ్మల్ని ఎంతో ప్రభావితం చేసేవి. మన ప్రాంతంలో సాంఘిక దురాచారాలు రూపుమాపాల్సిన రోజు వచ్చిందని, ఇప్పటికీ మనం ఎంతో వెనకబడి ఉన్నామని, మన వ్యవస్థను సంస్కరించుకోవాల్సిన సమయం ఆసన్నమైనదని, కుల వివక్ష, మూఢాచారాలు, వితంతు వివాహాలు, అంటరానితనం మొదలైన అంశాలపై దృష్టి

పెట్టాలని ఉద్బోధించారు. మేము కూడా మీ మార్గదర్శకత్వంలో ఆ కార్యక్రమాల్లో ఉధృతంగా పాల్గొని, వాటిని విజయవంతం చేశాం. మిమ్మల్ని 'తెలంగాణ వీరేశలింగం' అని అందరూ పొగుడుతూ ఉంటే మేమెంత పొంగిపోయామో, నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది.



మన ప్రాంతం బాగా వెనకబడి ఉంది కనుక మీ తరంతో పాటు మరో రెండు తరాలు అవిరళ కృషి చేస్తే గాని, మన సమాజం బాగుపడదనే మీ మాటలు నాకు ఇంకా గుర్తున్నాయి. అందుకే నా వంతుగా నా కొడుకును సమాజ సేవకు అందిస్తున్నాను.

మీ ఆదర్శ భావాలు నర నరాల జీర్ణించుకున్న నేనూ, రవీందర్ మీ దగ్గర చదువు పూర్తి చేసినా, మీరు నిర్వహించే సభలకు ఉద్యమాలకు, కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే వాళ్ళము. అలా మా పరిచయం పెరిగి, ప్రేమ పెళ్ళికి దారి తీయడం, దాని పర్యవసానాలూ మీకు గుర్తుండే ఉంటాయి. మాది కులాంతర వివాహం కావడంతో, మా పెళ్లి చాలా పెద్ద సమస్య అయింది. అణగారిన వర్గానికి చెందిన రవీందర్‌తో వివాహానికి మా అమ్మ, నాన్న ఒప్పుకోలేదు. వాళ్ళ అనుమతి లేకుండానే పెళ్లి చేసుకున్నాం.

అయితే మా పెళ్లితో మీకు ఏ సంబంధం లేకపోయినా మా నాన్న, మా బంధువులను తీసుకొని వచ్చి, మీ ఇంటి మీద దాడి చేసి, దీనికంతా కారణం మీరేనని నానా మాటలు అనడం, మీ వల్లనే పిల్లలు చెడిపోతున్నారని ఆరోపించడం నాకు బాగా గుర్తు. మరొకరు ఎవరైనా ఆ సంఘటనతో సమాజ సేవకు స్వస్తి చెప్తారు. అయినా మీరు చలించక, అన్ని అవమానాలను భరిస్తూనే మీ కార్యక్రమాలను కొనసాగించారు. అందుకనే మీరంటే నాలాంటి వాళ్లకు ఎంతో ఆరాధన.

హైదరాబాదులో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్లో ఎస్సైగా రవీందర్‌కి ఉద్యోగం వచ్చాక, మా అత్తమామలతో సహా అక్కడికి మారాము. అక్కడే జైరాజ్ పుట్టాడు. ఎనిమిదేళ్ళ వరకు మా సంసారం చాలా బాగా జరిగింది. కానీ ఆ తర్వాత నా జీవితాన్ని చిన్నాభిన్నం చేసే రోజులు దాపరించాయి.

రవీందర్‌లో బాగా మార్పు వచ్చింది. కట్టలు కట్టలుగా వచ్చి పడుతున్న డబ్బు అతని అవినీతిపరుడిగా మార్చేసింది. వ్యాపారులు, ఉద్యోగులు అన్ని వ్యసనాలు అలవాటు చేశారు. అతన్ని దారి తప్పుతున్నాడని తెలిసినా కూడా నేనేమీ చేయలేకపోయాను.

ఆ బాధలు చాలవన్నట్లు, నా ఆరోగ్యం దెబ్బతింది. డాక్టర్లు 'క్షయ వ్యాధి' అని నిర్ధారణ చేశారు. నేనలా సంసారిక సుఖానికి పనికిరాకుండా పోవడం వల్ల, రవీందర్ ఒకామెను ఉంచుకునే స్థాయికి దిగజారాడు. మా ఇద్దరి మధ్య బంధం బాగా బలహీన పడింది. రాను రాను నా ఆరోగ్యం దిగజారడం మొదలయింది. ఆ వ్యాధి తమకు ఎక్కడ సోకుతుందోనని, మా అత్త మామ బాగా ఆందోళన చెందడం మొదలు పెట్టారు.

అప్పుడు మా ఇంటికి దూరంగా, పెరట్లో ఒక పాక వేయించి, నన్ను అందులోకి మార్చారు. నౌకరు యాదగిరి తప్ప నా దగ్గరికి ఎవరూ వచ్చేవారు కాదు. రవీందర్ నన్ను పూర్తిగా పట్టించుకోవడమే మానేశాడు. నా బాబుని చూడకుండా ఉండలేకపోయేదాన్ని. కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే, మా ఫ్యామిలీ ఫ్రెండ్ అయిన, మల్లేష్ చొరవ తీసుకొని రవీందర్‌ని ఒప్పించి, దూరం నుంచి మా బాబుతో మాట్లాడే ఏర్పాటు చేశాడు.

అతనే చొరవ తీసుకుని, మా అమ్మానాన్నలను కలిసి, నా దీనస్థితిని వివరించినా, వాళ్ళు కరగలేదు. కూతురు ఎప్పుడో చచ్చిపోయిందని అన్నారట. ఆ మాట వినగానే చచ్చిపోవాలని అనిపించినా, నా కొడుకు గురించి ఆలోచించి ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఏ జన్మలో ఏం పాపం చేశానో గానీ దేవుడు నాకు ఇంకా పరీక్షలు పెడుతూనే ఉన్నాడు. మదనపల్లి శానటోరియంలో జాయిన్ చేసి తీరాలని డాక్టర్లు చెప్పారు. మా బాబుకి దూరమయిపోతున్నాననే బాధ నన్ను బాగా కుంగదీసింది.

రవీందర్ దగ్గర నా బాబు పెరగడం నాకు ఇష్టం లేక పోయింది. అప్పుడే బాబుని మీ దగ్గరికి చేర్చాలని నిర్ణయం

తీసుకున్నాను. రవీందర్ గాని, మా అత్తమామలు గాని అందుకు ఒప్పుకోలేదు. పురుగుల మందు తాగి చస్తానని పెద్ద గొడవ పెట్టాను. అలా బెదిరిస్తే గాని రవీందర్‌కి ఒప్పుకోక తప్పింది కాదు. ఉంచుకున్న దాని మీద మోజు ఎక్కువైపోవడం వల్ల మా బాబును కూడా పట్టించుకోవడం మానేశాడు. అందుకే మీ దగ్గర నుంచి బాబుని తిరిగి తీసుకెళ్లడనే నమ్మకం నాకు కుదిరింది.

నేను ఎన్నాళ్లు బతుకుతానో తెలియదు. చనిపోయే ముందు ఒక మంచి పని చేశాననే తృప్తి నాకు మిగల్చండి. ఈ దీనురాలిని కనికరించండి. నా కోరికను కాదనరనే కొండంత నమ్మకంతో...

అభాగ్యురాలు,
సుగుణ

★★★

హనుమకొండ
15–02–1969

చిరంజీవి సౌభాగ్యవతి సుగుణను

దీవించు వ్రాయునది ఏమనగా,

నాకు ఈ మధ్య ఆరోగ్యం బాగుండటం లేదు. చరమ దశకు వచ్చేసానేమో అనిపిస్తుంది. ఇదే నీకు రాసే ఆఖరి ఉత్తరం కావచ్చు. ఐదేళ్ల క్రితం నీకు ఆరోగ్యం కుదుటపడినా, నీ కొడుకు పూర్తి ప్రయోజకుడు అయ్యేవరకు నా దగ్గరే ఉంచాలని నిర్ణయం తీసుకొని, అక్కడి రోగులకు సేవ చేస్తూ, మదనపల్లిలోనే ఉండి పోయావు.

నేను జైరాజ్‌ని పెంచి ప్రయోజకుడిని చేసినందుకు, వాడు బదులు తీర్చేసాడమ్మా. ఆ విషయం చెప్పడానికి, నీకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పడానికి ఈ ఉత్తరం రాస్తున్నాను.

నా అనంతరం, నేను చేపట్టిన కార్యక్రమాలను నా వారసుడిగా నా కన్న కొడుకు, విశ్వనాధ్ కొనసాగిస్తాడని ఎంతో ఆశపడ్డాను. నేను సాధించాలనుకున్నవన్నీ సాధిస్తానని, వితంతు వివాహం చేసుకొని అందరికీ స్ఫూర్తిగా నిలుస్తానని వాగ్దానం చేసిన నా కొడుకు, ధనవంతురాలైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు, నా ఆశలన్నీ అడియాసలు చేశాడు. కేవలం ఆస్తి కోసమే అలా నటించాడని, ఆలస్యంగా తెలుసుకున్నాను.

జైరాజ్ నా కన్నబిడ్డ కాదు కాబట్టి వాడి నుంచి ఏదీ ఆశించలేదు. కానీ అతి క్లిష్టమైన పరిస్థితుల్లో అనూహ్యంగా వాడే ముందుకు వస్తాడని నేను ఏనాడూ ఊహించలేదు.

వారం రోజులు క్రితం మేము అందరం తలలు దించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వితంతువులకు జీవనోపాధి కలిగించడానికి స్థాపించిన ఆశ్రమంలో ఎన్నాళ్ల నుంచో ఉంటున్న, 'కోమలి' అనే వితంతువు నెల తప్పిందని తెలిసింది. దానికి కారణమైన వాడెవడో తెలుసుకుందామని ఎన్ని రకాలుగా ప్రయత్నించినా, ఆ అమ్మాయి ఎందుకో నోరు విప్పలేదు. నేను చేసే పనులను విమర్శించే ఛాందసవాదులకు ఒక గొప్ప అవకాశం దొరికింది. నానా రచ్చ చేశారు. కోమలికి జరిగిన అన్యాయం గురించి నిలదీశారు. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక సతమవుతమవుతున్న నాకు గుండెపోటు

ప్రారంభమైంది. అయినా ఆ రాక్షసులు వదిలేలా కనిపించలేదు. ఆ సమయంలో దేవుడిలావచ్చి ఆదుకున్నాడు నీ కొడుకు, 'కోమలిని వివాహం చేసుకుంటాను' అంటూ! ఆమెను ఉద్ధరిద్దామనో లేదా నన్ను కాపాడుదామనో ఆవేశంలో నిర్ణయం తీసుకుంటున్నాడని, అతన్ని ఆపుదామని చాలా ప్రయత్నం చేశాను. అదేమీ కాదని, ముందు నుంచి కోమలి అంటే తనకు అమితమైన ప్రేమని, అందుకే ఆమెను పెళ్లాడి తీరుతానని మొండికేసాడు.

వాడిప్పుడు నీ రాక కోసం ఎదురు చూస్తున్నాడు. నీ ఆశీస్సులతో కోమలి మెడలో తాళి కట్టే శుభసమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

చివరిగా ఒక మాట. కోమలి జీవితాన్ని నాశనం చేసిన భ్రాష్టుడు నా కొడుకే. అలాంటి కొడుకును కన్నందుకు నేను ఎంత క్షోభించానో అంతకన్నా ఎక్కువగా ఆనందించాను నీ కొడుకుని సాకినందుకు! ఆ అవకాశం నాకు ఇచ్చినందుకు మనస్ఫూర్తిగా నీకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇక పైన జైరాజే నా కొడుకు, నా ఆశయాలకు వారసుడు!

నువ్వు వచ్చే వరకు నేను బతికి ఉంటానో లేదో తెలియదు, అయినా కడసారి చూపుల వరకు ఎదురు చూస్తూనే ఉంటాను.

దీవెనలతో
భరద్వాజ

# జాలి గుండె

బొందల నాగేశ్వరరావు
✆ 9500020101

***ఓ ప్లేటులో కొబ్బరి చట్నీ తో, నాలుగు ఇడ్లీలు, తెచ్చి పాప చేతికిచ్చింది. ఆవురావురుమంటూ తింటుంది పాప.***

***“ఇదమ్మా మా బ్రతుకు! అందుకే తను ఒక్కర్తే అయినా బ్రతగ్గలదన్న ధైర్యం, నమ్మకం తనకు రావాలని, ఈ వ్యాపారాన్ని నేర్పుతున్నాను!” అంది ముసలావిడ.***
***రెండు నిముషాలు ఆలోచించాను. ఓ నిర్ణయం తీసుకున్నాను.***

***ధృఢంగా ”సరే.. నీకూ, నీ పాప భవిష్యత్తుకు బ్రతకటానికి భరోసా కల్పిస్తే, పిల్లను బడికి పంపుతావా!” అడిగాను.***

***ముసలావిడ ఆలోచిస్తోంది.***

ప్రతి రోజూ మధ్యాహ్నం ఓ అరవై ఏళ్ళ ముసలావిడ పళ్ళ బుట్టను నెత్తిన పెట్టుకొని మా వీధి వెంట ‘పళ్ళమ్మా పళ్ళూ’ అని అమ్ముకుంటూ వెళుతుంది. ఆ గొంతు వింటూనే మా ఇంటి మేడ మీదావిడ క్రిందికి వస్తుంది. ఆవిడని చూస్తూనే ముసలావిడకు ఎక్కడ లేని సంతోషం! ఎందుకంటే తను ఖచ్చితంగా వంద రూపాయలకు పైనే పళ్ళను కొంటుంది.

ఆ రోజు పళ్ళమ్ముకుంటూ వచ్చిన ముసలావిడ గేటు తీసుకొని లోనికొచ్చి, వరండాలో నిలబడి వున్న నన్ను చూసి బుట్టను క్రిందకు దించమన్నట్టు సైగ చేసింది. బుట్టను దించాను. అయితే వెంటనే లోనికెళ్ళి చేతులు కడుక్కున్నాను. ఎందుకంటే.. చింపిరి జుట్టు, మురికి బట్టలు, గార పళ్ళతో కనబడే ఆమె రూపం, నాకు జుగుప్సను కలిగిస్తుంది!


ఒక్కోసారి మేడ మీదావిడ కూడా బుట్టను దించుతుంది. కాని తను నాలా చేతులు కడుక్కోదు. ముసలావిడ ప్రక్కనే కూర్చొని, ముచ్చటలాడి పళ్ళను తక్కువ ధరకే తీసుకుంటుంది.

ముసలావిడ ‘పళ్ళను అమ్ముకుంది కదా.. ఇక వెళ్ళి పోతుందిలే’ అనుకుంటాను నేను! కాని, ఎండకు భయపడి వెళ్ళదు సరికదా.. బుట్టను ప్రక్కన పెట్టుకొని, పమిటను పక్కగా చేసుకొని, పడుకొని నిద్రపోతుందక్కడే!

గంట మూడవుతుండగా లేచి, ’అమ్మా! మంచి నీళ్ళు ఇవ్వమ్మా’ అని మా ఇంట్లోకి కేకేస్తుంది. నేను ‘పాపం పోనీలే అని పడుకోనిస్తే, మంచినీళ్ళు కూడా ఇవ్వాలి’ అనుకుంటూ, ఇష్టం లేకపోయినా దాహానికి నీళ్ళివ్వటం ధర్మం అన్న భావనతో, చెంబుతో మంచినీళ్లు ఇస్తాను. నీళ్ళు తాగి, ‘నువ్వు చల్లంగా వుండాలి తల్లి’ అని బుట్టను తల మీద పెట్టించుకుని, చిన్నగా నవ్వుకుంటూ, ‘పళ్ళమ్మా, పళ్ళు’ అని గట్టిగా అరుచుకుంటూ, వీధి వెంట వెళ్ళిపోతుంది.

నేనైతే.. 'ముసలావిడ ఈ వయస్సులో పళ్ళమ్ముకోవటం బాధాకరం' అనుకుంటానే, కాని పళ్ళను మాత్రం ఆమె వద్ద కొనను. అయితే, 'ఈ వయస్సులో పళ్ళమ్ముకోవటానికి కారణం ఏమైయుంటుంది? తనకు ఎవరూ లేరా? వున్నా పట్టించుకోరా లేక తనే పళ్ళమ్ముకుంటుందా?' అని అనుకుంటాను.

ఏదైనా సరే.. ఒక రోజు అడిగి వివరాలు తెలుసుకోవాలనుకున్నాను.



మరుసటి రోజు మా వీధి చివర 'పళ్ళమ్మా పళ్ళో' అని అమ్ముకుంటూ వస్తోంది ముసలావిడ! గబగబ వరండాలోకి వచ్చి, రోడ్డు వేపు చూశాను. అక్కడ కొందరు చెల్లా చెదరగా పడి వున్న పళ్ళను తీసి బుట్టలోకి సర్ది ముసలావిడని పైకి లేపి, బుట్టను తల మీద పెట్టి, పంపుతుంటే ఆమె కుంటుతూ, మా ఇంటికొచ్చి గేటు తీసుకొని వరండాలో వున్న నన్ను చూసి.. "అమ్మా! పైనింటి అమ్మగారు వూరెళ్ళిపోయారా?" అడిగింది.

"బంధువుల పెళ్ళిళ్ళని వూరెళుతున్నట్టు నీతో చెప్పిందిగా! రాత్రే వెళ్ళింది. రావటానికి నెల రోజులు పడుతుందని చెప్పింది!"

"నెల రోజులా.. అయితే నాకు మూడు వేల రూపాయల బేరం పోయిందన్న మాట!" అని బాధతో వెనుతిరగబోయింది.

"ఆగు. తను లేకపోతే ఏం.. పళ్ళను నేను కొంటాను!" అన్నాను.

"మీరా.. నా వద్ద కొనరు కదమ్మా! బజారుకెళ్ళి తెచ్చుకుంటారు!" అంది ఆశ్చర్యాన్ని కనబరుస్తూ.

"లేదు. ఇవాల్టి నుంచి నీ వద్దే కొంటాను. బుట్టను దించు" అంటూ, నేనో చెయ్యి వేసి, క్రిందకు దించాను.

బుట్ట ముందు కూర్చొని "చెప్పండమ్మా.. ఏం కావాలి?" అడిగింది.

"కిలో ఆపిల్, డజను అరటి పళ్ళు, అర్ధకిలో జామపళ్ళు ఇవ్వు!"

అడిగినవన్నీ ప్లాస్టిక్ కవరులో వుంచి చేతికిస్తూ, "రెండు వందల పది రూపాయలయ్యా యమ్మా! రెండు వందలిచ్చుకోండి చాలు!" అంది.

రెండు వందల నోటును ఆవిడ చేతికిస్తూ "పర్వాలేదే! పది రూపాయలు తగ్గించావే!" అని నవ్వాను.

"దాందేముందిలే అమ్మా! నువ్వు ధర్మతల్లివి. రోజూ నీ చేత నీళ్ళను తెప్పించుకొని తాగి, ఇక్కడే వరండాలో హాయిగా కాస్సేపు సేద తీరి వెళుతున్నాను. ఆ పుణ్యం నీదే కదమ్మా!" అంది.

షాక్ తిన్నాను నేను! ముసలావిడకి నాపై ఎంతటి కృతజ్ఞతా భావంతో కూడుకున్న మంచి మనసుందో! ఛీ.. నేనే ఆమె బాహ్య రూపాన్ని, చూసి తక్కువగా అంచనా వేసి అసహ్యించుకున్నాను.

"మరిచిపోయా.. నీకు మంచినీళ్ళు ఇవ్వాలి కదూ!" అంటూ పళ్ళ బ్యాగుతో ఇంట్లోకి నడిచాను. చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చాను. నీళ్ళు తాగి, అలాగే పమిటను పరుచుకుని పడుకుంది.

"ఇదిగో.. నిద్ర పోదువు కానీ... నువ్వు మా వీధి చివర క్రింద పడ్డావా? అక్కడున్న వాళ్ళు పళ్ళను బుట్టలోకి సర్ది, నిన్ను లేపి, బుట్టను తల మీద పెట్టి పంపితే, నువ్వు కుంటుతూ వచ్చావు. నేను చూశాను!"

"అవునమ్మా! నాకు బి.పి, వుంది. మందులు వాడుతున్నాను. మండుటెండ కదా, మైకం కమ్మి కళ్ళు తిరిగి పడ్డాను. ఆ జనమే నీళ్ళు తాపించి, స్థిమిత పడ్డాక పంపించారు. మరి నాకు ఈ పళ్ళమ్ముకోవటం తప్పదు కదమ్మా! ఊఁ.. దిక్కులేని వాళ్ళకి దేవుడే దిక్కు!" అంది.

"అంటే... నీకెవరు లేరా?" అడిగాను.

"వున్నారు, కూతురు. మనవరాలు. నా కూతురుకి గుండె జబ్బు. మనవరాలు చిన్నపిల్ల. రెండో క్లాసు చదువుకుంటుంది. నా కూతురికి ఆరోగ్యం బాగుంటే, కూలి పనికి వెళుతోంది. లేకపోతే, ఇంట్లోనే వుంటుంది. తనకొచ్చే డబ్బులు చాలవు కదమ్మా!"

"మరి అల్లుడు.."

"వాడు తాగుడికి బానిసై, మూడేళ్ళ క్రితమే చచ్చాడు. దుర్మార్గుడు! మేము పస్తులు ఉండకూడదని, నేను ఈ పళ్ళమ్ముకుంటున్నాను!"

అంతే.. ముసలావిడ మాటలకు.. నేను అదోలా అయిపోయాను. ఓ రకంగా చెప్పాలంటే, ఆమె దీన స్థితికి నా కళ్ళు చెమర్చాయి. అది ఆవిడకు తెలియకూడదన్న వుద్దేశ్యంతో "ఇప్పుడే వస్తాను" అంటూ, లోనికెళ్లట పళ్ళను ఫ్రిడ్జిలో పెట్టి,

పమిటతో కళ్ళను ఒత్తుకొని బయటికి వచ్చి చూశాను. అప్పటికే ఆమె నిద్రలోకి జారుకుంది. నేనూ ఇంట్లోకి వెళ్ళి తలుపు గడియ పెట్టి, సోఫాలో పడుకున్నాను. నాకు నిద్ర రాలేదు. మనసంతా ముసలావిడ చుట్టే తిరుగుతోంది. లేచి కిటికీలో నుంచి చూశాను.. అలిసిపోయిన ప్రాణం కదా హాయిగా నిద్ర పోతోంది.

గంట మందుతుండగా ముసలావిడ లేచింది. అన్నీ సర్దుకొని "అమ్మగారూ!" అని ఇంట్లోకి కేకేసింది.

తలుపు తీసి "ఏమిటీ.. ఏమైనా కావాలా?" ప్రేమగానే అడిగాను.

"ఏమీ వద్దమ్మా! అమ్మగారూ.. ఇవాళ మీలో, ఏదో తేడా కనబడుతోందమ్మా. అయితే అదేమిటో అన్నది.. నాకు చెప్పటం తెలియలేదమ్మా! ఇంతకు మేడమీది అమ్మగారు ఎప్పుడు వస్తారమ్మా?"

" నెల రోజుల్లో వస్తారని చెప్పానుగా!"

"చెప్పావు. అంటే.. నాకు దాదాపు మూడు వేల రూపాయల బేరం పోయిందన్న మాట!" అంది.

"ఏం పర్వాలేదు. నువ్వు రోజూ వస్తున్నట్టే రా! నీ వద్ద పళ్ళను నేను కొంటాను" అన్నాను.

"రోజూ కొంటారా!"

"కొంటాను. ఆఁ.. నిన్నో మాటడగాలి!"

"ఏమిటమ్మా!"

"కాదూ.. నీకు వయస్సు అరవైకి పైనే వుంటాయి. బంధుగణం కూడా బాగానే ఉంటారనుకుంటున్నాను. నువ్వేమో కూతురు, మనవరాలే వున్నారని చెప్పావు. పోనీ.. ఈ వయస్సులో ఇలా పళ్ళమ్ముకుంటూ తిరగడమెందుకూ? ఇంట్లోనే వుండొచ్చుగా! నువ్వు తినే నాలుగు మెతుకులు, నీకు నీ కూతురు పెట్టలేదా?"

"చెప్పాను కదమ్మా నా కూతురు రోగిష్టిని! దాని సంపాదన మాకు చాలదు. వస్తానమ్మా! మళ్ళీ మేడ మీద అమ్మగారు వచ్చిన తరువాత పళ్ళ బుట్టతో కనబడతాను!" అంది.

"అదేమిటీ.. పళ్ళను నేను కొంటానుగా! కనీసం వీలున్నప్పుడైనా ఇటు రా!"

"అలాగేనమ్మా!" అని బుట్టను తల మీద పెట్టించుకొని వెళ్ళిపోయింది.

ఇరవై అయిదు రోజులు గడిచాయి. ఏ ఒక్క రోజూ ముసలావిడ పళ్ళమ్ముకుంటూ రాలేదు. బహుశా తనకు మేడమీది మా టెనంట్ అంటేనే ఇష్టమేమో! ఆమె కూడా ఊరి నుంచి రాత్రే వచ్చింది. ఒకవేళ ముసలావిడ రేపు వస్తుందేమో అనుకున్నాను.

మరుసటి రోజు, మా వారు ఆఫీసుకు, పిల్లలు బడికి వెళుతూనే పనులు ముగించుకొని, సోఫాలో కూర్చొని టి.వి చూస్తూ వున్నాను.

అప్పుడు నేననుకున్నట్టే, పళ్ళమ్ముకుంటూ వస్తున్న ముసలావిడ గొంతు నాకు వినబడింది. బయటికి వచ్చి చూశాను. వీధి చివర ఆమె కనబడింది. వెంటనే పైనింటి ఆవిడకు పళ్ళమ్ముకునే ముసలావిడ వస్తున్నట్టు చెప్పాను. మళ్ళీ రోడ్డమ్మట వస్తున్న ముసలావిడ వేపు చూశాను. తనతో పాటు ఓ పాప కూడా వస్తోంది. చూసి ఆశ్చర్యపోయాను. బహుశా ఆ పాప

తన మనవరాలై వుంటుందనుకున్నాను. తను కూడా చంకకు సంచిని తగిలించుకొని "పళ్ళమ్మా పళ్ళూ" అంటూ వస్తోంది. 'తను రెండో క్లాసు చదువుకుంటున్న పిల్ల! మరి ఇవాళ బడికి వెళ్ళలేదా? కొంపతీసి ఆ పాపను బడి మాన్పించిందా? పాపం.. పుస్తకాల సంచితో బడికి వెళ్ళాల్సిన పిల్ల.. పళ్ళమ్ముతూ రావటమేమిటీ?' నా మనసు ఆలోచింప సాగింది. 'రానీ, విషయం అడిగి తెలుసుకుంటాను' అని అనుకుంటుండగా, పైనింటావిడ క్రిందకు దిగింది.

ముసలావిడ గేటు తీసుకొని పాపతో పాటు లోనికొచ్చింది. నేనే పళ్ళబుట్టను దించి, పాపను చూస్తూ వున్నాను.

'ఇన్నాళ్ళు ఎందుకు రాలేదూ' అని అడగాలనుకుంటున్న సమయంలో, ముసలావిడ కూర్చొంటూ "వూరి నుంచి వచ్చావమ్మా! నేనూ ఇవాల్టి నుంచే పళ్ళబుట్టను నెత్తిన పెట్టుకున్నాను!" అని అంది.

నాకు సందేహం నివృత్తి అయ్యింది.

"తను రాత్రే వచ్చిందిలే! క్రిందకు రమ్మని పిలిచాను. అవునూ.. ఈ పాప నీ మనవరాలేగా! బడికెళ్ళలేదా?" అడిగాను.

"లేదమ్మా! ఇవాలే కాదు, ఇంకెప్పటికీ బడికెళ్ళదు!"అని కన్నీళ్ళు పెట్టుకుంది .

"ఏం?" అడిగింది పై ఇంటావిడ.

"చదువు మాన్పించి, నాకు తోడు తెచ్చుకున్నానమ్మా!" అంది ముసలావిడ.

"అదే ఎందుకూ అని!" నేను అడిగాను.

"మా అమ్మ చనిపోయిందమ్మా..." ఏడుపు ముఖంతో చెప్పింది పాప.

మేము షాక్ తిన్నాం! ముసలావిడ బోరున ఏడ్చింది.

"అమ్మా! ఏడవకు. కన్నీళ్ళు తుడుచుకో! మీ అమ్మాయి ఎలా చనిపోయిందమ్మా?" అని అడుగుతుండగా, మనవరాలు తన చిన్ని చేతులతో.. ఏడుస్తున్న అమ్మమ్మ కన్నీటిని తుడిచింది.

ఆ సన్నివేశం నన్ను కదిలించింది.

"నీ కూతురికి గుండెజబ్బు వుందని తెలుసు. ఆమె పోవటానికి అదే కారణమా?" అడిగింది పై ఇంటావిడ.

"అవునమ్మా! పది రోజుల క్రితం గుండెనొప్పి ఎక్కువ కావటంతో, పక్కింటి ఆటో అబ్బాయి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళాను. వాళ్ళు నా బిడ్డను కాపాడ్డానికి శతవిధాలా పోరాడారు. లాభం లేకపోయింది. మరుసటి రోజు తెల్లవారు ఝామున కళ్ళు మూసింది. వారం క్రితమే ఆమెకు జరపవలసిన కార్యం జరిపి, ఈ రోజు నుంచి మళ్ళీ వ్యాపారంలోకి దిగాను. మనవరాలి చదువు మాన్పించి, పళ్ళమ్మటం నేర్చుకుంటుందని నాతో తీసుకువచ్చాను!"

"అయ్యో పాపం! పోనీ.. నీ కూతురికి రోజులు దగ్గర పడి, ఆమె పోయిందనుకో! చదువు మాన్పించటానికి ఈ పాప ఏం పాపం చేసిందమ్మా!" అన్నాను.

"తనేం చెయ్యలేదు! మాఇద్దరికీ పొట్ట గడవాలిగా.. అందుకే మాన్పించి, పళ్ళ వ్యాపారం నేర్పుతున్నాను. ఎందుకంటే.. రేపు నాకేమైనా అయితే.." అంది కళ్ళు తుడుచుకుంటూ!

ముసలావిడ అన్న ఆ మాట.. నన్ను ఆలోచింపజేసింది. నిజమే.. ఆమె అన్నట్టు తనకేమైనా అయితే, ఈ పాపకు దిక్కెవరు?" ఆలోచనల్లో పడ్డాను.

అంతలో.. పై ఇంటావిడ ఓ ప్లేటులో కొబ్బరి చట్నీతో, నాలుగు ఇడ్లీలు, తెచ్చి పాప చేతికిచ్చింది. ఆవురావురుమంటూ తింటుంది పాప.

"ఇదమ్మా మా బ్రతుకు! అందుకే తను ఒక్కర్తే అయినా బ్రతగ్గలదన్న ధైర్యం, నమ్మకం తనకు రావాలని, ఈ వ్యాపారాన్ని నేర్పుతున్నాను!" అంది ముసలావిడ.

రెండు నిముషాలు ఆలోచించాను. ఓ నిర్ణయం తీసుకున్నాను.

ధృఢంగా "సరే.. నీకూ, నీ పాప భవిష్యత్తుకూ, బ్రతకటానికీ భరోసా కల్పిస్తే, పిల్లను బడికి పంపుతావా!" అడిగాను.

ముసలావిడ ఆలోచిస్తోంది.

"ఏమిటాలోచిస్తున్నావ్? మేడంగారు ఏది చెప్పినా, అది మీ మంచికే! ఊఁ అను!" అంది మా పైనింటావిడ.

"చెప్పండమ్మా.. నేనేం చెయ్యాలి!.

"రేపటి నుంచి ఈ పళ్ళు అమ్మటం మానుకో! పాపను బడికి పంపించు. మీ ఇద్దరికీ భోజనంతో పాటు, ఏం కావాలో నేను చూసుకుంటాను. మేడమీద ఖాళీగా వున్న గదిలో, మీరిద్దరూ వుండండి. ఇక నువ్వు ఇల్లు, వాకిలి వూడ్చి, తుడవటంతో పాటు నేను చేసుకునే పనులకు సహాయంగా వుంటే చాలు!" అన్నాను.. భరోసా కల్పిస్తూ!

"మేడం.. అలాగే నా వంతు సహాయంగా, ప్రతి సంవత్సరం పాపకు ఫీజు గట్రా నేను చూసుకుంటాను" అని ముందుకొచ్చింది మా మేడ మీదావిడ.

ముసలావిడ ఇడ్లీ తింటున్న మనవరాలిని చూసింది. ఎన్ని తిప్పలు పడ్డా.. ఈ పొట్ట కూటి కోసమే కదా! ఆ పొట్ట నిండితే చాలని అనుకుందేమో.. ఆమె సంతోషంతో "ఇంతకన్నా నాకు, నా మనవరాలికి ఇంకేం కావాలమ్మా, మీ ఇష్టం" అని, మేడ మీద ఆవిడ చేతులను తన చేతుల్లోకి తీసుకొని కళ్ళకద్దుకుంది ముసలావిడ .

# చట్టంలో లేని తీర్పు

అనంతపట్నాయుకుని కిశోర్
✆ 9490262162

*సర్టిఫికెట్లు రద్దు చేసే అధికారం ఈ న్యాయస్థానానికుంటే, ఆ అధికారాన్ని వినియోగించి వాటిని రద్దు పరిస్తే, ఈరోజు సమాజంలో ప్రతివాది స్థానం ఏమిటి? ఏ సామాజిక స్థాయి కారణంగా అతడు తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను కాదన్నాడో, అదే సామాజిక స్థాయి అతడిని అమాంతం అగాధంలోకి నెట్టేయదూ! సమాజంలో స్థాయి కంటే సమాజం, కుటుంబ విలువలు ముఖ్యం కాదా?*

"పొలిమేరు రామయ్యా, పొలిమేరు సీతమ్మా" పేర్లలోని చివరి అక్షరాల్ని సాగదీస్తూ బిగ్గరగా పిలిచాడు కోర్టు బంట్రోతు.

"ఆ.. వస్తున్నాం బాబూ" అంటూ కోర్టు వరండాలో నుండి వడివడిగా లోనికి వెళ్ళి బోనులో నిలబడ్డారు. పూర్తి గ్రామీణ వాతావరణంలో నుండి వచ్చిన సదరు రామయ్య, సీతమ్మ.. వారి ఆహార్యం.. వారనుభవిస్తున్న బీదరికాన్ని దాచాలన్నా దాగనీయడం లేదు.

"కేసు వివరాలేంటి?" ఆరా తీసారు జడ్జిగారు.

"కొడుకు తమని ఈ వయసులో సరిగా చూడడం లేదని ఈ తల్లిదండ్రులిద్దరూ దావా వేశారు సార్!" సూక్ష్మంగా వివరించాడు బెంచి గుమస్తా.

"కాదు యువరానర్! సదరు కొడుకు.. 'అసలు మీరు నా తల్లిదండ్రులే కారు. మీతో నాకు ఎలాంటి సంబంధం లేదని' నిర్దయగా నా క్లయింట్స్‌ని ఇంటి నుంచి వెళ్లగొట్టిన దరిమిలా, ఆ కొడుకు సర్టిఫికేట్లు కేన్సిల్ చేయించవలసిందిగా ఈ దావా వేయడమైంది!" సవరించారు ప్రాసిక్యూషన్ లాయర్ కృష్ణమూర్తిగారు.

"ఏంటేంటీ? మళ్లీ చెప్పండి" జడ్జిగారు అప్రమత్తమౌతూ, కాస్త ముందుకు వంగి రెండు మోచేతులూ టేబుల్ పైకి చేర్చి కుతూహలంగా అడిగారు.

గొంతు సవరించుకొని వివరంగా చెప్పడం మొదలుపెట్టారు లాయర్ కృష్ణమూర్తిగారు. "యువరానర్! నా క్లయింట్లు దగ్గరలోని రామాపురం గ్రామానికి చెందినవారు. కటిక బీదరికంలో ఉండి కూడా తమ కొడుకైన ప్రతివాదికి, ఖరీదైన కాలేజీల్లో ఉన్నతవిద్య చదివించి పెద్దవాడిని చేశారు. ఆ కొడుకు పెద్దవాడై తమను ఉద్ధరిస్తాడని భావించి, తమకున్న కాస్త పొలాన్ని అమ్ముకుని మరీ, అతడి జీవితాన్ని తీర్చిదిద్దారు. తీరా ఆ కొడుకు.. ఈ రోజు ఉన్నత పదవులు చేరుకునేసరికి తల్లిదండ్రులు భారమని భావించి, వారిని చాలా విధాలుగా మానసికంగా వేధించాడు. తల్లిదండ్రులు ఆ అవమానాలు

భరించలేక గట్టిగా నిలదీసేసరికి 'అసలు మీరు నాకు తల్లిదండ్రులే కాదు' అని నిర్దయగా, వారిని ఇంటి నుండి వెళ్లగొట్టాడు. నిజానికి, అతడు ఈ రోజు సమాజంలో అనుభవిస్తున్న గౌరవం, ఐశ్వర్యం అంతా ఆ తల్లిదండ్రులు జీవితకాలం పడ్డ శ్రమ! ఇంతకాలం ఆ కొడుకు ఎంత నిర్దయగా ప్రవర్తించినా సహిస్తూ వచ్చిన ఆ తల్లిదండ్రులు, చివరికి విసిగిపోయి ఈ దావా వేశారు. దావా వివరం ఏమిటంటే... తమను తల్లిదండ్రులు కారని అన్న ఆ కొడుకు, తాను సాధించిన సర్టిఫికేట్లలో ఎక్కడా తల్లిదండ్రులుగా తమ పేర్లను వాడకూడదని, తమ పేర్లు కూడిన సర్టిఫికెట్లు అన్నీ రద్దు చేయాలని కోరుతున్నారు!"

"చిత్రంగా ఉంది. సర్టిఫికెట్లు రద్దు చేయడమేమిటి? అదెలా కుదురుతుంది? ఏ యాక్టు ప్రకారం కేసు పెట్టారు? సెక్షన్లేమిటి?" కాస్త నిరాసక్తంగా అన్నారు జడ్జి గారు.

"యువరానర్, కేసుకు అసలు మూలమే లేదు. ప్రాసిక్యూషన్ వారి వాదన కోర్టు పరిధిలోనికి రాదు. కేసు కొట్టేయవలసిందిగా కోరుతున్నాను!" అన్నారు డిఫెన్స్ లాయర్ కేశవరావుగారు.



"మాట పట్టింపుల కోసం కోర్టెక్కుతారా? ఇక్కడంత ఖాళీగా ఉన్నామా? వాళ్లని మాట్లాడుకుని తేల్చుకోమనండి. విలువైన కోర్టు సమయాన్ని వృథా చేస్తే ఎలా?" కాస్త విసుగ్గానే అన్నారు జడ్జిగారు.

"యువరానర్, మారుతున్న సామాజిక విలువల పట్ల ఓ సవాలు ఈ కేసు! యాక్టులూ సెక్షన్లూ అన్నీ మా పిటిషన్‌లో వివరించబడ్డాయి. వాటిపై మరీ ఎక్కువ దృష్టి పెట్టకుండా, ఇక్కడ పేర్కొన్న వాస్తవాలూ, దిగజారుతున్న విలువల ఆధారంగా కేసును పరిశీలించవలసినదిగా కోర్టువారిని కోరుకుంటున్నాను!" అన్నారు కృష్ణ మూర్తి గారు.

ఆయన చాలా సీనియర్ న్యాయవాది! ఆయన వాదించే ప్రతి కేసులోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆయనకు ఎదురు వాదించే లాయర్లకు ఇంచుమించు గెలవడం కష్టమే. అంత సీనియర్ న్యాయవాది చేపట్టిన కేసును ఆషామాషీగా తీసుకునే ధైర్యం చేయలేరెవరూ!

జడ్జిగారు కాస్త అసహనంగానే కేసు వాదోపవాదాలకు అనుమతించారు.

"ఇంతకూ ఏయే సర్టిఫికెట్లు రద్దు పరచాలంటారు?" ప్రశ్నించారు జడ్జిగారు.

"రద్దు చేయవలసిందిగా కోరబడిన సర్టిఫికెట్ల వివరాలు పిటిషన్ చివరిలో ఇచ్చాం యువరానర్! అందులో మొదటిది అతడి పదవ తరగతి సర్టిఫికెట్!"

"అది రద్దు చేస్తే ఏమౌతుంది?"

"అక్షరాస్యుడై ఏదైనా ఉద్యోగం చేసుకోవాలన్నా, ప్రభుత్వం నుండి ఏదైనా సహాయం పొందాలన్నా, ఎలాంటి జీవనోపాధినైనా పొందాలన్నా ఆ వ్యక్తి యొక్క గుర్తింపు ఆధారం అవసరం యువరానర్. ముఖ్యంగా చదువుకున్నవారికి పదవ తరగతి సర్టిఫికెట్ ప్రాథమిక గుర్తింపు కలిగిస్తుంది. అందులో అతడి జన్మ తేదీ పొందుపరచబడుతుంది. అది రద్దైతే అతడి ప్రాథమిక గుర్తింపు, జన్మించిన తేదీ వివరాలు నిరాధారమౌతాయి. ఫలితంగా అతడి ఉద్యోగానికి ముప్పు ఏర్పడుతుంది! ఇక్కడ జన్మ తేదీ విషయంలో వివాదం లేదు యువరానర్" వాదించారు డిఫెన్స్ లాయర్ కేశవరావు.

"ఉంది యువరానర్. అందులో విద్యార్థి ఈ కేసులో ప్రతివాది! విద్యార్థి పేరుతో పాటు అతని తండ్రిగా నా క్లయింట్ రామయ్య పేరు పేర్కొనబడింది. నా క్లయింట్లు.. తన తల్లిదండ్రులు కారని ప్రతివాది లోగడ నా క్లయింట్లను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. వారు అతని తల్లిదండ్రులు కానప్పుడు, ఆ సర్టిఫికెట్లో ఆయన తండ్రిగా ఈ రామయ్య పేరు తొలగించాలి. అలాగే నా క్లయింట్లు స్కూలుకు ఇచ్చిన ప్రతివాది జన్మ తేదీ వాఙ్మూలం ఉపసంహరించుకుంటారు!"

"అదెలా కుదురుతుంది? మీలాంటి సీనియర్ లాయరు ఇలా వితండవాదానికి దిగడం తగదు సార్" డిఫెన్స్ లాయర్ సర్ది చెప్పబోయారు.

"వితండవాదం కాదు. కేసు విచారణలో చాలా వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. విశాల దృక్పథంతో విచారణకు అనుమతినీయవలసిందిగా కోర్టు వారిని కోరుతున్నాను." అని జడ్జిగారితో అన్నారు కృష్ణమూర్తిగారు.

"స్థూలంగా చూస్తే.. ఇది ఓ కుటుంబానికి చెందిన అంతర్గత సమస్య అయినప్పటికీ, ప్రాసిక్యూషన్ వారి దృష్టిలో ఇది ప్రస్తుత సామాజిక విలువలకు చెందిన అంశం కాబట్టి, దీన్ని ఒక ప్రత్యేక కేసుగా విచారణకు స్వీకరిస్తున్నాం. కానీ ఒక షరతు. కోర్టు సమయాన్ని వృథా చేయకుండా త్వరగా విచారణ జరపడానికి ఇరు వర్గాలు సహకరించాలి. ఇక ఆలస్యం చేయకుండా వెంటనే మొదలు పెట్టండి. ఈ రోజే దీని మీద ఓ ప్రాథమిక అవగాహనకు వద్దాం!" అంటూ జడ్జిగారు అనుమతిని ఇచ్చారు.

ప్రాథమిక విధివిధానాలు పూర్తి చేశాక, కృష్ణమూర్తిగారు ముందుగా బోనులోనున్న రామయ్యా సీతమ్మలను ప్రశ్నించారు "మీ సమస్య ఏమిటో కోర్టు వారికి వివరించండి"

"మీకు సెప్పిందే బాబూ, అంతకంటే ఇంకేటీ నేదు" అన్నాడు రామయ్య అమాయకంగా.

“నాకు చెప్పడం కాదు రామయ్యా. కోర్టు వారికి నీ స్వంత మాటల్లో చెప్పు. ఇందులో భయపడవలసినదేమీ లేదు.” అన్నారు కృష్ణమూర్తిగారు.

భర్త మాటాడక పోవడంతో, సీతమ్మ.. “మా కొడుకు.. మమ్ముల్ని శానా యాతన పెట్టేస్తున్నాడు బాబూ. అయ్యని కూడా సూడకండా మాయాయిన్ని నానా మాటలూ తిడతన్నాడు బాబూ. అదేట్రయ్యా తప్పు గదా అంటే.. అసలు మీరు నా అమ్మ అబ్బలు కారని మమ్ముల్ని బైటికి గెంటీసేడు బాబూ. మీరే నాయం సెప్పండి బాబూ. మాకేటి దిక్కు?” అంది కళ్ళల్లో నీళ్లనీ మాటలో దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

ఆమె ఇంకా చెప్పేలోగా జడ్జిగారు అడిగారు.. “సరే మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకోమని మీ అబ్బాయికి చెప్పనా? అతనేమంటున్నాడు?” అంటూ డిఫెన్స్ లాయర్ వంక చూశారు.

“నేను వాళ్లకి సర్ది చెప్పే ప్రయత్నం చేస్తాను యువరానర్. ఆ విషయం వాళ్లకు ముందే చెప్పాను. తమరు అనుమతిస్తే, కోర్టు బయట ఒప్పందం చేయిస్తాను.” అంటూ ఔట్ ఆఫ్ ది కోర్ట్ సెటిల్మెంట్ చేయించడానికి తన సంసిద్ధతను తెలియజేశాడు.

“మీరేమంటారు?” అన్నట్టుగా ప్రశ్నార్థకంగా కృష్ణమూర్తిగారి వంక చూశారు జడ్జిగారు.

తిరిగి అతనే.. బోనులోనున్న సీతమ్మను ఉద్దేశిస్తూ ప్రశ్నించారు “ఏమ్మా? ఏమంటారు?”

“మాకొద్దు బాబూ! ఈ తగువు ఇయ్యాల్టిది కాదు బాబూ. నాలుగేళ్ల కాడ నుండి నడుస్తుంది బాబూ. ఆడు సూత్తానన్నా మాకొద్దు బాబూ. మీ ముందు అలాగే అంటాడు. ఇంటికెల్లాక మల్లీ నానా తిట్లూ తిడతాడు బాబూ. మాకూ యిసుగొచ్చీసింది. ఎన్ని పెయత్నాలు సేసినాం బాబూ! ఆ నిమసానికి మారిపోయానంటాడు. పొద్దుగూకితే మల్లీ మామూలే! మాకూ పేనం సాలొస్తంది బాబూ. ఆడితో తెగదెంపులు సేసుకుందావని మేవనుకున్నాం బాబూ. మమ్ముల్నొగ్గిస్తే మావూరెలిపోయి కూలి పనులు సేసుకుంటే గడిసిపోద్ది. గానీ ఆ నాకొడుక్కి బుద్ధి రావాల బాబూ. ఆడికే గాదు, ఆడిలాగ తల్లిదండ్రుల్ని ఉసురు బెట్టిన కొడుకులందరికీ బుద్ధి రావాల! అందుకే ఈ కోర్టు గుమ్మం యెక్కినాం. ఆడి సట్టిపికెట్లు రద్దు సేసీయండి. మేవొద్దనుకున్నోడికి, ఆడి కాయితాల్లో మా పేర్లుండడానికి యీల్లేదు బాబూ. మీరే నాయం సెప్పండి!” ఆక్రోశం, అక్కసు నిండిన స్వరంతో ఆవేశంగా చెప్పింది సీతమ్మ.

ఆమె మాట్లాడింది గ్రామీణ మాండలికమే అయినా ఆమె మాటలోని పొంతనకు ఆశ్చర్యం కలిగింది జడ్జిగారికి.

“అంత ఆవేశంగా మాట్లాడుతున్నావు, నువ్వు చదువుకున్నావా?” అడిగారామెని.

“ఎనివిదో క్లాసు సదివేను సార్. కంపినీలో ఉద్జోగం సేసీను. ముదనష్టపోడి మాటలిని.. అదీ మానీసేను. ఇప్పుడు అదున్నా, మాకు ఇబ్బంది లేకపోను!” అందామె.

‘ఎనిమిదో క్లాసు చదివాను’ అన్నప్పుడు ఆమె కళ్లలో ఆనందాన్ని, ఒకింత గర్వాన్ని.. ‘ఉద్యోగం మానేశాను’ అన్నప్పుడు ఆమె స్వరంలో దుఃఖాన్ని జడ్జిగారు గమనించారు.

“మాకో ఎకరం పొలం ఉండేది బాబు! మా అబ్బాయిగాడు ఐదు పేసై, ఆరో క్లాసుకొచ్చినప్పుడు.. మా వూల్లో హైస్కూలు నేదు బాబూ! అప్పుడాడిని ఈ వూల్లో హైస్కూల్లో జాయిన్ సేసాం. గవర్మంటు ఆస్టల్లో యెడితే బెంగెట్టీసుకుంటాడని, నేనూ ఎలిపొచ్చినాను. ఆడయ్య.. యవసాయం కోసం మావూల్లోనే ఉండిపోయినాడు. యవసాయం మీదొచ్చే డబ్బులు సరిపోక,

నేను ఇల్లుల్లో పనిసేసీదాన్ని. నాయవసరాలు సూసి, ఒకమ్మగోరు యెనిమిదో క్లాసు పేసైతే ఆల్ల కంపినీలో ఉజ్జోగం ఏయిస్తావంటే, అప్పుడు కట్టపడి ఆయమ్మ దగ్గిరే సదువు నేర్చుకోని పేసయ్యాను. పేసయ్యాక ఆల్ల కంపినీలో ఉజ్జోగం ఏయించారు. అలాగ సదువుకున్నాను బాబూ! సంతకం కూడా సేత్తాను. మాయాయన నిసానీయే గానీ నాకు సంతకం పెట్టడం వచ్చు!" తన కార్యసాధన గుణాన్ని ఎత్తి చూపుతూ, తానెంత కర్తవ్యోన్ముఖురాలో గర్వంగా చెప్పిందామె.

అది విన్న జడ్జి గారికి ముచ్చట కలిగింది.

అక్కడి నుండి కృష్ణమూర్తిగారు వివరించారు "ఆ విధంగా ఆమె చాలా కష్టపడి కొడుకును పెంచింది యువరానర్. కొడుకు ఇంకా పైచదువులకు వచ్చేసరికి, తమ సంపాదన సరిపోక, ఉన్న కాస్త పొలాన్ని మొదట తాకట్టు పెట్టి, తరువాత ఆ అప్పులు తీర్చలేక, ఆ పొలాన్ని కూడా అమ్మేసి, రామయ్య కూడా ఈ ఊరు చేరుకున్నాడు. ఇక్కడికి చేరుకున్నాక అతడు కూలి పనులు చేసుకునేవాడు. ఆ కొడుకు ఎం టెక్ చదువుకుని మంచి ఉద్యోగంలో చేరి, పెద్ద హోదాకు చేరుకున్నాడు. ఆర్థికంగా బాగా బలపడ్డాడు. పెద్దలతో పరిచయాలు పెరిగాయి. మంచి బంగళా, కారు సమకూరాయి. ఇంట్లో నౌకర్లు కుదిరారు. అనూహ్యంగా పెరిగిన ఆర్థిక, సామాజిక స్థితిగతుల మధ్య తన తల్లిదండ్రుల గత జీవితం అతడికి ఏవగింపుగా మారింది. వారి భాష, ఆహార్యం, పొదుపరితనం, వారి అలవాట్లు.. తన స్థాయికి తగినవి కావని, వారి పట్ల ఏహ్య భావం ఏర్పడింది. దరిమిలా అతడు తన తల్లిదండ్రులను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. వారిని రకరకాలుగా చీదరించుకున్నాడు, మానసికంగా కృంగదీశాడు. పలు అవమానాలకు గురి చేశాడు. కన్న కడుపు తీపితో ఇంతకాలం అన్నింటినీ భరించిన ఆ తల్లిదండ్రులు, ఇక అతడు మారే అవకాశం కనిపించక నిస్సహాయంగా ఈ రోజు ఈ నిర్ణయం తీసుకున్నారు."

కాస్త విరామం తీసుకుని మళ్ళీ కొనసాగించారు "యువరానర్. చట్టం ప్రకారం వృద్ధాప్యంలో తమను శారీరకంగానూ, మానసికంగానూ సరిగా చూసుకోమని అడిగే హక్కు.. ఈ తల్లిదండ్రులకు 'మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజెన్స్ ఏక్ట్ 2007' కల్పిస్తుంది. 1973 నాటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కూడా కొన్ని సెక్షన్ల ప్రకారం కల్పిస్తుంది. కానీ ఆ చట్టాలు ఈ విషయంలో నామమాత్రంగానే ఉంటాయి యువరానర్. ఇంట్లో నాలుగ్గోడల మధ్య జరిగే మానసిక హింసను, ఏ చట్టాలూ ఆపలేవు యువరానర్. ఇందాక ఆ పిల్లాడిని పెంచడానికి ఆ తల్లిదండ్రులు పడ్డ కష్టాలు విన్నారు కదా యువరానర్. అలా బిడ్డల పట్ల బాధ్యత కలిగి ఉండాలనీ, వారిని ఆదరంగా చూసుకోవాలనీ.. వారి కోసం, వారి భవిష్యత్తు కోసం విలువైన తమ ప్రస్తుత జీవితాన్ని త్యాగం చెయ్యమని ఏ చట్టం చెప్పింది? ఒక మనిషి జీవించి ఉండడానికి కావలసిన కూడూ, గూడూ, గుడ్డా ఇవ్వాల్సిందే అని శాసించగలవే కానీ, చట్టాలు ఆదరాభిమానాలకు ఎలాంటి డిక్రీలూ ఇవ్వలేవు యువరానర్! అందుకే ఈరోజు నా క్లయింట్లు ఈ సమాజం కళ్ళు తెరిపించడానికి మరో త్యాగానికి సిద్ధపడ్డారు. న్యాయం జరిపించమని ఈ కోర్టును ఆశ్రయించారు. నేను మొదట్లో తెలిపినట్టు, చట్టాల పరంగా కాకుండా ఒక సామాజిక దృక్పథంతో ఈ కేసును చూడాలి. భవిష్యత్తు తరాల బిడ్డలు ఎప్పటికీ గుర్తెరిగి ప్రవర్తించుకునేలా ఈ కేసు ఓ క్రొత్త దృక్పథాన్ని కలిగించడానికి నాంది కావాలి!"

జడ్జిగారు డిఫెన్స్ లాయర్ కేశవరావు గారిని, "మీరేమైనా చెప్తారా?" అని అడిగారు.

"యువరానర్! ఈ కేసు ఆదిలోనే విచారణకు స్వీకరించ తగనిది. పదవ తరగతిలో నా క్లయింట్ కష్టపడి చదివి, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. వచ్చిన మార్కులన్నీ కేవలం అతడి వ్యక్తిగత ప్రతిభా పాటవాలను సూచిస్తున్నాయి. ఆ మార్కుల

విషయంలో తల్లిదండ్రుల పాత్ర లేశమంతైనా లేదు. ఇకపోతే జనన ధ్రువీకరణ విషయానికొస్తే.. ఆయన జన్మించిన నాటికి మన దేశంలో జన్మ ధృవీకరణ పత్రం ఇచ్చే విధానం పెద్దగా అమలులోకి రాలేదు. తల్లిదండ్రులు ఇచ్చిన వాఙ్మూలాల ఆధారంగానే ఎక్కువ శాతం జన్మ ధృవీకరణ జరిగేది. వాదులిద్దరూ అతడి తల్లిదండ్రులే అన్నది నిర్వివాదాంశం. ఏదో ఆవేశంలో, నా క్లయింట్ నోరు జారిన విషయం వాస్తవమే కానీ, అతడి ఉద్దేశం అది కాదు. అతడు సంఘంలో ఒక ఉన్నత స్థానానికి తన స్వశక్తితో ఎదిగాడు. వాదులు అతడి ఎదుగుదలను చూసి ఓర్వలేక, అతడి కోసం వచ్చే విజిటర్స్ దగ్గరా, అతడి ఇంట్లో పనిచేసే నౌకర్ల దగ్గరా చాలా చులకనగా ప్రవర్తిస్తూ వచ్చిన దరిమిలా, నా క్లయింట్ ఏదో క్షణికావేశంలో అలా అన్నాడు. వారికి కావాలంటే ఏదైనా ఆర్థికంగా సహాయం చేయడానికి, లేదంటే ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్చడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ ఈ చర్చ అంతా అనవసరం!"

అందుకు జవాబుగా కృష్ణమూర్తిగారు అన్నారు "యువరానర్. టెన్త్ క్లాస్ మార్కుల విషయంలో తగాదా లేదు. డిఫెన్స్ వారన్నట్టు.. అవి పూర్తిగా ప్రతివాది ప్రతిభా పాటవాలను ప్రతిబింబిస్తున్నాయి. కాకపోతే ఇక్కడ తల్లిదండ్రుల పాత్ర ఉందా లేదా అన్నది పరిశీలించవలసి ఉంది. అతడి బాగోగులు చూడడం, ప్రాథమిక అవసరాలు తీర్చడం తల్లిదండ్రుల బాధ్యత అన్నది నిర్వివాదాంశం. అయితే ఈ తల్లిదండ్రులు అంతకు మించి, తమ తాహతుకు మించి ఖర్చులు చేసి ప్రతివాదిని చదివించారు. విద్యాబుద్ధులు నేర్పించడం ప్రాథమికావసరం కాదు. అతడు ఈరోజు సాధించిన ఉన్నత స్థాయి.. కేవలం ఈ తల్లిదండ్రులు నేర్పించిన విద్య కారణంగానే సాధ్యమైంది. ఎవరినైతే అతడు తన 'తల్లిదండ్రులే' కారని విచక్షణారహితంగా అన్నాడో వారి పేర్లు తల్లిదండ్రులుగా పేర్కొనబడిన సర్టిఫికెట్లు రద్దుపరచమని కోరుకుంటున్నారు. ఇంత జీవితంలో ఒక్కసారి కూడా ఈ తల్లిదండ్రులు, అతడిని 'తమ బిడ్డ కాదని' క్షణికావేశంలోనే కాదు, ఎలాంటి గడ్డు కాలంలోనూ అనలేదు. అంతటి ప్రేమను కాదనుకున్నవాడు.. అసలు పుత్రుడుగా ఉండడానికి అర్హుడేనా అన్నది ఆలోచించమని కోర్టు వారిని కోరుతున్నాను!"

వాదోపవాదాలన్నీ విన్న జడ్జిగారు కొంతసేపు విరామం ప్రకటించి తన ఛాంబర్ లోకి వెళ్ళిపోయారు. కోర్టు హాలులో అందరూ ఈ కేసును ఉత్కంఠ భరితంగా గమనిస్తున్నారు. సీనియర్ న్యాయవాదులు ఎక్కడికక్కడ దీని విషయంలో చర్చలు ప్రారంభించారు. అసలిది ఎలా ముగియబోతుందన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది.

కొద్దిసేపటిలోనే జడ్జిగారు తిరిగివచ్చి తన తీర్పును వెలవరించడం ఆరంభించారు.

మొదట్లో శాంతంగా మొదలైన ఆయన కంఠస్వరం క్రమేపీ ఉద్వేగభరితంగా మారుతుండగా.. "చట్టం ప్రకారం ఈ వయసులో తమ కనీసావసరాలు తీర్చమని అడిగే హక్కు ఆ తల్లిదండ్రులకు ఉంది. అవి తీర్చడానికి ఆ కొడుకూ సిద్ధంగా ఉన్నాడు. కానీ ఆ తల్లిదండ్రులు దాన్ని తిరస్కరిస్తున్నారు. వారు కోరుకుంటున్న పర్యవసానం ప్రస్తుత భారతీయ న్యాయవ్యవస్థ పరిధిలో లేదు. స్థూలంగా చూస్తే ఇది ఒక మాట పట్టింపు కారణంగా ఉద్భవించిన దావా అనిపిస్తుంది. కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే, ఇది ప్రస్తుతం నెలకొని ఉన్న సామాజిక పరిస్థితులకు దర్పణం పడుతోంది. నానాటికీ దిగజారుతున్న మానవ సంబంధాలు, అతివేగంగా దిగజారిపోతున్న కుటుంబ వ్యవస్థ.. ఈ సమస్యను భవిష్యత్తులో సామాజిక జీవనం ఎంత స్వార్థపరంగా మారబోతోందన్న దానికి, ఓ ప్రత్యక్ష ప్రమాణం! ఆవేశంలో నోరు జారారన్నది___ చేసిన తప్పు నుండి తప్పించుకోవడమే ఔతుంది. జీవితకాలం.. ఏ కొడుకు అభివృద్ధి కాంక్షిస్తూ తమ జీవితాలను పణంగా పెట్టారో, ఆ కొడుకే ఈ వయసులో తమ పట్ల చూపిన నిరాదరణ, ఆ తల్లిదండ్రుల మనసులను ఎంతగా కలచివేయకపోతే, వారు ఈ వయసులో

ఇలాంటి నిర్ణయంతో ఇక్కడికి వస్తారన్నది తప్పకుండా గుర్తించాల్సిన విషయం. చట్టం పరిమితులలో వారు కోరుకున్న ఫలితం లభించదన్న విషయం, వారికి తెలియక పోయినా.. కృష్ణమూర్తిగారి లాంటి సీనియర్ న్యాయవాదికి తెలియంది కాదు. అయినప్పటికీ వారు ఇక్కడికి వచ్చారంటే... వారు ఈ సమస్యను లేవనెత్తింది న్యాయస్థానం ముందు మాత్రమే కాదు, వారు లేవనెత్తింది యావత్ సమాజం ముందు!! సమకాలీన సమాజం మొత్తం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలి. ఇప్పటి తరం.. తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను తిరస్కరిస్తూ ఉంటే, భవిష్యత్తు తరాల వారు, బహుశా అంతకంటే హీనంగా ప్రవర్తించవచ్చన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తెరగాలి! కుటుంబ వ్యవస్థలో నాణ్యత లోపిస్తోంది. ఈ గమనం నాగరికత కాదు. ఇది తిరోగమనం! ఒక పక్క ప్రపంచంలోనే అత్యుత్తమ మేధోసంపత్తి గలవారిని తయారు చేస్తున్న ఇదే విద్యా వ్యవస్థ, ధర్మం పట్ల మన నిబద్ధతను నిలబెట్టలేకపోతోంది. ఈ లోపం చిన్నదిగా కనిపించే కాలకూట విషం. ఈ క్షీణతను అరికట్టకపోతే భవిష్యత్తు తరాలు మనను క్షమించవు! సీతమ్మ వేదన వింటున్నప్పుడు.. నన్ను ఇంతవాడిని చేయడం వెనుక, నా తల్లిదండ్రులు చేసిన త్యాగం ఎంత గొప్పదో అర్థమైంది. వారి పట్ల నాకున్న గౌరవభావం అమాంతం ఎన్నోరెట్లు పెరిగింది! నిజమే, ఎన్నో దేశాల్లో జరుగుతున్నట్టే, వారు కేవలం నా కనీసావసరాలను మాత్రమే తీర్చి, వారి స్వార్జితాన్ని వారి భవిష్యత్తు కోసం దాచుకుంటే.. ఈ రోజు నేనెక్కడ ఉండే వాడిని? ఈ దేశంలో బహుశా ఏ తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కంటే తమ స్వంత భవిష్యత్తు భద్రతే ముఖ్యమని అనుకోరు. అలాంటి ఈ పుణ్యభూమిలో జన్మించడం మహా అదృష్టం! ఆ పరంపరను నిలబెట్టి భావి తరాలకు అందించడం మన అందరి బాధ్యత! నిజమే.. ఇది సామాజిక విలువలకు సంబంధించినది. ఈ సమస్యను చట్టబద్ధత కంటే, ధర్మబద్ధత దృష్టిలో చూడాలి! నిజమే, ఒకవేళ వారు కోరుకున్నట్లుగా సర్టిఫికెట్లు రద్దు చేసే అధికారం ఈ న్యాయస్థానానికుంటే, ఆ అధికారాన్ని వినియోగించి వాటిని రద్దు పరిస్తే, ఈరోజు సమాజంలో ప్రతివాది స్థానం ఏమిటి? ఏ సామాజిక స్థాయి కారణంగా అతడు తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను కాదన్నాడో, అదే సామాజిక స్థాయి అతడిని అమాంతం అగాధంలోకి నెట్టేయదూ! సమాజంలో స్థాయి కంటే సమాజం, కుటుంబ విలువలు ముఖ్యం కాదా?

ఇక్కడ ఇంకో ముఖ్య విషయం గమనించాలి. సీతమ్మ మాట్లాడుతూ కొడుకు నుండి వేరయ్యాక, కూలో నాలో చేసుకుంటూ బ్రతికేస్తాం అన్నారు. ఆ మాటల్లో ఎంత ధీమా, ధైర్యం ఉన్నాయో చూడాలి. మరి సర్టిఫికెట్లు రద్దు పరిస్తే, నేనూ బ్రతకగలనని ప్రతివాది అనగలడా?"

జడ్జిగారి మాటకు సమాధానం ఆ కొడుకు దగ్గర లేదు. అతడు నేలచూపులు చూడనారంభించాడు. డిఫెన్స్ లాయర్ కూడా మౌనం వహించారు.

జడ్జిగారు కొనసాగించారు.

"మాతృదేవోభవః పితృదేవోభవః ఆచార్య దేవోభవః అతిథి దేవోభవః అన్న సుభాషితం కేవలం మన సంస్కృతిలో మాత్రమే ఉంది. దానికి భంగం కలిగించే పని ఏదైనా కానీ, అది దేశ ఉనికికే మచ్చ! వ్యక్తి ఎదుగుదలకు పోటీ తత్వం మంచిదే కానీ, అది మన విలువలకు విఘాతం కలిగించేటట్టు ఉండకూడదు. సర్టిఫికెట్లు రద్దు పరచడం విషయంలో చట్టపరంగా ఇదమిత్థమైన నిర్దేశకాలు లేనప్పటికీ అది తప్పకుండా పరిశీలించదగిన అంశం. అయినప్పటికీ, ప్రతివాదికి గల కుటుంబ బాధ్యతల దృష్ట్యానూ, ఈ పరిస్థితులు చాలా కుటుంబాల్లో ఉండే అవకాశం ఉన్నందున, తొందరపాటు తీర్పులు భవిష్యత్తు పరిణామాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తూ.. తన తల్లిదండ్రుల పట్ల తన ప్రవర్తనను

సవరించుకోవాలనీ, ఇలాంటి ప్రవర్తన పునరావృతం కాకుండా తనను తాను సంస్కరించుకోవాలనీ ప్రతివాదిని మందలిస్తూ, సమాజంలో పొడచూపుతున్న ఇలాంటి తిరోగమన వైఖరిని నిరోధించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను. చట్టానికి అతీతంగా ధర్మానికి చేరువగా ఈ తీర్పు వెలువరించడమైంది." అంటూ ముగించారు.

కోర్టులో అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్నవారందరూ ఒక్కసారిగా లయబద్ధంగా కరతాళధ్వనులు చేస్తూ అప్రయత్నంగా లేచి నిలబడ్డారు.

కళ్ళు తుడుచుకుంటూ తమ వైపు వస్తున్న కొడుకుని చూస్తూనే.. ఆ తల్లితండ్రుల కళ్ళు కూడా వర్షించాయి!

# మందుపెండ ముసురు

వడలి రాధాకృష్ణ
✆ 9985336444

***ఒకేఒక్క ఈ అపవాదును విని, భరించలేక ఈ వెన్నెలలాంటి జీవనక్రమం నుండి శాశ్వతంగా నిష్క్రమించబోతున్నాడు తాను! అదేమీ ఈ క్షణాన వాసుదేవమూర్తికి విపరీతంగా అనిపించడం లేదు. మరో ప్రక్క చనిపోవాలనుకోవడం అనే మాట, వెన్నులో చిన్నగా వణుకును తెప్పిస్తున్న.. దృఢచిత్తం ఆ వణుకును అధిగమించి, ధైర్యాన్ని నూరి పోస్తూనే ఉంది. ఎలాగైనా సరే తెల్లారకుండానే ఈ మందు బిళ్ళల్ని మింగి వేయాలి. అది తన నిర్ణయం.***

అనిశ్చితి అంటే ఏమిటో తెలియని మనిషి.. అసలు అనిశ్చితి అనే పదానికి ఏమాత్రం అర్థం ఎరుగని మనీషి.

అటువంటి వాసుదేవమూర్తి ఇప్పుడు అనేక.. అనేక.. అనిశ్చితుల మధ్య ఆపసోపాలు పడుతూ ఉన్నాడు. ఏదో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్లు, తన జీవితంలో ఎప్పుడూ చూడని విపరీతమైన పరిణామాలు ఇవి. అయినా తప్పడం లేదు. అందులోనూ ఈ మధ్యన మరీ ఎక్కువై పోతున్నాయి. పాపం వాసుదేవమూర్తి..!

ఆయన గారి బుర్ర గిరగిరా తిరుగుతున్నట్లు ఉంది ఇప్పుడు.

"ఈరోజు గురువారం.. మీరు టిఫిన్ చేయరన్న నమ్మకం ఉంది. అందుకే భోజనం వండి సిద్ధం చేశాను" అంటున్న జగదాంబ మాటలు ఆయనకు పరాకుగా అనిపిస్తున్నాయి. అందుకే రెండు నిమిషాలు పాటు పెదవి విప్పలేదు. ఒకవేళ పెదవి విప్పి మాట్లాడాలంటే ఆ మాటలు ఉద్ధృతంగా ఉంటాయి. కోపంగా ఊగిపోతూ ఉంటాడు. ఆ క్షణానికి ఎవరిని లెక్క చేసే తత్వం కాదు వాసుదేవమూర్తి గారిది! అందుకే గళం విప్పక మౌనం వహిస్తూ ఉన్నాడు. అందులోనూ ఇప్పుడు పలికింది జగదాంబ. ఆమె దగ్గర కోపంతో మాట తూలటం తనకి ఇష్టం ఉండదు. అందుకే తన ఆవేశాన్ని తాను దిగమింగుకుంటున్నాడు.

రెండు నిమిషాలు మాటలు లేని మౌనం తర్వాత తేరుకొని, తాను చేస్తున్న లాప్టాప్ పని నుండి బయటకు వచ్చి పెదవి విప్పాడు..

"ఈరోజు అన్నం హితవుగా అనిపించడం లేదు. అందుకే ఏదైనా కొంచెం టిఫిన్ తయారు చేస్తే సరిపోతుంది నాకు! ఇక నీ తిండి అంటావా అది నీ ఇష్టం!" అంటున్న ఆయన మాటలకు జగదాంబ నొచ్చుకోలేదు, నొచ్చుకోదు కూడాను.

ఇంకా చెప్పాలంటే ఒకరి మీద నొచ్చుకునే జీవితం కాదు తనది. అందుకే విషయం మాటు ఉద్రేకాన్ని తనలో దాచుకొని, పెదవి మాటున దానిని అణచిపెట్టుకుంటూ ఉండిపోయింది. ఎందుకో ఒక్కసారిగా ఆమెకు కూతురు వసుధ స్ఫురణకు వచ్చింది. గుండె గద్గదమైపోతూ ఉంది.

అల్లుడు వర్మ, వియ్యంకుడు కుసుమరావు నిరంకుశ ధోరణులు అవగతమయిపోతూ ఉన్నాయి.

వసుధ అత్తింట్లో వారు పెట్టే చిత్రహింసలు అనుభవిస్తూ ఉంది.. ఇప్పుడు కూతురు ఎలా ఉందో? అల్లుడు వర్మ ఏం చేస్తున్నాడో? మొన్న కలిసినప్పుడు పూనే క్యాంపుకు వెళుతున్నాను అన్నాడు. వెళ్ళినాడో లేక బెంగళూరులోనే ఉన్నాడో! కళ్ళల్లో ఏర్పడ్డ కన్నీటిసెగ, జగదాంబలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తూ ఉంది. చెప్పాలంటే ఓర్చుకోక గత్యంతరం లేని వల్లమాలిన బ్రతుకులు తమవి!

ఎదురుగానే ఉండి ఏదో పని చేసుకుంటున్న వాసుదేవ మూర్తి గారి వైపు చూసింది.

'అన్నం తినను, టిఫిన్‌తో సరిపెట్టుకుంటాను అని, ఓ గంట ముందర చెబితే సరిపోతుంది కదా! తీరా వంట చేసిన తర్వాత అక్కర్లేదు అనటం!' ఇవన్నీ జగదాంబకు నిత్యం అర్థం కాని విషయాలు.

తన భర్త దాసురాజు కళ్ళలో మెదిలాడు. ఒక్కసారిగా తీవ్రమైన అనిశ్చితికి లోనయ్యింది ఆమె.

తమది దిగువ మధ్యతరగతి కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు. అయినా ఒక్కగానొక్క కూతురు వసుధను కళ్ళల్లో పెట్టి చూసుకున్నారు.

దాసురాజు వాసుదేవమూర్తిగారి దగ్గర గుమస్తాగిరికి కుదిరాడు. పెద్దాయనకు సంబంధించిన వ్యాపార విషయాలను చూసుకుంటూ ఉండేవాడు.



"చూడు దాసు! నువ్వు నమ్మకంగా నా దగ్గర పని చేస్తూ ఉన్నావు. ఇంట్లో వంట పనులకు వేరే మనిషిని చూసుకోవాల్సిన అవసరం ఉంది నాకు. నీ భార్య జగదాంబ మంచి యోగ్యురాలన్న విషయం.. నాకు తెలియంది కాదు. బయట వేరే వంటమనిషికి ఇచ్చే జీతం మీరే తీసుకుని, వంట, ఇంటి పనుల్ని కూడా మీరే నెత్తిన వేసుకోవచ్చు కదా!" వాసుదేవమూర్తి గారి ప్రతిపాదన దాసురాజుకు బాగా నచ్చింది. అదే విషయాన్ని భార్య దగ్గర ప్రస్తావించాడు.

"అంత పెద్దాయన చెబితే మనం ఎలా కాదనగలం చెప్పండి?" జగదాంబ తాలూకు బాధ్యత నిండిన నడవడిక వాసుదేవ మూర్తిని ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంది. అయిదారు సంవత్సరాల తర్వాత దాసురాజు తీవ్ర అనారోగ్యానికి గురై కన్నుమూశాడు. అప్పటి నుండి జగదాంబ బ్రతుకు అల్లకల్లోలం అయిపోయింది. ఒక్కగానొక్క కూతురు బ్రతుకు ఏమిటో తెలవకుంది ఆమెకు! కానీ ముందు నుండి ఇస్తూ వస్తున్న వాసుదేవమూర్తి గారి చేయూత, ఆ తల్లి కూతుళ్ళకు భరోసానిస్తూ వచ్చింది. కూతురు చదువు విషయంలోనూ, ఆమె పెళ్లి ఏర్పాట్లలోనూ ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నాడు ఆయన. కానీ తర్వాత కాలంలో వియ్యంకుడు కుసుమరావు ద్వారా ఎదురవుతున్న సమస్యలు తట్టుకోలేకుండా ఉన్నాయి.

తమ జీవితాలకు నీడనిచ్చిన వాసుదేవమూర్తి గారితో ముడివేసి, నీచంగా మాట్లాడటం భరింపలేకుండా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే కూటికి టికానా లేని తమ కుటుంబాన్ని దగ్గరకు తీసుకొని, తనకు ఆశ్రయం కల్పించిన దేవుడు ఆయన! ఆనాడు అనారోగ్యానపడి, భర్త దాసురాజు అకాల మరణం చెందిన తర్వాత.. తన జీవితం మరింతగా పాతాళానికి త్రొక్కేయబడింది. అప్పుడు కూడా దేవుడులాగా నేనున్నానంటూ.. ఆ తల్లి కూతుర్లను ఆదుకున్న దైవ స్వరూపుడు ఆయన! అటువంటి పెద్దాయన మీద తన వియ్యంకుడు కుసుమరావు అపవాదులు వేసి, మాట్లాడటం తట్టుకోలేకుండా ఉంది జగదాంబ.

"మీరు ఇష్టంగా తింటారని పెసరట్లు వేశాను. దాంట్లో పచ్చిమిర్చి, అల్లం కొబ్బరి చట్నీలు కలిపాను. మీ స్నేహితుడు అల్లూరయ్య గారు ఉన్నారు కదా! ఆయనను కూడా పిలవండి వచ్చి తిని పోతారు" అంది జగదాంబ.

మామూలుగా అయితే ఆ మాటలకు వాసుదేవ మూర్తి పొంగిపోతారు. అందులోను తనకి ఎంతో ఇష్టమైన అల్లూరయ్య పేరు ఎత్తితే మరీ సంతోషపడతాడు ఆయన. అటువంటిది ఇప్పుడు అలా శూన్యంలోకి తొంగి చూస్తున్న మూర్తి మాట్లాడటం లేదు. ఓ విధమైన నైరాశ్యానికి లోనైపోతున్నాడు.

ఆయనగారి ముఖ కవళికల్ని చూసి నొచ్చుకుంటూ ఉంది జగదాంబ!

తన కూతురు వసుధకు తగిన వరుడు వర్మ అని వెతికి తెచ్చి నిరాడంబరంగా పెళ్లి చేసాడు. తీరా వర్మ తండ్రి కుసుమరావుతోనే అసలు చిక్కు వచ్చి పడుతూ ఉంది. తమ మధ్య లేనిపోని అపోహలు సృష్టిస్తూ ఉన్నాడు. జగదాంబ మంచిది కాదంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నాడు. తన వియ్యపురాలు పరాయి మనిషి పంచన చేరి, రోజు వండి పెట్టడం ఏమిటంటూ.. దానికి లేనిపోని విషయాలను కలిపి ప్రచారం చేస్తున్నాడు.

'మీ నాన్న లేడు, మీ అమ్మ మంచిది కాదు. నువ్వు అంతకన్నా మంచి దానివి కాదంటూ' ఇంట్లో యావన్మంది కోసి పెడుతున్నారు వసుధను.

మొన్న కుసుమరావు ఫోన్ చేశాడు. వసుధ గురించి మాట్లాడాలి రమ్మంటూ.. ఏవేవో మాట్లాడుతున్నాడు. పుణ్యానికి పోతే, సీన్ రివర్స్ అవుతూ ఉంది. వసుధ బాగా చదువుకుంది. కానీ ఉద్యోగం చేయడానికి వీలు లేదంటున్నారు.

ఎన్నడూ తాను చవిచూడని ఈ అపవాదులను భరింపలేక.. వాసుదేవమూర్తి గారు క్రమంగా ఓ విధమైన డిప్రెషన్ లోకి వెళ్ళిపోతున్నారు. మూర్తిగారి మనసు పరిపరి విధాలుగా పోతూ ఉంది. ఒక నైరాశ్యంకి గురవుతున్న ఆలోచనలు పిచ్చిగా పరిభ్రమణం చెందుతూ ఉన్నాయి.

జగదాంబ అనే ఆడది గుర్తుకు వస్తూ ఉంది. ఆ తల్లి తోటి కూతురు వసుధ స్మరణకు వస్తోంది.

ఒక మనిషిగా తనకు ఉన్నంతలో చేసిన సహాయ సహకారాలు ఎరుక అవుతూ ఉన్నాయి. అయితే ఇప్పుడు తన ఎనిమిది పదుల వయసులో ఇటువంటి అపవాదులను భరించటం ఎంతో కష్టంగా ఉంది. చెప్పాలంటే ఎవరూ లేని వంటరివాడు తాను! తనకంటూ ఓ కుటుంబం ఉన్న, నిర్దాక్షిణ్యంగా వెలి వేయబడిన దౌర్భాగ్యుడు తాను! వాసుదేవమూర్తి అన్నీ ఉన్నా ఏమీ లేని ఏకాకి! అంతటి పెద్దాయన ఆ ఆలోచనను తట్టుకోలేకుండా ఉన్నాడు.

అర్ధరాత్రి నిద్ర రావడం లేదు. అలా కిటికీలోంచి బయటకు చూశాడు. ఆకాశంలోని వెన్నెల విరజిమ్ముతూ ఉంది. అంతేనా! పున్నమినాటి వెన్నెలను ముగ్గు బుట్టలాగా వెదజల్లుతూ ఉంది. అలాంటి విరబూసిన వెన్నెలను కిటికీలోంచి చూస్తూ కూర్చోవటం తనకు ఎంతో ఇష్టం. అది తనకు సంతోషాన్ని సరదాను ఇస్తూ ఉంటుంది.

కానీ ఇప్పుడు వాసుదేవమూర్తి మానసిక స్థితి అలాగలేదు. అందునా కుసుమరావు మాటలు తన వ్యక్తిత్వాన్ని కించపరిచి, కృంగదీస్తూ ఉన్నాయి. వీటన్నిటినీ తట్టుకోలేనితనం, ఈ వయసులో తనను దహించి వేస్తూ ఉంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇది అతనికి విపరీతంగా ఏమీ అనిపించటం లేదు. చెప్పాలంటే తనకు అనివార్యం కూడాను. దీన్ని జగదాంబతో సహా ఎవ్వరికి చెప్పలేదు. చెప్పాల్సిన అవసరం లేదు కూడాను!

ఈరోజు రాత్రి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోవాలన్నది తన నిర్ణయం! దాని కోసమని మూడో కంటికి తెలియనీయకుండా నిద్రమాత్రలు కొని తెచ్చుకున్నాడు.

ఇప్పుడు అర్ధరాత్రి ఒంటిగంట కావస్తూ ఉంది. నిమిషాలు లెక్కిస్తున్నాడు. మాత్రలు మింగేయటానికి గుండెను దిటవు చేసుకుంటున్నాడు. ఎలాగైనా సరే.. రేపు సూర్యోదయాన్ని చూడకూడదు అన్నది తన నిర్ణయం. ఇక వెలుతురుని చూడకుండానే, రాత్రివేళ నిద్రమాత్రలు మింగేసి ఆత్మహత్య చేసుకోవడానికి సమాయత్తమవుతూ ఉన్నాడు. అయితే తనకి ఇష్టమైన వెన్నెల.. అదేమిటో, ఎప్పుడూ లేనంతగా విరబూసేస్తూ ఉంది. కమనీయమై అలరిస్తోంది. దూరంగా కనిపిస్తున్న చెట్లు, చేమలు, కొమ్మలు, రెమ్మలు అన్ని, ఆ వెన్నెలలో విపరీతంగా మెరిసిపోతూ ఉన్నాయి. ఆ దృశ్యం వాసుదేవమూర్తికి అత్యంత కళాత్మకంగా అనిపిస్తూ ఉంది. చనిపోయే ముందు చక్కని దృశ్యాన్ని చూడగలుగుతున్నందుకు కొంత తృప్తిగా అనిపిస్తోంది. ఆ సంతోషపు కొసల నుండి దుఃఖం పొంగిపొర్లుతోంది. ఎంత వెన్నెల రాత్రి అయినా, తను తీసుకున్న ఈ నిర్ణయం తనను వెన్ను తట్టి ప్రేరేపిస్తూనే ఉంది. జీవితంలో ఎన్నో రాత్రులని, మరెన్నో వెన్నెల లాంటి జీవితానుభవాలను చవిచూశాడు తాను!

అటువంటిది ఒకే ఒక్క ఈ అపవాదును విని, భరించలేక ఈ వెన్నెలలాంటి జీవనక్రమం నుండి శాశ్వతంగా నిష్క్రమించబోతున్నాడు తాను! అదేమీ ఈ క్షణాన వాసుదేవమూర్తికి విపరీతంగా అనిపించడం లేదు. మరో ప్రక్క

చనిపోవాలనుకోవడం అనే మాట, వెన్నులో చిన్నగా వణుకును తెప్పిస్తున్న.. దృఢచిత్తం ఆ వణుకును అధిగమించి, ధైర్యాన్ని నూరి పోస్తూనే ఉంది. ఎలాగైనా సరే తెల్లారకుండానే ఈ మందు బిళ్ళల్ని మింగి వేయాలి. అది తన నిర్ణయం. రేపటి ఉదయ రేఖల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చూడరాదు.

పిరికివాడా తాను? ఏమో! అక్రమ సంబంధాల్ని అంటగట్టిన తర్వాత, తనదైన వ్యక్తిత్వం ఆ దిశగా ప్రేరేపిస్తూనే ఉంది. దీర్ఘంగా నిట్టూర్చాడు. వెన్నెల విరగకాయించిన చంద్రుడు, నాలుగు గంటల సమయంలో పట్టు విడిచేస్తాడు. కానీ ఇప్పుడు దానికి విరుద్ధంగా ఉంది.

వెలుతురు రాకుండానే పని పూర్తిచేయాలని చూస్తున్నాడు. అలా ఆలోచిస్తూనే క్రమంగా మగత నిద్రలోకి జారిపోతూ ఉన్నాడు.

సమయం తెల్లవారుజాము ఐదు గంటలు అయిపోయింది.

"ఏవండీ సార్ గారు! మిమ్మల్నే" గాఢ నిద్రలో ఉన్న వాసుదేవమూర్తిని జగదాంబ.. అదే పనిగా నిద్ర లేపుతోంది. చాలా ఆత్రుత పడిపోతుంది ఆమె.

"మూర్తి సారూ! మిమ్మల్నే.. ఒక మారు నిద్ర లేవాలి" జగదాంబ మాటలు అరుపులులాగా ఉన్నాయి. అదే పనిగా కంగారు పడిపోతూ ఉంది. మాటలు వణికిపోతున్నాయి. చటుక్కున నిద్ర లేచాడు. ఆయనకు ఏమీ అర్థం కావడం లేదు. ఆమెకు చెమటలు పట్టేసి ఉన్నాయి.

"ఏమైంది?" ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"ఇప్పుడే వసుధ ఫోన్ చేసింది. వియ్యంకుడుగారికి నలత చేసింది అట! అర్ధరాత్రి రెండుగంటల సమయంలో హార్ట్ స్ట్రోక్ వచ్చిందట. తల్లీ కొడుకు కలిసి, కుసుమరావుగారిని హాస్పిటల్‌కి తరలించారు. హాస్పిటల్లో చేరిన అరగంటకే చనిపోయాడట.." జగదాంబ మాటలు వాసుదేవమూర్తిని విస్తుబోయేలా చేస్తున్నాయి.

కుసుమరావుకి హార్ట్ స్ట్రోక్ రావడమేమిటి? ఈ వయసులో చనిపోవడం ఏమిటి? చెప్పాలంటే తన కంటే ఇరవై సంవత్సరాలు చిన్నవాడు! అంతా వింతగాను ఆశ్చర్యంగాను అనిపిస్తోంది వాసుదేవమూర్తికి. ఈ సమయంలో అసలు చనిపోవాలనుకున్నది తాను. కానీ అనూహ్యంగా, తమని ముప్పు తిప్పలు పెడుతున్న కుసుమరావు అకాల మరణం చెందడం.. లోకరీతి ఏమీ అర్థం కావడం లేదు. కడుపులోని గుబులు బుర్రలోకి తన్నుకొచ్చేస్తుంటే.. మంచం పరుపు కింద దాచిపెట్టిన నిద్ర మాత్రలని కిటికీలోంచి బయటికి విసిరి పారేసాడు. తనకు వాటితో అవసరం ఇక ఏమాత్రం లేదు.

వాసుదేవమూర్తికి వింతగా అనిపిస్తుంది. ఉదయం ఐదున్నర గంటలు అయిపోతూ ఉంది. ఇంకా వెన్నెల పల్చబడటం లేదు. తనకు ఆ వెన్నెల ధ్యాసే లేకపోతే, ఈ పాటికి తాను ఈ లోకంలో నుండి నిష్క్రమించేసి ఉండేవాడు. వాసుదేవమూర్తికి ఆ సన్నివేశం గొప్పగా ఉంది. బుర్ర పెట్టి ఆలోచిస్తే, సూత్రబద్ధంగాను అనిపిస్తోంది. ఎప్పుడో నిష్క్రమించేయాల్సిన ఆకాశంలోని విరబూసే వెన్నెల మాంత్రికుడు, ఇంకా ఇంకా కొనసాగుతూ.. భానుడి హవా మొదలైన తర్వాత తనను, తనలాంటి ఈ అందమైన ప్రాపంచికాన్ని, ఆయన గారికి వప్పజెప్పేసి, క్రమంగా సెలవు తీసుకుంటున్నాడు ఆ జాబిలి మామ!

కథామంజరి బాల కథ

# ఏనుగు సమయస్ఫూర్తి

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
✆ 9908554535

*ఆ బురదచే ఏర్పడ్డ నా ఆకారముతో పాటు, నాకు పర్యాయ పదాలైన గజం, హస్తి, కరి అనునవి.. ఈ రోజు వాటిని భయపడేలా చేశాయి. మీరు కూడా తెలుగు భాషలో మీకున్న వివిధ పర్యాయపదాల పేర్లను తెలుసుకోండి. అవి నాలాగే మిమ్మల్ని కూడా రక్షించవచ్చు. తేనెలాంటి తెలుగు గొప్పతనం తెలుసుకోండి. మనం తెలుగు భాషని మాట్లాడినట్లు కూడా అవుతుంది!"*

సుందరవనం అనే అడవిలో ఒక ఏనుగు అన్నింటి కంటే ఆకారంలో పెద్దగా జన్మించింది. అది ఒకసారి దారి తప్పి ప్రక్క అడవికి వెళ్ళింది. అక్కడ అది పొరపాటున ఒక బురద గుంటలో పడింది. ఆ బురద దాని శరీరమంతా అంటి, అది వికృతంగా మారిపోయింది. అలా అది ఆ శరీరానికి అంటిన బురదతోనే, దానిని కడుగుటకు నీటి కోసం నడక సాగిస్తున్నది.

ఇంతలో దానికి అప్పుడే ఒక జింకను పట్టుకున్న ఒక పెద్ద పులి కనబడింది. ఆ ఏనుగు వెంటనే "ఏయ్! ఆ జింకను వదలిపెట్టు. లేకుంటే నేను నిన్ను ఏం చేస్తానో తెలియదు" అని అంది.

అది విన్న ఆ పెద్దపులి.. పెద్ద ఏనుగును చూసి ఆశ్చర్యపోయి, "నీవెవరు?" అని అడిగింది.

ఆ ఏనుగు ధైర్యంతో గొంతు మార్చి "నేను వింత మృగాన్ని! నా పేరు గజం." అని అంది.

అది విన్న పెద్దపులి 'ఇది నిజం. ఇది వింత జంతువు! దీని పేరు కూడా విచిత్రంగా ఉంది' అని అనుకుని, దానికి భయపడి, జింకను వదిలి పారిపోయింది. ఆ జింక.. తనను కాపాడిన ఈ ఏనుగుకు ధన్యవాదాలు చెప్పి, అది మరో వైపు వెళ్లి పోయింది.

ఆ తర్వాత ఆ ఏనుగుకు మరి కొద్ది దూరంలో, ఒక కోతిని పట్టుకున్న చిరుతపులి కనిపించింది. ఆ చిరుతపులి కూడా ఈ ఏనుగును చూసి ఆశ్చర్యపోయి "నీవు ఎవరు?" అని అంది.

అప్పుడు ఏనుగు ధైర్యంతో "నా పేరు హస్తి" అని గట్టిగా ఉరిమినట్టు అంది.

చిరుతపులి 'ఇదేదో వింత మృగంలా ఉంది. అందుకే నాకు భయపడడం లేదు. ఇది నన్ను మ్రింగేలాగున ఉంది' అని అనుకొని, అది కూడా కోతిని వదిలి మారు మాట్లాడకుండా పారిపోయింది.



ఆ కోతి కూడా ఏనుగుకు ధన్యవాదాలు చెప్పి వెళ్లి పోయింది.

తర్వాత ఆ ఏనుగుకు నక్క, తోడేలు రెండు ఎదురైనాయి. అవి దాన్ని చూసి ఆశ్చర్యపోయి "నీవు ఎవరు?" అని అడిగాయి.

ఆ ఏనుగు "నా ఆహారం నక్క, తోడేలు! నా పేరు కరి" అని అంది.

'అయితే మా పని సరి' అని అనుకుంటూ, అవి రెండూ పారిపోయాయి.

తర్వాత ఆ ఏనుగు తన అడవికి దారి తెలుసుకొని, తిరిగి వచ్చి తోటి జంతువులతో "మిత్రులారా! నేను పక్క అడవికి దారితప్పి వెళ్ళాను. క్రూరమృగాలు నన్ను చూసి చాలా భయపడి తాము పట్టుకున్న జింక, కోతిని వదిలి పారిపోయాయి. ఇక నక్క, తోడేలు కూడా నన్ను చూసి భయపడ్డాయి. ముఖ్యంగా తెలుగు పర్యాయ పదాలైన నా పేర్లు.. వాటి వెన్నులో వణుకు పుట్టించాయి. ఇన్ని రోజులు నాది పెద్ద ఆకారం అని బాధపడ్డాను. దానికి తోడు నాకు బురద అంటింది. కానీ ఆ బురదచే ఏర్పడ్డ నా ఆకారముతో పాటు, నాకు పర్యాయ పదాలైన గజం, హస్తి, కరి అనునవి.. ఈ రోజు వాటిని భయపడేలా చేశాయి. మీరు కూడా తెలుగు భాషలో మీకున్న వివిధ పర్యాయపదాల పేర్లను తెలుసుకోండి. అవి నాలాగే మిమ్మల్ని కూడా రక్షించవచ్చు. తేనెలాంటి తెలుగు గొప్పతనం తెలుసుకోండి. మనం తెలుగు భాషని మాట్లాడినట్లు కూడా అవుతుంది!" అని అంది.

ఆ జంతువులన్నీ 'సరేనని' దాని ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని అభినందించాయి.

బాల కథ

# చిలుక సాయం

కూచిమంచి నాగేంద్ర

***మీరు నాకు చేసిన ఉపకారానికి నేను నాకు తోచిన ప్రత్యుపకారం చేశాను. నా పిల్లలకు రెక్కలొచ్చాయి. ఇక నాకు సెలవు ఇవ్వండి. ఇకపై పూర్వంలా మీ రాజ్యపాలన మీరు చేసుకోండి. ఒకరి మీద ఆధారపడి పరిపాలన చేస్తున్న మహారాజు అనే చెడ్డ పేరు మీకు రాకూడదు!" అంటూ, పిల్లలను తీసుకుని అడవి వైపు ఎగిరిపోయింది రామచిలుక.***

తులంగ రాజ్యాన్ని, విష్ణువర్మ అనే రాజు పాలించేవాడు.

ఒక రోజు "మహామంత్రీ, వేసవి సమీపిస్తోంది. అడవిలో ఉన్న క్రూర జంతువులు గ్రామాల మీదకు రాకుండా వేట సాగించాలి. అందుకు ఏర్పాట్లు చెయ్యండి" అన్నాడు విష్ణువర్మ. మరుసటి రోజే కొంతమంది సైనికులతో రాజు వేటకు వెళ్ళాడు.

అడవిలో చాలా సేపు వేట సాగింది. "మహారాజా, అటు చూడండి! కార్చిచ్చు ఇటే వస్తోంది. మనం వెంటనే ఇక్కడి నుండి వెళ్ళిపోవాలి" అన్నాడు మంత్రి.

"సరే, మన సైనికులు ఈ అడవిలో ఉండే కోయ జాతి వారితో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేయమనండి" అంటూ తిరుగు ప్రయాణం అయ్యాడు విష్ణువర్మ.

అప్పుడే రాజుకు "కాపాడండి! కాపాడండి!" అన్న మాటలు వినిపించాయి. అటుగా చూసిన మహారాజుకు అక్కడ చెట్టు మీద ఉన్న ఓ రామచిలుక కనిపించింది. అదే కాపాడమని అరుస్తోంది. "మాటలు నేర్చిన చిలక!" అంటూ సైనికులను పంపి, "ఆ చిలుకను దాని గూడుతో సహా మన ఉద్యానవనానికి చేర్చండి" అన్నాడు.

ఇద్దరు సైనికులు ఆ రామ చిలుకను, దాని రెండు పిల్లలను జాగ్రత్తగా చెట్టుపై నుండి దించి, మహారాజుతో బాటుగా బయలుదేరారు. అలా ఆ మాటలు నేర్చిన రామచిలుక రాజధానికి వచ్చింది. ఉద్యానవనంలో ఓ జామ చెట్టు మీద దాని గూడును ఉంచారు.

"చాలా సహాయం చేశారు మహారాజా! దానికి ప్రతిగా నేను మీకు సహాయం చేస్తాను!" అంది రామచిలుక. దాని మాటలకు నవ్వేశాడు రాజు విష్ణువర్మ.

ఒకరోజు సాయంత్రం మహారాజు మందిరానికి ఎగిరి వచ్చింది రామచిలుక. "రాజా! ఈ రాత్రికి వజ్రాల వ్యాపారి ఇంటిని కొందరు దొంగలు దోచుకుపోతున్నారు" అని చెప్పింది.



ఈసారి ఆశ్చర్యపోయాడు రాజు! అంతేకాదు, కొంతమంది సైనికులతో తానే స్వయంగా వజ్రాల వ్యాపారి ఇంటికి వెళ్ళాడు. అప్పటికే కొందరు దొంగలు వ్యాపారిని కట్టేసి, నగల మూటలను పట్టుకుని బయటకు వస్తున్నారు. సైనికులు వారిని బంధించగా వ్యాపారి కట్లు విప్పారు.

వ్యాపారి మహారాజు కాళ్ళ మీద పడి ధన్యవాదాలు తెలిపాడు. అంతేకాదు, మహారాజుకి విలువైన వజ్రాన్ని బహుమతిగా ఇచ్చాడు.

"మహారాజా! నేను చెప్పాను కదా? దీని వలన మీకు మరింత కీర్తి లభించింది" అంది చిలుక.

ఒక రోజు మహారాజు పూలవనంలో విహారం చేస్తున్నాడు. "మహారాజా! ఇప్పుడు మీకు తాగడానికి తీసుకురాబోయే పాలలో విషం కలిసింది. అది కూడా మీ మహారాణి తమ్ముడు చేసిన పనే. జాగ్రత్త!" అంది చిలక.

విష్ణువర్మ ఆశ్చర్యపోయాడు. అప్పుడే ఓ సైనికుడు వణుకుతున్న చేతులతో పాలు తీసుకుని వచ్చాడు. విష్ణువర్మ వాడిచేతే ఆ పాలు తాగించి, రాణి తమ్ముడిని బంధించమని ఆజ్ఞాపించాడు.

"మహారాజా! ఇంతే కాదు, శత్రు దేశానికి మన గుట్టు చెప్పి, వాళ్ళను దండయాత్రకు రమ్మని కూడా చెప్పాడు మీ బావమరిది. మీరు ఓడిపోతే ఈ రాజ్యాన్ని తన హస్తగతం చేసుకోవాలని అతని దురాశ!" చెప్పింది రామచిలుక.

మహారాజు మంత్రిని పిలిచి సైన్యాన్ని సన్నద్ధం చేయమని, మన పొరుగు రాజ్యంపై యుద్ధానికి వెళ్తున్నామని ఆజ్ఞ జారీ చేశాడు. ఇది తెలిసిన పొరుగు రాజు కాళ్ళబేరానికి వచ్చి సంధి చేసుకున్నాడు.

ఒకరోజు మహామంత్రి.. సర్వసేనానితో “ఇక రాజుకి మన అవసరం లేనట్టుగా ఉంది. అన్నీ ఆ చిలుక చెప్పడం, రాజు అమలు పరచడం జరుగుతోంది. అన్నిటికీ ఆ చిలుక మీదే ఆధారపడుతున్నారు” అన్నాడు.

అది విన్న రామచిలుక, రాజు దగ్గరకు వెళ్ళి “మహారాజా! మీరు నాకు చేసిన ఉపకారానికి నేను నాకు తోచిన ప్రత్యుపకారం చేశాను. నా పిల్లలకు రెక్కలొచ్చాయి. ఇక నాకు సెలవు ఇవ్వండి. ఇకపై పూర్వంలా మీ రాజ్యపాలన మీరు చేసుకోండి. ఒకరి మీద ఆధారపడి పరిపాలన చేస్తున్న మహారాజు అనే చెడ్డ పేరు మీకు రాకూడదు!” అంటూ, పిల్లలను తీసుకుని అడవి వైపు ఎగిరిపోయింది రామచిలుక.

“పక్షి అయినా ఆ చిలుకకు ఎంత ఆలోచన! నేను చేసిన చిన్న ఉపకారానికి ఉపకారం చేయడమే కాదు, నేను ఎలా ఉండాలో కూడా చెప్పి మరీ వెళ్ళిపోయింది!” అనుకుంటూ అది వెళ్ళిన వైపే చూస్తుండిపోయాడు మహారాజు విష్ణువర్మ.

# తప్తశిల

శ్రీమతి చిల్లర భవానీ దేవి
✆ 9866847000

**విశిష్ట అతిథి కథ**

*"అమ్మా! నువ్వు చెప్పినట్లే స్కూల్ నించి వచ్చి ఫ్లాస్క్‌లో పాలు చెల్లికి ఇచ్చి తాగానమ్మా. స్టూల్ తలుపు దగ్గరకు లాగి పై గడియ వేశాను..." ఆయాసంతో ఆగి ఆగి మళ్ళీ చెప్పింది పాప. "చెల్లి బర్త్ డే ఆట ఆడిందమ్మా... క్యాండిల్స్ జాగర్తగానే వెలిగించాను. ఎలా పడిందో నా నైలాన్ గౌను అంటుకుంది. గడియ తీయలేక అలాగే గోడకి నిలబడ్డాను. చెల్లిని మాత్రం దగ్గరకి రానీయలేదు"*

వనస్థలిపురం బస్టాప్‌లో సచివాలయానికి ఆఫీస్ స్పెషల్ కదలటానికి సిద్ధంగా ఉంది. దూరంగా బరువుగా పరుగులాంటి నడకతో వస్తున్న శిశిరను చూసి, డ్రైవర్ బస్సు కాసేపు ఆపాడు.

"పోనీవోయ్..." అరిచాడు చారి.

అంతా ఒక ఆఫీసులో పనిచేసేవాళ్ళే... కానీ బస్‌లో మాత్రం బద్ధ శత్రువుల్లా మారిపోతారు. అదంతా సీటు కోసమే! లేదంటే గంటన్నర నిలబడాలి మరి!

ఆయాసపడుతూ వేగంగా నడుస్తున్నది శిశిర. తొమ్మిది నెలల గర్భవతి. భుజాన బ్యాగ్ కూడా బరువనిపిస్తున్నది. శిశిర బస్ ఎక్కింది. ఆయాసంగా ఉంది. పొద్దుట్నుంచి ఏమీ తినలేదు. కళ్ళు తిరుగుతున్నట్లనిపిస్తుంది. లేడీస్ సీట్లు ఖాళీ ఉన్నాయేమో... లేవు. ఆ సీట్లలో కూడా రోజూలాగే మగవాళ్ళే కూర్చున్నారు.


"దయచేసి కాస్త సీటు ఇస్తారా?" ఆయాసపడుతూనే సందేహిస్తూ మెల్లగా అడిగింది.

వినిపించనట్లు నిద్ర నటిస్తున్నారు. శిశిరకు కళ్ళు తిరుగుతున్నాయి. తప్పనిసరై మళ్ళీ అడిగింది.

"మేం లేవం... ఆఫీస్ స్పెషల్లో రూల్సేం ఉండవు" చారి కోపంగా అన్నాడు.

"లేవలేని మనిషని కూడా చూడరా..." మాధవి విసుక్కుంది.

రోజూ జరిగే ఈ వివాదం అందరికీ చిరాగ్గా అన్పిస్తుంది.



“ఆడవాళ్ళకు మాత్రమే అని ఉంది. కనపడటం లేదూ” సాగదీసింది రాధ.

“మేం లేవం. అవసరమైతే చీరలు కట్టుకుని కూచుంటాం!” చారి మాటలకు అంతా నవ్వారు.

ఎవ్వరూ ఇదేమనలేదు. ఆ గ్యాంగ్‌తో ఎవరు పెట్టుకుంటారు? అలాగే బస్ సచివాలయం చేరింది.

బస్ దిగుతూనే అంతా పరిగెడుతున్నట్లు వెళ్ళిపోయారు. చివరికి మెల్లగా దిగింది శిశిర. బస్ దిగుతూనే అక్కడే వాంతి చేసుకుంది. బ్యాగ్‌లోంచి వాటర్‌బాటిల్ తీసి, నోరు కడుక్కొని ఆఫీసులోకి నడిచింది.

టైపు చేస్తున్నదే గానీ, శిశిర మనసు మనసులో లేదు. ఇంకా డెలివరీకి నెల టైముందని డాక్టర్ చెప్పింది. అయినా ఏదో అనుమానం! కడుపులో బిడ్డ కదుల్తున్నది. “ఆగు తల్లీ... టైపు పూర్తి కానీ...” ఇంకా పుట్టని పాపాయికి చెప్పుకుంది.

కడుపులో పాపకు ఆకలవుతున్నట్లుంది. ఆ లెటర్ పూర్తిచేస్తే గానీ, లంచ్‌కి వెళ్ళొద్దని ఆఫీసర్ ఆర్డర్! గర్భవతి బాధ.. ఆయనకేం తెలుస్తుంది. ఇప్పటికే పొద్దున్నించి ఏఎస్ఓ రవీంద్ర ఒకటే నస. తాను మెటర్నిటీ లీవులోకి వెళ్ళేలోగా.. తరతరాల పెండింగ్ వర్క్ అంతా చేయించేయాలని చాలా రొస్టు పడుతున్నాడు, పెడుతున్నాడు! నిన్న కడుపునెప్పితో ఇంకోమాట కూడా అన్నాడు.. “అసలు ఆడవాళ్ళు ఉద్యోగాలకు రాబట్టే, మా మగవాళ్ళకు నిరుద్యోగం పెరిగింది” అని.

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. కాబట్టి ఐదు తర్వాత కూడా ఆఫీసర్ వెళ్ళమనేదాకా ఉండాలిట. “ఈ నెంబర్ డిస్పోజల్ తీయండి” రవీంద్ర స్లిప్ ఇచ్చాడు. అది పదేళ్ళ కిందటిది. ఎంత వెదికినా దొరకటం లేదు. ఆ మాట చెపితే దొరికేదాకా వెతకాలన్నాడు.

“ర్యాక్‌లో కింద ఉందేమో చూడండి” ఆమె పరిస్థితి పట్టించుకోకుండా అన్నాడు.

కింద నేలమీద కూచొని చూడసాగింది శిశిర. ఆ పొజిషన్లో కూచోటం వల్ల కడుపులో నరాలు పట్టేస్తున్నాయి. శిశిరకు కన్నీళ్ళొస్తున్నాయి.

ఆఫీసరు ఏదో పనిమీద అటుగా వచ్చి కింద కూర్చొని డిస్పోజల్స్ వెతుకుతున్న ఆమెకేసి సానుభూతిగా చూశాడు. "ఇదేంటి ఈవిడ్ని ఇంకా ఉంచారు? మీరు వెళ్ళండమ్మా..." బహుశ ఆయనకి తల్లిమీద తప్పకుండా ప్రేమ, గౌరవం ఉండి ఉంటాయి.

"బతుకు జీవుడా..." అనుకుని బయటపడింది శిశిర. ఇంటికి వచ్చేసరికి ఎనిమిదైంది. భర్త రాంబాబు, మరిది ఏదో చదువుకుంటున్నారు. వంట ప్రయత్నం ఏమీ జరిగినట్లు లేదు.

"ఇప్పుడా రావటం ఆకలి కాలిపోతుంటే..." రాంబాబు విసుక్కున్నాడు. భార్య కడుపుతో ఉంది. పగలల్లా చాకిరీ చేసి, రెండు బస్సులు మారి, ఇంటికి కష్టపడి ఇంత లేటుగా వచ్చిందన్న జ్ఞానం లేదు. ఉసూరుమంటూ అప్పుడు మొదలుపెట్టి, వంటచేసి, ఇద్దరికీ పెట్టి, తిన్నాననిపించి పక్కమీద వాలిపోయింది.

ఉదయం లేస్తూనే ఒకటే వాంతులు. విసుక్కుంటూ రాంబాబు, మరిది బయట తింటామని చెప్పి తయారై వెళ్ళిపోతున్నారు. "నాకేదైనా చేసిపెట్టి వెళ్ళండి" అంది నీరసంగా.

"మీ అమ్మ వచ్చి చేస్తుందిలే" ఎగతాళిగా అంటూ వెళ్ళిపోయాడు రాంబాబు.

"అమ్మ... అమ్మ వస్తుందా...?"

ఆ ఊళ్ళో సరైన డాక్టర్ సౌకర్యం లేదని ఇక్కడే డెలివరీ వరకు ఉంటానని అమ్మకి రాసింది. "నీ ఇష్టం. నేను మాత్రం మీ నాన్ననొదిలి రాలేను" అని అమ్మ బదులు రాసింది.

వాళ్ళకి ఏ ఇబ్బంది వచ్చినా మాటిమాటికీ సెలవుపెట్టి పిచ్చిగా పరిగెత్తింది. తనకి ఇంత తప్పనిసరి అవసరమొస్తే ఇలా మాట్లాడుతుంది. డాక్టర్ ముఖ్యమని తను హైదరాబాద్లోనే ఉండిపోయింది. ఆలోచనలతో నిద్రపట్టింది శిశిరకు! మెలుకువ వస్తూనే ఒకటే వాంతులు. సాయంత్రం రాంబాబు వచ్చేదాకా స్పృహలో లేదు. విసుక్కుంటూ డాక్టర్కి చూపించాడు. ఆఫీసుకు వారం సెలవు కోసం లెటర్ పంపింది. తనలాంటివాళ్ళు పెళ్ళి చేసుకోకూడదు. చేసుకున్నా పిల్లల్ని కనకూడదు. చిన్నప్పటి నుంచి అమ్మ పడే బాధలు చూసి, పెళ్ళి చేసుకోకూడదు అనుకుంది శిశిర.

"అంతా నాన్నలా ఉండరమ్మా... పైగా నువ్వు చేసుకోకపోతే నీ చెల్లెళ్లకు కావు" అంటూ నచ్చచెప్పింది అమ్మ. మొదట్నించి ఉద్యోగమే తన ప్రయారిటీ! ఎలా జరిగిందో అయిపోయింది. ఇప్పుడు అమ్మ కూడా తన గురించి పట్టించుకోవటంలేదు. కడుపుతో వున్నమ్మ కనక మానుతుందా? దూరపు బంధువుల సహాయంతో డెలివరీ అయింది శిశిర. మూడునెలలు మెటర్నిటీ లీవు తర్వాత పాపని క్రచ్ లో చేర్చింది. నానాకష్టాలూ పడి ఆ పిల్లను పెంచేలోపు రెండోది తయారు! జీవితం ఎటు లాక్కెళ్ళితే అటు పరిగెత్తింది. ఇప్పుడు పెద్దదానికి ఆరేళ్ళు... చిన్నదానికి మూడేళ్ళు. ఈసారైనా కొడుకుని కనకపోతే, విడాకులు అంటున్నాడు రాంబాబు. పూర్తిగా తనే కారణం కాదని అతనికీ తెలుసు!

★★★

టైపు చేస్తున్నదే గానీ శిశిర మనసంతా ఇంటి మీదే ఉంది. పిల్లలకి మార్నింగ్ స్కూల్స్. పన్నెండింటికి వస్తారు. తాళంచెవి పక్కింట్లో ఇచ్చి వచ్చింది. వాళ్ళకి అలవాటే. తాళం తీసుకుని, తను ఇంటికి వెళ్ళేవరకు ఎంత జాగ్రత్తగా మసలుకోవాలో చెప్పింది. కింద ప్రమాదకరమైన వస్తువులేవీ ఉంచదు. అయినా మనసు ఇవ్వాళ ఎందుకో పనిమీద నిలవటం లేదు. అన్నీ తప్పులు టైపు చేస్తున్నది.

సాయంత్రం అయిదయింది. గబగబా సీటు కట్టేసి బస్టాప్‌కి వచ్చింది. బస్ కోసం ఎదురుచూస్తుండగా ఎదురింటి కాలేజీ కుర్రాడు బైక్ మీద వచ్చాడు. "ఎక్కండి ఆంటీ..." చాలా గాభరాగా ఉన్నాడు. తను సందేహించింది.

"పెద్దపాపకి బాగాలేదు. త్వరగా ఎక్కండి" అన్నాడు బరువుగా.

అంతే! ఎక్కేసింది. బైక్ గాంధీ హాస్పిటల్ ముందు ఆగింది. శిశిరకు గుండె దడదడలాడుతోంది. బర్నింగ్ వార్డ్‌లో పాపని చూస్తూనే ఫెయింట్ అయి పడిపోయింది.

శిశిర కొంచెం తేరుకున్నాక పాప కూడబలుక్కుంటూ చెప్పింది. "అమ్మా! నువ్వు చెప్పినట్లే స్కూల్ నించి వచ్చి ఫ్లాస్క్‌లో పాలు చెల్లికి ఇచ్చి తాగానమ్మా. స్టూల్ తలుపు దగ్గరకు లాగి పై గడియ వేశాను..." ఆయాసంతో ఆగి ఆగి మళ్ళీ చెప్పింది పాప. "చెల్లి బర్త్ డే ఆట ఆడిందమ్మా... క్యాండిల్స్ జాగర్తగానే వెలిగించాను. ఎలా పడిందో నా నైలాన్ గౌను అంటుకుంది. గడియ తీయలేక అలాగే గోడకి నిలబడ్డాను. చెల్లిని మాత్రం దగ్గరకి రానీయలేదు" రొప్పుతూ శ్వాస తీస్తున్న పాపని చూసి గుండె బద్దలయ్యేలా ఏడ్చింది శిశిర.

అంత బాధలోనూ అమ్మ మెప్పు కోసం పాప ఆరాటం చూసి శిశిర విలవిల్లాడి పోయింది. మూడు రోజులు నరకం చూసి పాప అందని తీరాలకు పోయింది.

ఎవరెంత చెప్పినా శిశిర ఉద్యోగం మానేసింది. తల్లిగా ఓడిపోయాననుకుంటూ విపరీతమైన ఆత్మన్యూనతతో కుంగిపోయింది. ఎవ్వరితోనూ మాట్లాడటం మానేసి తప్తశిలలా బతుకుతోంది. ఇప్పటికీ ఎక్కడైనా బస్టాప్‌లో ముగ్గుబుట్టలాంటి తలతో బస్‌లో ఎక్కే ఉద్యోగినులందరికీ చెప్తుంటుంది. "మీ పిల్లలు జాగర్తమ్మా" అంటూ!

ఎప్పుడైనా ఎక్కడైనా శిశిర కనిపిస్తే విసుక్కోకండి.

ఆమె మనస్సులో రగిలే వేదన అర్థం చేసుకోవాలంటే.. అమ్మ మనసుండాలి!

*(ఆంధ్రప్రభ – ఏప్రిల్ 2014 నుంచి పునర్ముద్రణ)*

# క్లబ్బులో చెట్టు కథ

కీ. శే. వేలూరి వేంకటేశ్వర రావు

## కథా మార్గదర్శి కథ

*‘గచ్చు చేసినప్పుడు, దక్షిణం వేపు ఉత్తరం వేపు కన్నా ఎత్తు ఎక్కువయ్యిందిట. అది క్లబ్బు పెద్ద ఎవడైతే వాడికి హానిట. మరి, క్లబ్బు పెద్ద అంటే, ప్రెసిడెంటే గదా! అందుకే, కోదండంగారికి హృద్రోగం వచ్చిందిట.’ అది విని, కోదండం, అప్పలరాజు నాయుడి మీద కత్తులు నూరుతున్నాడట. లేచే ఓపిక లేదు గానీ, అప్పలరాజు నాయుడిని నరికి పారెయ్యాలి అంటున్నాడుట!*

క్లబ్బులో చెట్టు కొట్టేశారని రెడ్డి మేష్టారు రాజు గారింట్లో చెప్పంగానే, నా కుడిచెయ్యి కొట్టేసినట్టనిపించింది. కుడి చేతిలో స్కాచ్ గ్లాసు జారిపోతుందేమోనని భయపడి, గట్టిగా ఎడమచేత్తో వత్తి పట్టుకున్నా.. బాలాజీ గుడిలో పూజారి మంత్రపుష్పం చెప్పేప్పుడు పెట్టే నమస్కారంలాగా!

★★★

మా తాత అంటూ వుండేవాడు. “చెట్టు కొట్టేసినవాడి చెయ్యి కొట్టమన్నాడోయ్ నైజాము నవాబు! అదీ రాచరికం, పరిపాలన అంటే.”

తాతయ్యది ఖమ్మం జిల్లాలో బేతుపల్లి గంగారం. రజాకార్లు, ఆయన గుర్రానికి చెవులూ తోకా కోసి పారేసిన తరువాత కూడా నైజాము నవాబుని, ఎంతమంది ఎప్పుడు ఎంత తిట్టినా, అసహ్యించుకున్నా(ఆ విషయంలో మా నాన్నది అగ్ర తాంబూలమే!), చెట్లు నరికేయడం అన్న కసాయి ప్రసక్తి వస్తే, నవాబుని తెగ పొగిడే వాడు! నవాబు గారన్నది నిజమే అయితే, ఆ ఒక్క విషయంలో అతగాడిని పొగడక తప్పదు!

★★★

“ఎందుచేత చెట్టు కొట్టేశారు? పుచ్చిపోయిందా, పురుగు పడ్డదా?” అని అడగంగానే, రాజుగారు “అబ్బో! అది చాల పెద్ద కథ, రెడ్డిగారినే చెప్పనీయండి,” అంటూ, రాజ దర్పం చూపించారు.

..

నా బుర్ర గింగుర్లు తిరిగి, నన్ను నాలుగున్నర దశాబ్దాలు వెనక్కి పంపించింది. ఆ నాటి అనుభవాలు ఎన్నో ఒక్కటొక్కటే గుర్తుకు రావడం మొదలయ్యాయి.

క్లబ్బులో చెట్టు, మాకు తెలిసేటప్పటికే కనీసం నలభై అడుగుల ఎత్తైన పెద్ద మాను. క్లబ్బు రెండో అంతస్థు పైన ఇంకో పది అడుగుల ఎత్తుండి, పైన పెద్ద స్టేకు పేకాట వాళ్ళకి చల్లగా గాలి విసిరేది. అప్పుడప్పుడు, చీకట్లో దారి తప్పిన పిట్టల కిలకిలలు వినిపించేవి.

క్లబ్బులో చెట్టు నిద్రగన్నేరు చెట్టు! బ్రహ్మసృష్ఠి 'పొట్టి గన్నేరని', 'నిద్రగన్నేరు' విశ్వామిత్ర సృష్ఠి అనీ అనేవాడు మా మేనత్తగారి భర్త. ఆయన ప్రవరలో విశ్వామిత్రుడు ఒక ఋషి కాబట్టి, అలా గొప్ప చెప్పుకున్నాడు కానీ, నన్నడిగితే, నిద్రగన్నేరే బ్రహ్మ సృష్టి అని ఢంకా బజాయించి చెప్పగలను. అంత గొప్ప చెట్టు విశ్వామిత్రుడు సృష్టించలేదు. చూడరాదూ.. వేపచెట్టుకీ, కరివేపచెట్టుకీ భేదం! కరివేపచెట్టు విశ్వామిత్ర సృష్ఠే కదా మరి! హుందాతనంలో కరివేపచెట్టుని వేపచెట్టుతో పోల్చగలరా!

క్లబ్బులో చెట్టు కొట్టేసేటప్పటికి, ఆ చెట్టుకి కనీసం డెబ్భై ఐదు ఏళ్ళైనా వుండి వుండాలి. అది క్లబ్బు కన్నా ముందే పుట్టింది. మరి ఏ 'సుందరి విత్తనం చేత నుంచి పలక్కుండా వెళ్ళిపోయిందో' తెలియదు. ఇప్పుడు, 'ఆమెను వెతుక్కుంటూ, యోజనాలు నడిచి పోవడం..' శుద్ధ అనవసరం! ఆ క్లబ్బు స్థలంలో ఆగ్నేయంగా ఉన్న నిద్రగన్నేరు చెట్టుని, ఆ పళంగా అల్లాగే వుంచి, క్లబ్బు కట్టారుట! ఆ కట్టించిన పంతులుగారికి నైజాము నవాబు గురించి తెలియడానికి ఆస్కారం లేదు. కానీ, చెట్లంటే ఎడతెగని అభిమానం, ఆప్యాయత వుండి వుండాలి.



ఎండల్లో ఎఱ్ఱగా కుంకుమ రంగు పూలతో విరబూసి, సాయంకాలం అయ్యేటప్పటికి, కాసిని పూల గుత్తులు మాను చుట్టూరా, నేలమీద, హుందాగా తంగెళ్ళమూడి ఉన్ని తివాచీ మీద డిజైనులా.. విచ్చలవిడిగా పరిచేది.. 'ధరను చొచ్చి, దివిని విచ్చి, విరులు తాల్చు తరువు' అన్న కవిగారి హృదయంలా! ఆ పూలగుత్తుల్లో పుప్పొడి కొక్కెంలా, చిన్న కాడకి పట్టుకొని పచ్చగా బంగారంలా వుండేది. మా చిన్నప్పుడు, ఆ కొక్కెంలా వున్న కాడలతో, కోడిపందేలాట ఆడుకునే వాళ్ళం!

సాయంకాలం ఐదు కొట్టగానే, ఆ నిద్రగన్నేరు చెట్టు నీడలో, క్లబ్బులో పనిచేసే కుర్రాళ్ళు, ఆనవాయితీగా పది పేము కుర్చీలు వేసే వాళ్ళు.. ఓ చిన్న కాఫీ బల్ల చుట్టూరా! కాఫీ బల్ల మీద ఇంగ్లీషు దినపత్రికలు, తెలుగు వార పత్రికలూ, ముఖ్యంగా నెలవారీ వచ్చే భారతి, పడేసే వాళ్ళు. ఆరు గంటలు కొట్టంగానే ఖద్దరు పంచె బిళ్ళగోచీతో పెద్ద రాజు గారు, గ్లాస్గో పంచె వారగోచీతో పెద్ద ప్లీడరు గారు, కాలేజీ లెక్కల మేష్టారు, జరీపంచె, జరీకండువా లాయరుగారు, వైసు ప్రిన్సిపాలు గారు, ఎకనామిక్స్ మేష్టారు, అప్పుడప్పుడు టకప్పు చేసుకోని మా డాక్టరుగారు వచ్చేవాళ్ళు! బోలెడు విశేషాలు, లోకాభిరామాయణం చెప్పేవాళ్ళు. రాజకీయాల వాదోపవాదాలు జరగడం కూడా కద్దు. జరీపంచ లాయరు గారు ఏదో అనవసర ప్రసంగం చేసేవారు. అంతే! మా లెక్కల మేష్టారు వాదనలోకి దిగి, నిష్కర్షగా ఒకటి, రెండు, మూడు, ఖతం అన్నట్టు ఆఖరి మాట చెప్పేసే వాడు. అందరూ మాట్లాడకండా వెఱ్ఱి మొహాలేసుకొని వినాల్సిందే. అడపా తడపా, పైసా స్టేకు పేకాటలో ఆట పారేసిన (రమ్మీ లో డ్రాపు అంటారు) మధ్యకారు ప్లీడర్లు మధ్యలో వచ్చి, ఏదో తెలిసినట్టు విసుర్లు వేసి పోయేవాళ్ళు. వెంటనే మా చెవిటి మేష్టారు, కెమిస్ట్రీ మేష్టారూ, మెత్త మెత్తగా వాళ్ళకి చివాట్లు పెట్టేవాళ్ళు. పెద్దరాజుగారు, పెద్ద ప్లీడరుగారు వెళ్ళే వరకూ మేము నోరెత్తకుండా వింటూ కూచునే వాళ్ళం. వాళ్ళు సరిగ్గా ఎనిమిది కొట్టంగానే పంచెల కుచ్చిళ్ళు సర్దుకొని ఇళ్ళకి పోయేవాళ్ళు. అదేదో, గంట కొట్టగానే పాల కోసం పరిగెత్తే పిల్లుల్లా.. వాళ్ళు వెళ్ళంగానే, మా వాగుడు మొదలెట్టే వాళ్ళం, సిగరెట్లు వెలిగించి! ఎందుకనో తెలీదు.. వాళ్ళ ముందు సిగరెట్లు కాల్చే వాళ్ళం కాదు!

ఈ నిద్రగన్నేరు చెట్టు ఎందరో "జనాల మనోగగనంలో చాపుకున్న జ్ఞాపకాల కొమ్మలనీ, గాఢానురాగాల ఊడల్నీ" వెనక్కి పిలిచి పిలిచి చెపుతున్నట్టుంటుంది.

కవిగారూ! క్షంతవ్యుడిని!!

మా డాక్టరు గారు మమ్మల్ని రమ్మీనుంచి విముక్తులని చేసి, బ్రిడ్జ్ ఆటలోకి దింపింది.. ఈ చెట్టు కిందే! ఆయన్ని ఎవడో హత్య చేసి చాలాకాలం అయ్యింది. కానీ, ఆయన అన్న మాటలు చెవుల్లో ఇంకా రింగు రింగుమని గంటల్లా వెంటాడుతూనే ఉన్నాయి. 'రమ్మీ ఆడటం ఎందుకు మానేశారండీ' అని అడిగితే, ఆయన ఇచ్చిన సమాధానం. "ఏ ఆట అయితేనేం! చేతిలో పదమూడు ముక్కలేగా కావలిసింది. బ్రిడ్జ్‌లో ఆట పోతుంది కానీ డబ్బులు పోవు. రమ్మీలో ఆటా పోతుంది, దానితో డబ్బులూ పోతాయి. అందుకని బ్రిడ్జ్‌లో పడ్డా." అప్పటి నుంచీ మేమూ బ్రిడ్జ్ ఆటలో పడ్డాం, ఆయనతో పాటూ!

క్లబ్బులో ఎలెక్ట్రీ లైట్లు తెగ పోయేవి. ఈ ఎలక్ట్రీ బాధ అప్పుడే వుండేది. దానికి తోడు, ఎలక్ట్రీ డిపార్ట్‌మెంటు ఇంజనీర్లు క్లబ్బులో, ఎడతెరపి లేకుండా పెద్ద ఎత్తునే పేకాడుకునేవాళ్ళు. వాళ్ళకి తోడు సెంట్రల్ ఎక్సైజు ఇనస్పెక్టర్లూ! లైట్లు పోయినప్పుడు, రమ్మీ జనం గొల్లున గోల చేసేవాళ్ళు.. క్లబ్బు కుర్రాళ్ళని పెట్రమాక్స్ లైట్లు వెలిగించమని! కొందరైతే, పనిచేసే కుర్రాళ్ళని అడ్డమైన తిట్లూ తిట్టేవాళ్ళు. ఎలెక్ట్రీ డిపార్ట్‌మెంటు ఇంజనీర్లని నానా మాటలూ అనేవాళ్ళు. వీళ్ళకి, పారేసిన పేకముక్కల్ని చీకట్లో దొంగతనంగా ఎవడన్నా ఎత్తుకుంటాడేమోనని భయం!

అయితే, చెట్టు కింద బ్రిడ్జ్ జనానికి ఆ బాధ లేదు. పైగా, బ్రిడ్జ్ ఆటలో సుఖం (కష్టం?) ఏమిటంటే.. చేతిలో ముక్కలు, పారేసిన ముక్కలూ అందరికీ గుర్తుండాలి. అలా గుర్తుండేవి కూడా! లైట్లు పోయినప్పుడు, ఆ నిద్రగన్నేరు చెట్టు పూలగుత్తులు, 'పచ్చటి చీకట్లో మంటేదో ఎర్రగా కదిలి' నట్లుండేది. లైట్లు తిరిగి రాగానే, 'వంద వాయిద్యాలతో వికసించిన బ్యాండు మేళంలా, అకస్మాత్తుగా చిగురించినట్టు, గల గల పూలగుత్తులు కురిపించిందా అన్నట్టు' ఉండేది. చెట్లని అనుభవించడం చేతకానివాళ్ళకి ఆ అనుభవంలో ఆనందం తెలియదు!

★★★

రెడ్డిగారు చెప్పుకు పోతున్నారు. నేను వినటల్లేదని, ఎక్కడో గగనవీధిలో ఎగిరి పోతున్నాననీ పసిగట్టి, "అయ్యా! కాస్త ఓపిగ్గా వినండి. అడిగారు గదా!" అని హెచ్చరించారు.

నేను వెంటనే 'ఎక్స్క్యూస్ మీ' అని, మరో రెండు జిగ్గర్ల స్కాచ్ ఐసు మీద పోసుకున్నా.

"ఆనందం.. క్లబ్బు ప్రెసిడెంటు అవడం మీకు తెలుసుగా! అప్పుడు క్లబ్బు వైభవం అంతా ఇంతా కాదు. స్కూటర్లకి షెడ్డు కట్టించారు. పక్కనే మునిసిపాలిటీ వాళ్ళ స్థలం ఆక్రమించి, రెండస్తుల మేడ వేశారు. అంతా పేకాట మహిమేననుకోండి! క్లబ్బుకి లక్షల మీద లక్షలు ఆదాయం. ఒక ఐదారేళ్ళు ఏ ప్రెసిడెంటూ గుక్క తిప్పుకోలేక పోయాడు. ఆనందం తర్వాత, ఐదుగురు పెద్దమనుషులు ప్రెసిడెంట్లయ్యారు. ఈ ముసలం ఎప్పుడు మొదలయ్యిందీ అని అడగండి?" అంటూ ఆయన మరో విడత స్కాచ్ సోడా కలుపుకున్నాడు.

"చెప్పండి! ముసలం మొదలవడమేవిటి?"

"అప్పలరాజు నాయుడు సెక్రటరీ అయ్యాడు. స్కూటర్లు, మోటారు సైకిళ్ళూ క్లబ్బులోకి సరాసరి రావడానికి, చెట్టు మొదలు మినహాయించి.. మొత్తం మట్టి కనిపించకండా అంతా గచ్చు చేయించాడు. 'అదెందుకయ్యా' అని అడిగితే, చెట్టు కింద మట్టి, వర్షాలొస్తే బురద బురదగా తయారయి, మనుషులూ మోటారు బండ్లూ జారి పడే ప్రమాదం ఉందని, గచ్చు చేయించాడుట! విన్నారా వింత! ఇన్నేళ్ళుగా ఎవ్వడూ కాలు జారి చెట్టు కింద మట్టిలో పడలేదు."

నాకు 'వానొచ్చినప్పుడు చెట్టు కింద కూర్చున్న రోజులు' గుర్తుకొచ్చాయి. వాన చినుకులు పడినంతసేపూ, చెట్టు కింద ఒక్క చుక్క కూడా రాలేది కాదు. అలా హఠాత్తుగా ఒక మేఘం యుద్ధం ప్రకటించినపుడు, మేము నెత్తి మీద రుమాళ్ళు వేసుకోని పరిగెత్తి, తల దాచుకునే వాళ్ళం కాదు. వాన తగ్గి, గాలి వీచినప్పుడు మాత్రం, చెప్పకుండా, చెయ్యమంటా, క్లబ్బులో నిద్రగన్నేరు చెట్టు 'తన ప్రైవేటు వానతో' తడిపేసేది మిమ్మల్ని!

"ఏమండోయ్ మిమ్మల్నే.. వింటున్నారా" అని ఆయన కసిరే వరకూ ఈ స్పృహలోకి రాలేదు. రెడ్డిగారు చెప్పుకు పోతున్నారు.

"అసలు వీళ్ళ రోగం ఏమిటంటే. క్లబ్బుకి బాగా డబ్బులొస్తున్నాయిగా! ఎన్నికయిన ప్రతివాడూ ఏదో పేరు పెట్టుకొని పని చేయించాలి, వాడి హయాంలో! మీకు తెలీదు గానీ, గచ్చు చేయించిన తర్వాత, చెట్టు కింద కూర్చోడం మహా కష్టంగా ఉండేది. ఎండల్లో చచ్చే వేడి. నిద్రగన్నేరు పూలు కూడా పడటం తగ్గింది. చుట్టూ గచ్చు చెయ్యడం మూలంగానో ఏమో

మరి! ఒక రోజున అప్పలరాజు నాయుడు తిన్నగా క్లబ్బు లోపలికి స్కూటర్ మీదొచ్చి, చెట్టు పక్కనే దభేలుమని పడ్డాడు. ఎడమకాలు విరిగింది. పుర్రచెయ్యి అదే! వాడు పేకముక్కలు పట్టుకునే చెయ్యి ముంజేతి కణుపు దగ్గిర బెణికింది. అప్పటి పెద్ద ఘటాల్లో చాలామంది పోయారు. బాగా వయసు మీరిన వాళ్ళు క్లబ్బుకి రావడం మానేశారు. ఇప్పుడు, చెట్టు కింద కూచునే జనం ఎవ్వరూ లేరు.. నేను, ఈ రాజుగారూ తప్ప! అడపా తడప, గాడిదాట సుబ్బయ్య గారున్నూ! ముత్యంగా మూడు కుర్చీలు కూడా వేసేవాళ్ళు కాదు. సెక్రటరీ అప్పలరాజు నాయుడు పడ్డప్పుడు మేము లేము. క్లబ్బు కుర్రాళ్ళు చెప్పగా వినడమే! అప్పలరాజు నాయుడు చెట్టుపక్కన పడంగానే, మా రెడ్డిశాస్తుర్లు ఊరుకోకుండా, 'నే చెప్పలా! ఆగ్నేయంగా చెట్టు అనర్థం అని! ఇవాళ అప్పలరాజు నాయుడు పడ్డాడు. రేపు, ప్రెసిడెంటు కోదండంగారికే ముప్పు రావచ్చు!' అని, ఆరు డ్రాపుల తరువాత, రెండు సీసాల బ్రాందీ పట్టించి, తన మిడి మిడి వాస్తుజ్ఞానం మళ్ళీ ప్రదర్శించాడు. ఈ వాగుడు ఎవడో కోదండం గారికి చెప్పాడు. ఆయన ఇద్దరు సాయిబాబాల భక్తుడు. చాలా పెద్ద స్టేకు పెట్టి, పేకాట ఆడతాడు. ఆయన వెంటనే, తణుకు నుంచి ఆంజనేయులు శాస్త్రిగార్ని వెంటనే రమ్మని క్లబ్బు నుంచే ఫోను చేశాట్ట! ఆంజనేయులు శాస్త్రి మరుసటి రోజునే గురవయ్య చౌదరి గారిని వెంటబెట్టుకోని క్లబ్బు కొచ్చేశాడు."

"వీళ్ళెవళ్ళు? క్లబ్బుతో వీళ్లకేమి సంబంధం?" అని అడిగా.

రెడ్డిగారు మరో పెగ్గు స్కాచ్‌లో సోడా కలిపి, మొదలెట్టారు. "మీకు తెలియదు. ఈ జిల్లాలో వాళ్ళిద్దరూ వాస్తు బ్రహ్మలు! అప్పలరాజు నాయుడు చెట్టు చుట్టూ గచ్చు చేయించేటప్పుడు, వాళ్ళని సంప్రదించలేదని, గురవయ్య చౌదరిగారు మండిపడ్డాడట! ఇంతకన్నా ముందు ఇంకొకటి చెప్పాలి. అసలు, కోదండం వైసు ప్రెసిడెంటుగా నెగ్గాడు. అప్పలరాజు నాయుడు బావ జోగయ్య నాయుడు ప్రెసిడెంటు అయిన మూడో రోజునో, నాలుగో రోజునో, ఆయనకి హఠాత్తుగా క్లబ్బులో గుండె నెప్పి వచ్చింది. జోగయ్య నాయుడిని చిన్న కార్లో హుటాహుటిన హైదరాబాదు తీసుకుపోయారు. ఆయన ఇంకా కోలుకోలేదు, మంచం మీదే వున్నాడు. ఆయన చేత బలవంతంగా రాజీనామా చేయించారు. ఆయనకి, గురవయ్య చౌదరి చెప్పాడుట. 'గచ్చు చేసినప్పుడు, దక్షిణం వేపు ఉత్తరం వేపు కన్నా ఎత్తు ఎక్కువయ్యిందిట. అది క్లబ్బు పెద్ద ఎవడైతే వాడికి హానిట. మరి, క్లబ్బు పెద్ద అంటే, ప్రెసిడెంటే గదా! అందుకే, కోదండంగారికి హృద్రోగం వచ్చిందిట.' అది విని, కోదండం, అప్పలరాజు నాయుడి మీద కత్తులు నూరుతున్నాడట. లేచే ఓపిక లేదు గానీ, అప్పలరాజు నాయుడిని నరికి పారెయ్యాలి అంటున్నాడుట!

ఏది ఏమయితేనే! వాస్తు బ్రహ్మలు, ఆంజనేయశాస్త్రి, గురవయ్య చౌదరీ, ఇద్దరూ వచ్చారు. విరుగుడు మంత్రం చెప్పారు.. నిద్రగన్నేరు చెట్టు కొట్టెయ్యమని! ఈ చెట్టు ఇక్కడ వుంటే, క్లబ్బుకి ఇంకా బోలెడు అనర్థాలు వస్తాయి అని నొక్కి చెప్పి, క్లబ్బు డబ్బు పది వేల రూపాయలు భరణం తీసుకోని, మర్నాడే తణుకు వెళ్ళిపోయారు.

మరుసటి ఆదివారం పొద్దున్నే, నిద్రగన్నేరు చెట్టుని అప్పలరాజు నాయుడు దగ్గిర ఉండి మరీ నరికించాడు. ఇదీ, నిరిటి వరకూ జరిగిన భాగవతం.. క్లబ్బులో నిద్రగన్నేరు చెట్టు కథ!"

"మరయితే, ఇప్పుడు క్లబ్బు బాగా నడుస్తున్నదా?" అని అడిగా.

రెడ్డిగారు, మందహాసం చేసి, "మళ్ళీ వచ్చే ఏడు మీరు ఏలూరు రాక ముందే, క్లబ్బు దివాలా తీస్తుంది! పేకాట పూర్తిగా పడిపోయింది. దొంగ తాగుడు బాగా పెరిగింది. ప్రస్తుతం ఇప్పుడు, క్లబ్బుకి, ఎలక్ట్రీ బిల్లు కట్టడానికి కూడా డబ్బులు లేవు. పేకాట ఉంటే కదా, డబ్బులొచ్చేది! పీడా వదిలి పోతుంది లెండి, తథాస్తు!" అంటూ రెడ్డి మేష్టారు కథ ముగించారు...

క్షుద్ర గృహాలకి (గ్రహాలకి!) అతీతంగా ఎదిగిన, "డెబ్బై ఐదేళ్ళ నిద్రగన్నేరు చెట్టు కొట్టేసారు. ఇప్పుడు 'చిగిర్చే చెట్టు' లేదు. చీకట్లో దారి తప్పి 'ఎగిరే పిట్టలు' లేవు.

"చిలకలు వాలిన చెట్టు లోతైన కావ్యం లాంటిది" ట! అది ఎందరికి తెలుసు?

*("చెట్టు" ఇస్మాయిల్ గారికి అనేక వందనాలతో.)*

*("సంచిక" జులై 2001, అంతర్జాల మాసపత్రిక నుంచి పునర్ముద్రణ)*

## కథామంజరి
## పాఠకమహాశయులకు
## మనవి!

ప్రతినెలా కథామంజరి సంచిక నమోదు చేసుకున్న పాఠకుల ఇమెయిల్స్‌కి నేరుగా చేరడమే కాకుండా, ఇతర సాంఘికమాధ్యమాలు, కథామంజరి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎంతో మందికి సంచిక చేరుతోంది.

అలాగే పాఠకులు కూడా వారివారి బంధుమిత్రులకు ఈ మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఈ రోజు కథామంజరి దేశ, విదేశాల్లో ఎక్కువ మందికి ఏదో విధంగా చేరుతోంది. పాఠకుల సంఖ్య పెరగడం సంతోషమే! అయితే, సాంకేతికంగా పత్రిక నిర్వహణకు, కొన్ని వెసులుబాట్లకు .. సంచికను చదివే పాఠకుల సంఖ్య తెలుసుకోవడం అసాధ్యమైన పనే! అంచేత మా మనవి ఏమిటంటే.. కథామంజరి చదివే పాఠకులు ప్రతి ఒక్కరు ఇమెయిల్ నమోదు చేసుకోవలసినదిగా కోరుతున్నాం. మీరు ఇమెయిల్ నమోదు చేసుకోడానికి ఈ లింక్ ని క్లిక్ చేయండి.

| వార్షిక చందా రూ.200/- | ఉచిత సంచిక కోసం |
| --- | --- |
| https://imjo.in/ebrJuh | https://zcmp.in/K93t |

పత్రికకు చందా ఐచ్ఛికమే ఐనా చందా కట్టినా, కట్టలేకపోయినా సరే, పత్రిక అందరికి అందుబాటులోనే ఉంటుంది.

**కథామంజరి బృందం**